జూలై 01-15, 2022

సంపుటి 02, సంచిక 15

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



## తెలంగాణకు హరితహారం



# దొడ్డి కొమురయ్య

( వర్ధంతి : జూలై 04)

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి ఆద్యుడు, తొలి అమరుడు దొడ్డి కొమరయ్య

తెలంగాణ సాయుధ పోరాటం ప్రారంభమవడానికి భూమికోసం, భుక్తికోసం, విముక్తి ఉద్యమంగా పోరాటం మారడానికి దొడ్డి కొమరయ్య అమరత్వమే ప్రధాన కారణం. తెలంగాణ సాయుధ పోరాటం చరిత్ర అని తలుచుకోగానే మొదటగా స్ఫురణకు వచ్చే వ్యక్తి దొడ్డి కొమరయ్య. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కడివెండి గ్రామంలో ఒక సాధారణ కురుమ కులానికి చెందిన గొర్రెల కాపరుల కుటుంబములో జన్మించిన కొమరయ్య ఒక మహోన్నత ఉద్యమానికి ఆద్యుడవడం తెలంగాణ ప్రజలకు గర్వకారణం.


*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***

Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.

Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.

Editor : **KALVAKUNTLA KAVITHA**

# ఈ సంచికలో




పాటగా పరిమళించే ఒక అతన్ని
వివరించిన **నామాలసూరి...**
02 **"పాట చెట్టు"** కవిత




19 **జ్వలించే రాణివాసపు స్త్రీలని చిత్రించిన అనుమాండ్ల భూమయ్యను** ఆవిష్కరించిన **త్రివేణి** వ్యాసం...



15 ధనాహంకారంతో అల్పజీవుల ఆశలను తమ స్వార్థానికి వాడుకున్న **తులసికుంతి** కథ... **"కనువిప్పు"**



09 **బాలబ్రహ్మచారి అవధాన** హేలను వివరించిన **భీంపల్లి...**



36 పూల బతుకమ్మకు మరో ఆవిష్కరణ



39 మానవ సబంధాల మాధుర్యం చిత్రించిన **గంగాధర్** కథ... **"గుర్తుంచుకొండ్రి"**



05 ప్రజల కోసం నడిచే వీరుల చైతన్యం చిత్రించిన **ఆవుల పిచ్చయ్య...** **"ఊరేగింపులు"** నాటి కథ...



**బతుకమ్మ పండుగను** మరోకోణంలో చిత్రించిన **గునుగుంట్ల శైలజ** వ్యాసం... 35

ఆలోచనాలోచనాలతో స్త్రీ, పురుష సంబంధాలు చిత్రించిన **"పడమటి గాలి, తూర్పుగాలి"**నవలను సమీక్షిస్తున్న **కూర చిదంబరం...** పేజీ 31

**మానవ సంబంధాలను** మరో కోణంలో చిత్రించిన కథనానికి **కూర చిదంబరం** పరిచయం.... పేజీ 31

కవి హృదయం అందించిన మేఘ సందేశం చిత్రించిన **హరనాథ్** కవిత... **'హృదయేశ్వరి'** ...పేజీ 25

ఆంగ్ల పదాలకు తెలుగు అనుకరణతో హాస్యం సృష్టించిన **"ఉపనయనం"** కథ..పేజీ 27

నాన్నతనం చిత్రిస్తూ ఎదమీటిన **మాణిక్యం** కవిత... **"హిడెన్ హీరో.. నాన్న"....** పేజీ 04

తెలిసిరాని కాలం కథను వల్లె వేసిన **రమేష్ నల్లగొండ** కవిత.. **"జీవిత పుస్తకం"...** పేజీ 30

తెలంగాణ భాషలో జానపదుల ఒరవడి చిత్రించిన **ఉలి** **'ఇకమత్'** కథ... పేజీ 44

**ఇంకా...** మరెన్నో కవితలు, సాహితీ శిఖరం, సమాజం, పుస్తక పరిచయం, స్వీకారం.. మొదలైనవి...

కవిత



# పాట చెట్టు

రవీంద్రసూరి నామాల, 98483 21079

అతడు కనబడడం లేదు
పాటై వినబడుతూ ఉన్నాడు

మనిషికి మరణమే కాదు
మరణించాక బతుకూ ఉంటుందని
అతడు కనిపించకుండా పోయేంతవరకూ
తెలియనే తెలియలేదు

బతుకు రహస్యం తెలియాలంటే
చచ్చిపోయే నేర్పుండాలి
చరిత్ర రాసుకోగల ఓర్పు ఉండాలి

అతడిప్పుడు చర్చ అయ్యాడు
చరిత్ర మరవని పాట అయ్యాడు
నింగి నుండి నిత్యం కురిసే
వెన్నెలసిరులయ్యాడు

అతడు వినిపించడం లేదు
సంగీతమై కనిపిస్తున్నాడు

వెన్నెల నుండి వెలుతురును
వేరు చేయలేనట్టుగా
పాట నుండి ఆయనను దూరం చేయలేము
రాగం, తాళం, పల్లవి అన్నట్లుగా
పాట, సాహిత్యం, సిరివెన్నెలగా మెరవాలి
సంగీత ప్రపంచం మురవాలి

ఇప్పుడతని జాడలేదు
వాడ వాడలో పాట నీడలో
పరిమళిస్తున్నాడు

పాట తన గర్భంలోంచి
అతన్ని కొత్తగా కంటోంది
మరణించాయనుకున్న స్వరాలకు
పాట కొత్త ఊపిరిపోస్తోంది
నింగి నుండి నేలదాక
రాగాలాపన వినిపిస్తూనే ఉంది
సాహిత్యానికి చావు లేదు
సంగీతానికి మరణం లేదు

ఇప్పుడు సాహిత్యం కావాలి
సాహిత్యం సంగీతమవడం కావాలి
వెన్నెల మొలవాలి
సిరులను కనాలి
నేలమీద సిరివెన్నెల
నిలువెత్తుగా నిలవాలి

ఇప్పుడతడు కనిపిస్తున్నాడు
ప్రపంచ స్వరమై హోరెత్తిస్తున్నాడు
ప్రతి ఇంటిలో పాట చెట్టు అయి
చిగురులు వేస్తూ ఉన్నాడు

సంపాదకీయం


# తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

1-15 జూలై, 2022

సంపుటి 02 సంచిక 16





శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్





డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614



ఎడిటోరియల్ బోర్డ్ :
ఘనపురం దేవేందర్
రంగు నవీనాచారి


# తెలుగెంత తీయన?

భాష ప్రవాహం వంటిది. ఇతర భాషాపదాలు మన భాషలో చేరడం ఒక అనివార్యమైన పరిణామం. మన భాషా పదాలు ఇతర భాషల్లోకి వెళ్ళడమూ ఇట్లాంటిదే. విభిన్న పాలకులు తెలుగును (తెలంగాణను) పాలించడంవల్ల విభిన్న సంస్కృతులు ఇక్కడ వెల్లివిరియడం వల్ల ఈ ఆదాన ప్రదానాలు జరిగాయి. దీనివల్ల భాష మరింత సుసంపన్నమౌతుంది. భావవ్యక్తీకరణకు మరింత బలం చేకూరుతుంది.

కాని భాషలో ఇంకో చమత్కారం ఉంటుంది. కొన్నిసార్లు తనకు మాత్రమే సొంతమైన పదాలు ఉంటాయి. తన జాతికి, అస్తిత్వానికి, తనదైన సంస్కృతికి భాష నిలువగలుగుతుందంటే ఇట్లాంటి లక్షణాలే కారణం. తెలుగు భాషలో జంటపదాలే తీసుకోండి. తెలుగు కవులకు, తెలుగు జాతీయులకు తప్ప అన్యులకు వాడకం సాధ్యం కాని పదాలు ఎన్ని కనబడతాయి? పరిశీలిస్తే ఎంత ఆశ్చర్యం ఆనందం కలుగుతుంది? తెలుగులో ప్రత్యయాల ప్రయోగాలు చూస్తే ఎంత ముచ్చటేస్తుంది? 'కారము' అనే పదం తీసుకొండి. ఇది వివిధ పదాల సమాహారంతో కొత్త అర్థాల స్ఫురణకు దోహదం చేస్తుంది. ఉపకారము, మమకారము, అపకారము, గుణకారము, అంధకారము, సాకారము, ప్రాకారము ఇట్లా ఎన్ని పదాలైనా చూడవచ్చు. ఉపసర్గల వినిమయంతో తెరుచుకునే భాషా సొగసులు గ్రహించవచ్చు.

కొన్ని పదాలు ఎటునుంచి చదివినా ఒకే అర్థం వచ్చి ఆనందం కలిగిస్తాయి. కిటికి, వికటకవి, జలజ, నటన, కనుక లాంటి పదాలు ఇందులకు ఉదాహరణ. కొన్ని ధ్వన్యనుకరణ పదాలుంటాయి చరచర, జరజర, పుసపుస, కస్సుబుస్సు, ఢాంమ్మని, గిలగిల, పకపక లాంటి పదాలు తెలుగుకే చెందినవి గమనించవచ్చు.

తెలంగాణ తెలుగుపైన సంస్కృతం, ఉర్దూ, ఆంగ్లం లాంటి భాషా ప్రభావాలు ఎన్నోవిధాలుగా గమనించవచ్చు. తద్వారా సాధించిన కొత్త సొగసులను ఆస్వాదించవచ్చు. ఈవిధంగానే మౌలిక పదాల మీద దృష్టిపెట్టినప్పుడు జంటపదాలను కూడా ప్రత్యేకంగా గమనించాలి.

ఆ వ్యక్తి "అందం చందం" నాకు బాగా తెలుసు. మీ విషయం 'ఊరు వాడ' విన్నాయి. ఆయనకేమిటి 'చీకు చింత' లేక హాయిగా ఉన్నాడు. వాళ్ళకు 'ఈడు జోడు' బాగా కుదిరింది. ఇలాంటి పదాలు భాషలో కోకొల్లలుగా కనిపిస్తాయి. అమ్మానాన్నలు, భార్యాభర్తలు లాంటి పదాలలో స్త్రీ ప్రాధాన్యం తెలుస్తుంది. ఒక్కోసారి జంటపదాలు ఒక అంశం యొక్క ఇరు పార్శ్వాలని ప్రతిబింబిస్తాయి. మరికొన్ని మొదటి, చివరి సమాచారం సూచిస్తాయి. కష్టసుఖాలు, కలిమిలేములు లాంటి పదాలు రెండు పార్శ్వాలు చూపించేవి. సూర్యచంద్రులు లాంటి పదాలు ఉభయ ప్రాధాన్యాలు కొన్ని వ్యతిరేకార్థకాలు కలిసి కనబడతాయి. ఇంచుమించు అనే పదంలో ఇంచు అల్పత్వాన్ని, మించు ఔన్నత్యాన్ని సూచించే పదం. సందర్భాన్ని బట్టి, వ్యక్తి అభిరుచిని బట్టి వాడే ఈ పదాలలో ఒక జాతి సాంస్కృతిక జీవనం నిక్షిప్తమై ఉంటుంది.

తెలంగాణ తెలుగుపైన ప్రసరించిన ఇతర భాషా ప్రభావం చాలావరకు ఒక దశలో మేలే జరిగింది. తత్సమ, తద్భవ దేశ్యాది పదాలు మొదలుకొని నేడు ఇంగ్లీషు పదాలను సైతం కలుపుకొని తెలుగు భాష గొప్ప వ్యక్తీకరణలను సాధించింది. ఆంగ్లం తన పరిమితి దాటిన వినియోగం వల్ల మన భాష ప్రశ్నార్థకంగా మారిపోయింది. అంతర్జాతీయ భాషగా ఉన్న ఆంగ్లాన్ని కాదనే పరిస్థితి అసలే లేదు. అట్లాగని తెలుగు మౌలిక భాషా సొగసులను కోల్పోతే మన అస్తిత్వానికి అర్థమేది?

ఒకప్పుడు సంస్కృతాన్ని, ఉర్దూను, ఇంకా అనేక భాషలను సంస్కృతులను ఆదరించిన (తెలంగాణ) తెలుగు ఆంగ్లాన్ని కూడా తనలో కలుపుకొంది. కాని మాతృభాష ప్రత్యేకతను, అస్తిత్వాన్ని ఎరవేస్తే అది జాతికే ప్రమాదం. కాబట్టి తెలుగు భాషను కాపాడుకుందాం. ఇతర భాషా సొబగులను స్వీకరిస్తూ మనలోని మౌలిక అంశాలకు మరింత వన్నెలు అద్దుకుందాం.

*జై తెలంగాణ, జై జాగృతి.*

కవిత

# హిడెన్ హీరో... నాన్న

జి. మాణిక్యం, 94921 64107

అమ్మ పురిటి నొప్పుల పడితే...
నువ్వు పుడమి నొప్పులు పడుతున్నావు...
నువ్వు సద్దన్నం తిని..
నన్ను సదువుకోమంటున్నావు...

బుక్కెడు బువ్వ కోసం...
కడుపు నిండా తిండి లేక...
కంటి నిండా నిద్ర లేక...
ఎన్ని రాత్రులు జాగారం చేస్తున్నావో...
ఎన్ని బాధలు పడుతున్నావో...

బతుకు చిత్రంలో బానిస బందీగా బతుకీడిస్తూ...
కష్టాల కడలిలో కన్నీటి సాగరాన్ని దాటుతూ...
మనసులో మానని గాయాలను మోస్తూ...
కాటికి పోయేంతవరకూ కలవరింతలతో బతుకుతూ...
కాలాన్ని అలలనే కలలతో ఈదుతున్నావు...

నువ్వు ఎండకు ఎండి
వానకు తడిసి చలికి వొనికి
నన్ను ఉన్న స్థితి నుండి
ఉన్నత స్థితికి పొమ్మంటివి...

నువ్వు హలం పట్టుకొని...
నన్ను కలం పట్టుకోమంటివి..
నువ్వు కర్షకుడై పార తట్లతో కూలికిపోయి...
నన్ను ఫ్యాను కింద కంప్యూటర్ ముందు కూర్చోమంటివి...

నువ్వు బాటా చెప్పులు కొనుక్కొని
నాకు బెల్టు చెప్పులు కొంటివి...
నువ్వు పురుగులన్నం తిని...
నాకు పెరుగన్నం తినిపిస్తివి...

దిక్కు మొక్కు తెలియక
దారి తప్పిన నాకు ...
దశ దిశ నిర్దేశించిన దిక్సూచివైనావు ...
నా గమ్యానికి నీ గమనాన్ని మరిచిన నావైతివి...

ఆకాశం ఏడుస్తూ ...
భూమిని పులకరింపజేసినట్లు ...
నెత్తురుని చెమటలా ధారవోస్తూ ..
మమ్మల్ని ఆనంద వర్షంతో తడిపిస్తున్నావు ...

చీకటి బతుకులో చంద్రుడిలా ...
పగటిలో సూర్యుడి మైనపు
ముద్దలా కరిగిపోతూ వెలుగునిస్తున్నావు ...

చిన్నప్పుడు నా సంతోషం కోసం
గుర్రపుబండయ్యావు ...
పెద్దయ్యాక నా బంగారు భవిష్యత్తు కోసం
బానిసై బాటలేస్తున్నావు ...
నువ్వు ఓడిపోతూ నన్ను గెలిపిస్తున్నావు ....
అవును... మా నాన్న గరళం మింగిన శివుడు

విశ్వానికి విలనుగా కనిపిస్తూ ...
విజయానికి వారధిగా నిలుస్తూ ...
బతుకు బండిని రథసారథిగా నడిపిస్తూ..
కంటికి కనిపించని కథానాయకుడు
(హిడెన్ హీరో) మా నాన్న...

నీకు నేనేమివ్వగలను నాన్న ...?
నువ్వు నాటిన విత్తుని నేను...
ఎన్ని అడ్డంకులొచ్చినా కొడవలై చీల్చుకుంటూ ...
పెద్ద వృక్షంలా పెరిగి నలుగురికి నీడనందించి...
నీ పేరుతో ఫలాన్ని అందివ్వడం తప్ప...!

నువ్వు లేకుండా నేనెట్లుండేది నాన్న ...
నా ఆయువుకు ప్రాణ వాయువు నీవే కదా...!



నాటి కథ

# ఊరేగింపులు

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో తొలి అమరుడు
దొడ్డి కొమురయ్య అంతిమ యాత్రను దృశ్యమాన్యం చేసిన కథ...



ఆవుల పిచ్చయ్య

జైజైజై అనే శబ్దం గ్రామం వెలుపల తోటబావి మీద కూర్చుని మొఖం కడుగుచుండగా వినవచ్చింది. ఇంతలో గ్రామాల నుండి కొందరు ప్రజలు ఎర్ర జెండాలు తీసుకొని గ్రామంలో వెళ్ళు చుండగా చూచాను. నా హృదయం అతి వేగంగా కలవరపడింది. ఒక క్షణమైనా ఆగలేక పోయాను. నోటిలో వున్న పండ్ల పుల్లను తీసి నేలకు కొట్టి గ్రామంలోకి పరుగెత్తాను. కాని ఏమైందో సాధ్యమైనంత తొందరలో తెలుసుకోవాలని ప్రయత్నించాను. గ్రామం చివరలోవున్న గొల్ల యువకుడైన గంగయ్య ఇంటికి వెళ్ళి చూచేసరికి ఎవ్వరూ లేరు, తొంబయి సంవత్సరముల వృద్ధురాలు మాత్రం ఉంది. చేతిలో కట్టె తీసుకొని బయటికి రావటానికి ప్రయత్నించుచున్నది. "ఏమవ్వా గ్రామంలో ఏం జరుగుతుందని" అడిగాను..

అడవి పొలాలలో బావుల దగ్గర ఎక్కడ కూడా ఒక మానవుడు లేడు, అంతా గ్రామంలోకి చేరుకొన్నారు. నా కాళ్ళు ఏమాత్రం నిలబడటం లేదు. నేను ఎటు అడుగు వేస్తామన్నా, అడుగు లేవటంలేదు. గ్రామంవైపు మాత్రం అడుగుపడుతుంది. దారిలో వస్తూ ఉండగా గొర్రెలన్నీ గుంపులు గుంపులుగా వుండి ఇతర చెలకలవైపు వెళ్ళకుండా క్రిందికి తలలు వేసి నిశ్శబ్దంగా నిలబడ్డవి.

"ఇవ్వాళ మా అమరజీవి కొమరయ్య వీర మరణానికి ఊరేగింపు జరుగుతుంది. నేను అక్కడికే వెళ్ళుచున్నాను. నీవు కూడా రావయ్యా" అని చెప్పింది ఆ వృద్ధురాలు.

ఇంతలో నా పొలంలో నాటు పెడుతున్న 20, 30 మంది స్త్రీలు నాట్లు పెట్టుట వదలి గ్రామంలోకి వచ్చారు. వారు అంతా గందరగోళంగా వున్నారని నా జీతగాడొచ్చి చెప్పుగా వెంటనే పొలం దగ్గరకు వెళ్ళాను.

పొలంలో ఎవరూ లేరు. నీటిలో ఒరిగిన నారు దృశ్యం చూసేసరికి ఏదో విచారం. వెళ్ళబుచ్చుతున్నట్లుగా కనిపించింది. ఈ పాడిపంటలు చల్లగా ఉండాలని ప్రాణ త్యాగం చేసిన కొమరయ్య గురించి ఈ పొలం విచారపడుతున్నదని గ్రహించాను. ఇంతలో నా ప్రక్కనున్న పట్వారి పొలంలో నుంచి పెద్ద కేకలధ్వని వినబడుట వలన అక్కడికి వెళ్లి చూశాను.

జీతగాండ్రు ఒకరికొకరు తొంద తొందరగా పిలుచుకొనుచున్నారు. వ్యవసాయకూలీల కొరకు కొమరయ్య ప్రాణాలర్పించినందున ఈ వ్యవసాయ కూలీలు ఊరేగింపులో పాల్గొనటానికి తొందరపడుచున్నట్టుగా తెల్సుకొన్నాను.

అడవి పొలాలలో బావుల దగ్గర ఎక్కడ కూడా ఒక మానవుడు లేడు, అంతా గ్రామంలోకి చేరుకొన్నారు. నా కాళ్ళు ఏమాత్రం నిలబడటం లేదు. నేను ఎటు అడుగు వేస్తామన్నా అడుగు లేవటంలేదు. గ్రామంవైపు మాత్రం అడుగుపడుతుంది. దారిలో వస్తూ ఉండగా గొర్రెలన్నీ గుంపులు గుంపులుగా వుండి ఇతర చెలకలవైపు వెళ్ళకుండా క్రిందికి తలలు వేసి నిశ్శబ్దంగా నిలబడ్డవి. గొల్లవాండ్లు మాత్రం కావలి లేరు. వారు కూడా కొమరయ్యగారి ఊరేగింపులో పాల్గొనటానికి వెళ్ళినట్టు బోధపడింది. ముందు వెళ్ళి కాలువలో ముఖం కడుక్కొని వెళదామనుకొన్నాను.

**రచయిత గురించి...**

ఆవుల పిచ్చయ్య (1919-1969) సూర్యాపేటలో నిరుపేద కుటుంబంలో జన్మించిన వీరు కమ్యూనిస్టులు భూస్వాములకు వ్యతిరేకంగా సాగించిన భూపోరాటంలో పాల్గొన్న సమయంలో రెండేళ్ళకు పైగా జైలుశిక్ష అనుభవించారు. వీరు 1945-46 సంవత్సరాల్లో ఏడెనిమిది కథలు వ్రాసినట్లుగా తెలుస్తున్నది. వాటిలో 'దొరా' కథ ఒకటి.

కాలువ దగ్గరకు వెళ్ళేవరకు నీళ్ళు లేవు. బావి దగ్గరకు పోయాను. బావి మీద డొక్కలు గుంజుకపోయి ముందు గడ్డి మేత ఉన్నా మేయకుండా ఉన్న ఎడ్లను చూచి నాకు చాలా చిత్రమయినది. ఆలోచిం చాను. వేళగాని వేళ ఎన్నడూ లేనివేళ అకస్మాత్తుగా మోటలు మీదనే విడచి రైతు గ్రామంలోకి పోయాడని ఎడ్లు విచారంతో నిలబడ్డాయని తెలుసుకొన్నాను.

అంబాయని ధ్వనులు ప్రక్కవైపు నుండి ఒకేసారి వినబడ్డాయి. అటు చూచేవరకు శరీరమంతా బురద జల్లుకొని నాగళ్ళు మెడపై వేసుకొని మోకాటి లోతున బురద పొలాలలో నిలబడ్డ ఎడ్లను చూశాను. ఏమాత్రం కదలకుండా విశ్రాంతి తీసుకొని నిలబడ్డట్టు కనిపించాయి. పిట్టల కీచుకీచుమనే శబ్దం వినబడటం లేదు. సన్నని మంచు కురుస్తోంది. ప్రపంచ మంతా ఇవ్వాళ విచారం వెలిబుచ్చు తున్నట్లుగా కనిపించింది. కారుమబ్బులు పట్టాయి. మబ్బుల్లో తలదాచుకొన్న సూర్యుడు కనిపించటం లేదు. నా శరీరమంతా ఒకేసారి జలదరించింది. ఇక నిలబడలేకపోయాను.

గ్రామంలోంచి నినాదాలు ధ్వనులు వినిపిస్తున్నవి. ఈ అడివిలోన నా హృదయాన్ని కలవరపెట్టుచున్నాయి. ముందు నడవటం ప్రారంభించాను. మెల్లమెల్లగా అడుగులు వేస్తుంటే నినాదాల ధ్వనులు ఎక్కువగా వినిపించుతుంటే, అంత వేగంగా నా అడుగులు పడుతు న్నాయి. నేను ఎంత వేగంగా నడుచు చున్నానో నాకే తెలియదు.

గ్రామంలోకి వెళ్ళాను. ప్రజలందరు ఆంధ్ర మహాసభ ఆఫీసుకు వెళ్ళినట్లు తెలిసింది. అయినను ఇంటివద్ద ఆడు వాండ్లు ఉంటారనుకొన్నాను. ఇంటికి వెళ్ళేవరకూ ఎవ్వరూ కనబడలేదు. అతి వేగంగా పొంగుచూ పొయ్యిలోని నిప్పులను

**గ్రామంలోకి వెళ్ళాను. ప్రజలందరు ఆంధ్ర మహాసభ ఆఫీసుకు వెళ్ళినట్లు తెలిసింది. అయినను ఇంటివద్ద ఆడు వాండ్లు ఉంటారనుకొన్నాను. ఇంటికి వెళ్ళేవరకూ ఎవ్వరూ కనబడలేదు. అతి వేగంగా పొంగుచూ పొయ్యి లోని నిప్పులను చల్లార్చు చున్న పాలు చూచాను. ఒకవైపు అన్నం పళ్ళెంలో సగం మాత్రం కూరలతో కలిసియున్నది. కొమర య్యగారి నినాదాలు వినబడగానే అన్నం తీనుకొంటూ సగం అన్నం విడిచి పోయారని తెలుసుకొన్నాను.**

చల్లార్చుచున్న పాలు చూచాను. ఒకవైపు అన్నం పళ్ళెంలో సగం మాత్రం కూరలతో కలిసియున్నది. కొమరయ్యగారి నినాదాలు వినబడగానే అన్నం తిను కుంటూ సగం అన్నం విడిచి పోయారని తెలుసుకొన్నాను.

ఇంతలో ప్రక్క ఇంట్లో నుంచి ఏమో మాడుతున్నట్లు వాసన వచ్చింది. ప్రక్క ఇంటిలోకి వెళ్ళగానే పొయ్యిమీద అన్నం పెట్టి మాడుచున్న జొన్న అన్నం క్రిందికి దించాను. ఇక నా ఉత్సాహం అన్నది ఆగలేకపోయింది. పొలం దగ్గర ఎవ్వరూ లేరు. జీతగాండ్లను పొలం దగ్గరకు పంపి ఊరేగింపులో పాల్గొనాలనుకొన్నాను.

జీతగాండ్ల కొరకు హరిజనవాడ వెళ్ళాను, ఈ వాడకు చివర వున్న చెప్పులు కుట్టే ముత్తి గాడింటి ముందుకు వెళ్ళి జీతగాండ్ల కొరకు కేకలు చేశాను. కానీ, జవాబు రాలేదు. ముత్తిగాడింటి ముందు చెప్పులు కుట్టే సామను, చర్మాలు అన్ని చిందరవందరగా పడివున్నాయి. చెప్పులు కుట్టుకొంటూ విడిచి ఊరేగింపులో పాల్గొన్నట్టు తెలుసుకొని జీతగాండ్లు కూడా ఊరేగింపులో పాల్గొన్నారేమో నా పొలం ఏమవుతుందోనని భయంవేసి వాడలో ప్రతి ఇంట్లో చూచాను. ఎవ్వరూ లేరు.



చిప్పలు, కుండలు మొదలగునవి మాత్రమే వున్నవి. రోటిలో సజ్జలు పోసి దంచుతూ రోకలి పడవేసి వెళ్ళిపోయారు.

ఇంతలో కొమరయ్య పేరు మీద పాటలు పాడుతూ నినాదాలు ఇచ్చుట వినబడినది. ఇక ఆగలేకపోయాను.

ఆంధ్ర మహాసభ ఆఫీసుకి వస్తూ ఉండగా గ్రామాధికారి ఎదురయ్యాడు. "గ్రామ ప్రజలు మొత్తం అక్కడ వుంటే మీరు ఎక్కడికి వెళ్ళిపోతున్నారేమిటి?" అని అడిగాను.

"నేను అక్కడ ఉంటానికి వీలులేదు".

"ఏం ఎందుకు? నేనయినా పోవచ్చునా?"

"నిస్సందేహంగా వెళ్ళవచ్చును."

"మీరెందుకు రాకూడదు? ఏం కారణం చెప్పకూడదా?"

"చెప్పేదేముంది. నేను ప్రభుత్వ బానిసను. ఆ ఊరేగింపు రాజకీయ ఊరేగింపు. అక్కడ వుంటే రిపోర్టు రాయవలసి వస్తుంది. కొమరయ్య ప్రాణ త్యాగాన్ని గుర్తించాను. రిపోర్టు చెయ్యడానికి చెయ్యి వణుకుచున్నది. నా కలం ఆడదు. ఊరేగింపులో ఉంటే తప్పక రిపోర్టు రాయాలి. లేకుంటే పై అధికారులతో బూతులు పడాలి. వీటన్నింటికంటే ఇవాళ గ్రామంలో నుంచి వేరే గ్రామం వెళ్ళటం ఉత్తమమని నిశ్చయించుకొని వెళ్ళిపోవుచున్నాను" అని వెళ్ళిపోయాడు.

**బురద కాళ్ళతో వుండి వంటి మీద చొక్కా లేకుండా అతి ఉత్సాహంతో ఎర్రజండాలు పట్టుకొని నినాదాలు ఇచ్చుచున్న రైతులు కనబడినారు. తలలు ఊపుకొంటూ మంచులో వణుక్కొంటూ ఊరేగింపులో పాల్గొన్న తొంభై ఏండ్ల వృద్ధ స్త్రీలు కూడా కనిపించారు. హరిజనులు, చాకలి, మంగలి, వడ్ల, కమ్మరి, కాపు, రెడ్డి, మహమ్మదీయులు మొదలు ఊరేగింపులో పాల్గొనిన వారందరిని చెట్టెక్కి చూడగలిగాను.**

నేను వెంటనే ఆంధ్ర మహాసభ ఆఫీసుకు వెళ్ళి ఊరేగింపులో పాల్గొన్నాను.

ఆంధ్ర మహాసభ ఏమిటి? కమ్యూనిస్టు పార్టీ జెండాలు పట్టుకొన్నారు. ఏమి సంగతి? ఆంధ్రమహాసభ జండా ఇంత వరకు నియమించలేదు? ఆంధ్ర మహాసభ నాయకత్వాన, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ఈ ఊరేగింపు జరుగుతున్నదని తెలుసుకొన్నాను.

ఇంతలో వీరుడైన 'కొమరయ్య గారికి జై' అని నినాదాలిచ్చారు. మొత్తం ప్రజలను చూడాలనుకొన్నాను గాని చూపు అందటం లేదు. దగ్గరలో వున్న చెట్టు ఎక్కి పైన నిలబడ్డాను. నెత్తి మీద ఏదో రెపరెపమని చప్పుడయింది. పైకి చూచేవరకు చెట్టుపైన "కమ్యూనిస్టు పార్టీ జండా రెపరెపలాడుతోంది. కమ్యూనిస్టు పార్టీకి జై" అని నినాదాలిచ్చుకొంటూ 'మీజాన్' పత్రికలో వ్రాసిన కొమరయ్య పాట పాడుకొంటూ ఊరేగింపు బయలు దేరింది.

బురద కాళ్ళతో వుండి వంటి మీద చొక్కా లేకుండా అతి ఉత్సాహంతో ఎర్రజండాలు పట్టుకొని నినాదాలు ఇచ్చుచున్న రైతులు కనబడినారు. తలలు ఊపుకొంటూ మంచులో వణుక్కొంటూ ఊరేగింపులో పాల్గొన్న తొంభై ఏండ్ల వృద్ధ స్త్రీలు కూడా కనిపించారు. హరిజనులు, చాకలి, మంగలి, వడ్ల, కమ్మరి, కాపు, రెడ్డి, మహమ్మదీయులు మొదలు ఊరేగింపులో పాల్గొనిన వారందరిని చెట్టెక్కి చూడగలిగాను.

ఇక చెట్టు మీద ఉండలేకపోయాను. వెంటనే వచ్చి ఊరేగింపులో పాల్గొన్నాను. కొమరయ్య పాట చదువుచుండగా నీరైనట్టు అయింది. ప్రజలందరికీ కండ్లలో నీళ్ళు కమ్మిన ఈ పాట ముగియగానే ప్రజలందరు రౌద్రులయ్యి "కొమరయ్యకు జై ప్రజారాజ్యం కావాలి! పోలీసుల దౌర్జన్యాలు నశించాలి! స్వతంత్ర భారత్ జై! కమ్యూనిస్టు పార్టీకి జై" అని ఊరేగింపు ముగించి ఎవ్వరి ఇండ్లకు వారు కొమరయ్య సంగతి మాట్లాడుకొంటూ.. వెళ్లి ఇండ్లపై ఎర్రజండాలు స్థాపించుకొన్నారు. ఒక కొమరయ్య పోగానే ఇంతమంది కొమరయ్యలు సిద్ధమయ్యారు అని, తప్పక మన కోర్కెలు నెరవేరుతవని దృఢమైనది. నేను నా యింటిపై ఎర్ర జండాను స్థాపించాను. ఆ ఎర్రకాంతి మొత్తం మా బజారులో వెలిగింది. అందరు కూడి కొమరయ్య ఏ ఆశయం కొరకు ప్రాణత్యాగం చేశాడో ఆ ఆశయం కోసం కంకణం కట్టుకొని ప్రతిజ్ఞ చేశారు.

*మీజాన్ దినపత్రిక, 11 ఆగస్టు, 1948*



# నాటి కవి వేదన!

అఖిల ధార్మికచింత లం దతి విముఖ్య
మమల ధర్మార్థ కామ మోక్షముల నెలవు
శాశ్వతాధికకీర్తి శశ్వత్కరంబు
నాంధ్ర గ్రంథాలయమ్మె సుమార్యులార !

ఆంధ్ర కలా సతీమణిని నారసి బ్రోచెడు వారు లేక పై
రంధ్రియు బోలె దాస్యము గరమ్మ భరమ్ముగ దోటి దుష్ట పో
రంధ్రుల చెంత సల్పె, సుకరమ్మె, మనోవ్యధ కాదె! యక్కటా
ఆంధ్రజులార! చూచు టెటు లాదరణంబును జూపి కావరే.

**- అనంతరామయ్య శర్మ**

రారాజ చంద్రుడై రంజిల్లినను గాని
  విద్యాధికునె గారవించుచుండ్రు
నీచుడైనను గాని నిరుపమ పాండిత్య
  మున గదా సభలోన ముఖ్యుడగును
వికటరూపుండైన విద్వాంసు డగుటచే
  పలు విధంబుల శ్రీల గులుకుచుండు
ధనవంతుడై లోక ధన్యుడైనను గాని
  శాస్త్రజ్ఞులను జాల సన్నుతించు

లౌకికం బెల్ల విద్యచే లభ్య మగునుౕ
దుదకు మోక్షంబునకు నిదే తోడుపడును
విద్యయే మానవాళికి వినయ మిచ్చు
గాన దీనికి సాటియే కాన మెచట.

**- చక్రహరినారాయణ భట్టుమూర్తి**

వ్యాసం

# తొలి తెలుగు అంధ అవధాని కోట్ల బాలబ్రహ్మచారి

**విరబూసిన అవధానాల తొలి తెగను వివరిస్తున్న వ్యాసం...**



డా॥ భీంపల్లి శ్రీకాంత్
90328 44017

ప్రపంచంలో ఏ భాషకూ లేని సాహిత్య సంపద ఒక్క తెలుగు సాహిత్యానికి ఉందనడం అతిశయోక్తి కాదు. కేవలం తెలుగు భాషా సాహిత్యానికే పరిమితమైన అవధాన సాహిత్యం తెలుగు వారి సొంతం. అవధానం అంటే ఏకాగ్రత, సావధానం. అవధానంలో ధారణ ప్రధానం. ఇలాంటి అవధాన సాహిత్యానికి ఆద్యుడు చరికొండ ధర్మన్న. ఇతడికి 'శతలేఖిని వ్యవధాన పద్యరచనా సంధా సురత్రాణ చిహ్నిత నాముడు' అనే బిరుదు కలదు. ఇతడు ఉమ్మడి పాలమూరు జిల్లావాడు కావడం గమనార్హం. ఈ జిల్లాలో చాలా మంది సంస్థానాల కాలం నుంచి అవధానాలను నిర్వహించారు.

అవధానం అనేది తెలుగు సాహిత్యంలో వెలిసిన ఒక విశిష్టమైన సాహిత్యప్రక్రియ. ఈ అవధానం కేవలం తెలుగు భాషకు మాత్రమే పరిమితమైన సాహిత్యప్రక్రియ కావడం విశేషం. ఎన్నో క్లిష్టతరమైన సాహితీ సమస్యలను అలవోకగా పరిష్కరిస్తూ, చమత్కారంగా పూరణలను అవలీలగా పూరించడమే కాదు అసంబద్ధ, అసందర్భ ప్రశ్నలను కూడా సమర్థవంతంగా ఎదుర్కొంటూ, ఆశువుగా పద్యాలు చెప్పడం అవధాని చతురతకు నిదర్శనం. వీటన్నింటినీ ఏకకాలంలో అవధాని చేసే సాహితీ విన్యాసమే అవధానం. అవధాని యొక్క ఆశుకవిత్వ గరిమకు, సాహితీపటిమకు, ధారణాశక్తికి, పాండితీప్రకర్షకు అవధానం నిదర్శనం. ఏకకాలంలో తెలుగు, సంస్కృతం, హిందీలో భాషలలోనూ అవధానం చేసిన పండితులు కూడా ఉన్నారు.

## బాల్యం...

పాలమూరు జిల్లా కవులకు, రచయితలకు, కళాకారులకు పెట్టనికోట. ఇక్కడ వెలిసిన ఎందరో ప్రతిభావంతులు రాష్ట్ర, జాతీయస్థాయిలో ప్రముఖంగా గుర్తింపు పొందారు. అలాంటి వారిలో కవిగా, రచయితగా, అవధానిగా జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకొచ్చినవాడు డోకూరు కోట్ల బాలబ్రహ్మచారి. దేవరకద్ర మండలం డోకూరు గ్రామంలో 1911 ఫిబ్రవరి 15 న బాలబ్రహ్మచారి జన్మించాడు. ఇతని తల్లిదండ్రులు మోనమాంబిక, అనంత రామాచార్యులు. తండ్రి అనంత రామాచార్యుల వృత్తి స్వర్ణకార వృత్తియైనా శాస్త్రాలు, కావ్యాలలో చక్కటి అభినివేశం ఉంది. బాలబ్రహ్మచారికి మూడు సంవత్సరాల వయస్సులోనే అమ్మతల్లి రోగం (స్ఫోటకం) రెండుసార్లు సోకడంతో పూర్తిగా కంటిచూపు కోల్పోయాడు. బాలబ్రహ్మచారికి కళ్ళు కనబడకపోయినా శ్రద్ధతో తండ్రి అనంతరామాచార్యుల దగ్గరే వ్యాకరణం, నిఘంటువులు, సులక్షణసారం, అప్పకవీయం, పంచకావ్యాలు, జ్యోతిష్య గ్రంథాలను ఏకసంథాగ్రాహిత్వంతో నేర్చుకున్నాడు. కళ్ళు లేకపోవడమనేది బాలబ్రహ్మచారికి ఎప్పుడూ ప్రతిబంధకం కాలేదు. ఒకపక్క తన తండ్రి స్వర్ణకార వృత్తి చేపడుతూనే మరోపక్క బాలబ్రహ్మచారికి సాహిత్య సంబంధమైన శాస్త్రాలు, కావ్యాలను నేర్పించేవాడు. అసాధారణ మేధోసంపన్నుడైన బాలబ్రహ్మచారి అనతికాలంలోనే వాటిని ధారణచేసి తిరిగి తండ్రికే అప్పజెప్పేవాడు. పట్టుదలతో భారత, భాగవత, రామాయణ కావ్యాలను చదివి ప్రతిభావంతుడైన విద్వత్కవిగా పేరు పొందాడు. పది, పదిహేను సంవత్సరాల వయస్సులోనే ప్రేక్షకులను అలరించేటట్టు హరికథలు చెప్పేవాడు. పురాణ ప్రవచనాలు చేసేవాడు.

## విద్యాభ్యాసం...

డోకూరు గ్రామంలోని ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో బాలబ్రహ్మచారి విద్యాభ్యాసం కొనసాగింది. అతని మేధాసంపత్తి అపారం కావడంతో శ్రవణేంద్రియాల ద్వారా విన్న ఏ సంగతైనా ఇట్టే గ్రహించేవాడు. గ్రహించడమే కాదు శాశ్వతంగా గుర్తుంచుకునే అపరమేధావి. కొద్దికాలంలోనే బాలబ్రహ్మచారి వర్ణమాలతో పాటు అంకెలను నేర్చుకున్నాడు. ఒకటవ ఎక్కం నుండి ఇరవై ఎక్కాల వరకు నేర్చుకున్నాడు. గుణింతాలన్నీ

ఔపోశనం పట్టాడు. కొద్దిరోజులలోనే అక్కడ విద్యాభ్యాసం పూర్తయింది. బాల బ్రహ్మాచారి తండ్రి మంచి పండితుడు. కుటుంబ పోషణ కోసం ఒకపక్క కులవృత్తియైన స్వర్ణకారవృత్తి చేసుకుం టూనే మరోపక్క బాల బ్రహ్మాచారికి సమయం చిక్కినప్పుడల్లా చదువు చెప్పేవాడు. రామాయణం, భారతం, భాగవతాలలోని పద్యాలను చదివి బాలబ్రహ్మాచారికి వినిపించేవాడు. తండ్రి చెప్పే అనేక విషయాలను అత్యంత శ్రద్ధతో, ఏకాగ్రతతో విని గుర్తుంచుకు నేవాడు. అమరకోశం, సులక్షణసారం వంటి గ్రంథాలను అవగాహన చేసుకున్నాడు. అనంతరం ఛందస్సు నేర్చుకున్నాడు. తిథులు, వారాలు నేర్చుకుని జ్యోతిష్యంపై పట్టు సాధించాడు. అనేకమందికి జాతకాలు రాసిచ్చాడు. తండ్రి దగ్గర స్పర్శశాస్త్రం నేర్చుకుని స్పర్శజ్ఞానంతో ఎంతోమందికి హస్తసాముద్రికం కూడా చెప్పేవాడు. మందులను ఎలా తయారుచేయాలో తెలిపే వస్తుగుణ దీపికను చదివి వాత, పిత్త, శ్లేష్మాదులతో కూడిన మానవ శరీరం లోని గుణదోషాలను, నాడిని చూసి చెప్పేవాడు.



### పురాణం, హరికథలు చెప్పడం...

ఇతిహాసాలైన రామాయణ, మహాభారత, మహాభాగవతాలను తన తండ్రి వద్ద నేర్చుకున్న బాలబ్రహ్మాచారి పురాణంతో పాటు హరికథలను చెప్పే విధానాన్ని కూడా నేర్చుకున్నాడు. ఇతరులు హరికథలు ఎలా చెప్పేవారో వారి హరికథలను చెప్పే విధానాన్ని కూడా అవగతం చేసుకునేవాడు. నేర్చుకున్న అనంతరం తన సొంతూరు డోకూరు లోనూ, ఇతర సమీప గ్రామాలలోనూ పురాణం చెప్పేవాడు. అప్పటినుండి బాలబ్రహ్మాచారి చుట్టుముట్టు గ్రామాలలో హరికథలు చెప్పడం ప్రారంభించాడు. హరికథ చెప్పినప్పుడు ఆయా గ్రామ పెద్దలు అతనికి ఆ రోజులలో రెండు రూపాయలు ఇచ్చేవారు. అందులో ఒక రూపాయి అతడు ఉంచుకుని మరొక రూపాయి మృదంగం, హార్మోనియం, వయొలిన్ మొదలైన వాద్యాలవారికి ఇచ్చేవాడు. డోకూరు సమీపగ్రామంలో బాల బ్రహ్మాచారి బాల్యంలోనే అంటే 14, 15 సంవత్సరాల వయస్సులోనే వరుసగా తొమ్మిదిరోజుల పాటు విరాటపర్వం పురాణ పఠణం చేయడం విశేషం. ఈ

**బాల బ్రహ్మాచారికి కళ్ళు కనబడకపోయినా శ్రద్ధతో తండ్రి అనంతరామాచార్యుల దగ్గరే వ్యాకరణం, నిఘంటువులు, సులక్షణసారం, అప్పకవీయం, పంచకావ్యాలు, జ్యోతిష్య గ్రంథాలను ఏకసంథా గ్రాహిత్వంతో నేర్చుకున్నాడు. కళ్ళు లేకపోవడమనేది బాలబ్రహ్మాచారికి ఎప్పుడూ ప్రతిబంధకం కాలేదు. ఒకపక్క తన తండ్రి స్వర్ణకార వృత్తి చేపడుతూనే మరోపక్క బాలబ్రహ్మాచారికి సాహిత్య సంబంధమైన శాస్త్రాలు, కావ్యాలను నేర్పించేవాడు.**

పురాణప్రవచనం చేస్తుండగానే అక్కడ వర్షం కుంభవృష్టిగా కురవడం మరో విశేషం. దీంతో గ్రామంలోని రైతులు, చుట్టుముట్టు గ్రామాలవారి సంతోషానికి, ఆనందానికి అవధులు లేకుండాపోయింది. అనంతరం బాలబ్రహ్మాచారికి బహుమతిగా గ్రామస్థులు తగిన ద్రవ్య సహాయం చేశారు.

### గద్వాల రాజు సందర్శనం...

బాలబ్రహ్మాచారి సొంతూరు డోకూరు గ్రామంలో హరికథలను చెప్పడంతో వచ్చిన డబ్బులతో సంతృప్తి కలగలేదు. బాలబ్రహ్మాచారికి ఒక రోజు ఒక కోరిక కలిగింది. గద్వాల రాజు సీతారాం భూపాల్ దర్శనం చేసుకుని అతనిముందు హరికథ చెబితే మంచి పారితోషికం లభిస్తుందని ఎవరో చెబితే గద్వాల సంస్థానానికి వెళ్లాడు. రాజుకు ఒక అంధుడైన బాలుడు దర్శనం కోసం వచ్చాడని చెబితే ముందు రాజు దర్శనం ఇవ్వలేదు. రెండుమూడు రోజులు అక్కడే ఉన్న తర్వాత చివరికి రాజు దర్శనం ఇచ్చాడు. రాజు ముందు బాలబ్రహ్మాచారి చక్కటి హరికథ చెప్పాడు. అది విని రాజు సంతోషించి అతన్ని ఘనంగా సన్మానించి బహుమాన మిచ్చాడు. గద్వాల రాజు సందర్శనం బాలబ్రహ్మాచారి జీవితంలో ఒక మరపురాని సంఘటన.

### తొలి అవధానం...

బాలబ్రహ్మాచారి గద్వాలలో ఉన్నప్పుడే కొద్ది రోజులలోనే శతావధాని పోకూరి కాశీపతి గద్వాలకు వస్తున్నాడని, అష్టావధానం చేస్తాడనే విషయం తెలిసింది. అష్టావధానం అంటే ఏమిటో, ఏ విధంగా చేస్తారోననే జిజ్ఞాస బాలబ్రహ్మాచారికి కలిగింది. దాంతో బాలబ్రహ్మాచారి తెలుసుకోవాలనే తలంపుతో కాశీపతి దగ్గరికి వెళ్ళితే కాశీపతి " నాయనా ఇది అంత తేలికగా అభ్యసించలేవు. పైగా నీవు అంధుడవు. నీవల్ల కాద "ని చెప్పి నిరాకరించాడు. అయినా బాలబ్రహ్మాచారి

నిరుత్సాహానికి, నిస్పృహకు లోనుకాలేదు. అష్టావధానం ఎలాగైనా నేర్చుకోవాలనే కోరిక ఇంకా బలీయంగా మనసులో నాటుకుంది. పోకూరి కాశీపతి అవధాన కార్యక్రమాన్ని బాలబ్రహ్మచారి ప్రారంభం నుండి చివరివరకు ప్రేక్షకుల మధ్య కూర్చుని ఆసాంతం విని తాను కూడా అవధానం చేయగలనని గట్టి నిర్ణయానికి వచ్చాడు. అనుకోవడమే కాదు వెంటనే అవధానాన్ని చేయగలననే ధైర్యం తెచ్చుకొని రాజుకొక విజ్ఞాపనపత్రాన్ని అందించాడు. అది చూసి రాజు ముందు తటాపటాయించినా తర్వాత బాల బ్రహ్మచారి విద్వత్తును పరీక్షించడానికి తన ఆస్థానంలోని విద్వత్కవులను పరీక్షకు పెట్టాడు. వారు బాలబ్రహ్మచారిని అవధాన నిర్వహణకు సంబంధించి కొన్ని ప్రశ్నలు వేయగా అతడు చక్కని సమాధానాలు చెప్పాడు. బాలబ్రహ్మచారి విద్వత్తును పరీక్షించి ఇతడు అవధానం చేయగల సమర్థుడని తేల్చేశారు. దాంతో విద్వత్కవులు సంతృప్తిపడి అవధానం చేయగలడని రాజుకు చెప్పారు. మరుసటిరోజే బాలబ్రహ్మచారి గద్వాల సంస్థానంలో సమర్థవంతంగా తొలి అష్టావధానం చేశాడు. అనంతరం రాజుచే ఘనంగా సన్మానింపబడ్డాడు. బాల బ్రహ్మచారి చేసిన తొలి అష్టావధానం ఇదే. ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని ప్రతి జిల్లాలోనూ అష్టావధానాలు, దశావధానాలు, శతావధానాలను విజయవంతంగా ప్రదర్శించాడు. ఘనమైన సత్కారాలను అందుకున్నాడు. రాష్ట్రమంతటా తిరిగి సంస్థానాలలో, పౌరసభలలో, పాఠశాలలు, కళాశాలలలో సుమారు 1500 వందలకుపైగా అవధానాలు చేశాడు. చతుర్విధ కవితలలో ఆరితేరిన ప్రతిభావంతుడు, పద్యాలను ఆశువుగా, అలవోకగా అల్లే ప్రజ్ఞాదురంధరుడు బాలబ్రహ్మచారి.

"పాల్మూరు జిల్లా లోపలను బాలబ్రహ్మ
యాచార్యులను పేర నలరువాడ
అష్టావధాన ముద్యన్నిరంకుశ లీల
నాచరించుచు సత్సభాంతరములు
కవిరత్నమని ఆశుకవితా శిరోమణి
యను బిరుదంబుల నందినాడ"

అని చెప్పుకున్న బాలబ్రహ్మచారి మూడేళ్ళ ప్రాయంలోనే కళ్ళు పోగొట్టు కున్నప్పటికీ జ్ఞానచక్షువుతో ఆశుకవితా పారీణుడుగా, చిత్రకవితాప్రవీణుడుగా పేరు తెచ్చుకున్న విద్వత్కవి. చిత్రకవితా ధురీణుడైన పోకూరి కాశీపతి అవధా నాలను విన్న ప్రేరణతో స్వయంకృషితో అవధానవిద్యలో ఆరితేరాడు.

**అవధాన విశేషాలు...**

ఒక అవధానంలో 'అంధత్వంబు పురాభవ గ్రథిత పుణ్యప్రాప్త మూహింగన్' అనే సమస్యను ఇవ్వగా దీనిని ఇతడు ఎంతో ప్రతిభావంతంగా ఇలా పూరించాడు.

"అంధత్వస్థితి యేమి నా బ్రతుకనన్
వ్యాసుండు దానిట్లనెన్
గాంధారీధన యిట్లుగాని యెద
దుష్కర్మప్రపంచంపు గో
దుం ధాత్రిన్ గని
కుండగావలసియుండున్ గాన నెంతేని నీ
అంధత్వంబు పురాభవ గ్రథిత
పుణ్యప్రాప్తి మూహింపగన్"

అని వ్యాసుడు ధృతరాష్ట్రుని అంధత్వమును కొనియాడినట్లు ముడిపెట్టాడు. ఈ పద్యాన్ని తనకు అన్వయించుకుంటూ చెప్పిన తీరు ప్రశంసనీయం.

మరొక అష్టావధానంలో "చనుబాలిచ్చి సుఖింపజేసే రతిలో చంద్రాస్య ప్రాణేశ్వరున్" అనే సమస్యను ఇవ్వగా రతిలో చనుబాలిచ్చి సుఖింపజేయడమనే వైరుధ్యాన్ని కవి దానిని 'మదనోత్సా హంబెదన్ జాల హెచ్చను బాలిచ్చి సుఖింపజేసే' అని చనుబాలిచ్చి సుఖింపజేయడంలోని విరుద్ధార్థాన్ని తొలగించి మనోహరంగా పూరించాడు.

"ఒనరన్ భోగపరాఙ్ముఖుండవగుదెంతో
నీమదిన్ శక్తి త
గ్గినచో గొమ్మివియైన ద్రాగి
సురతక్రీడా విశేషంబులన్
దనియన్ చేయుము నన్నటంచు
మదనోత్సాహంబెదన్ జాల హె
చ్చను బాలిచ్చి సుఖింపజేసె రతిలో
చంద్రాస్య ప్రాణేశ్వరున్"

అని పూరించి అందరిని మెప్పించాడు. ఇతడు చిత్రకవితలో భాగమైన ప్రహేళికలు కూడా రచించాడు.

"అలరునొకజోడు పేరనైదక్కరములు
త్రిప్పి చదివిన నాతడే యొప్పు"

వరుస ఐదక్షరాలు గల ఒక పేరు. అతడు పూలబాణుడు. ఆ పేరు "రమాకుమార" త్రిప్పిచదివినా "రమాకుమార" అని మన్మథుడనే అర్థమే వస్తుంది.

"ఒకటి రెండును మూడు
నాల్గుడుపనతడె
యగు నతండెవ్వరో తెల్పుడార్యులార"

రమాకుమారలో ఒక అక్షరం తీసేసినా 'మాకుమార' అనగా మన్మథుడే. రెండవ అక్షరం 'మా' తీసేసినా వచ్చే కుమార కు అర్థం మన్మథుడే. అక్షరం 'కు' తీసేసినా 'మార' అని మారుడన్న మన్మథుడే. 'మా' కూడ తీసి 'రా' అన్న మన్మథుడే. ఇన్ని చమత్కారాలను ఇమిడ్చి ఇతడు ప్రహేళికలను రచించాడు.

డోకూరు బాలబ్రహ్మచారి ప్రసిద్ధ అవధాని పోకూరి కాశీపతి మార్గంలోనే మనోహరమైన ఏకాక్షర పద్యాలను కూడా రచించాడు.

> **అష్టావధానం**
>
> **ఎలాగైనా నేర్చుకోవాలనే కోరిక ఇంకా బలీయంగా మనసులో నాటుకుంది. పోకూరి కాశీపతి అవధాన కార్యక్రమాన్ని బాలబ్రహ్మచారి ప్రారంభం నుండి చివరివరకు ప్రేక్షకుల మధ్య కూర్చుని ఆసాంతం విని తాను కూడా అవధానం చేయగలనని గట్టి నిర్ణయానికి వచ్చాడు. అనుకోవడమే కాదు వెంటనే అవధానాన్ని చేయగలననే ధైర్యం తెచ్చుకొని రాజుకొక విజ్ఞాపన పత్రాన్ని అందించాడు.**

"నేనాన నాని నాని ను
నాన ననిన్ నిన్ను నాననని నిన్ననె నా
నూనిన నెన్నాన ననెన్
నేనన నెన్నైన నేనునున్ నిన్నాన్నా"

"నేన్-ఆనన్-అనినాను - ఇనునానన్ - అనినన్ - నిన్ను నానని - నిన్ననే - నాన్ - ఊనిన నెన్నానన్
- అన్నేన్ - అనన్ - ఎన్నైనన్ - నేనునున్ నిన్ను - అన్నా"

"ఒకడు యుద్ధంలో నిన్ను నిరోధింపనని నిన్నటి దినమునందే సూర్యుని సాక్షిగా ఒట్టు వేసినానని అనగా ఎదుటివాడు మిక్కిలి సిగ్గుపడినవాడై ఓయన్నా నేను కూడా నిన్నేపరిస్థితుల యందునూ బాధ పెట్టనని పలికెను" అని అర్థం. ఇలాంటి పద్యాలేకాక ద్వక్షరి 'న','మ'లతో కూడా అనేక పద్యాలను రచించాడు.

ఒక అవధానంలో దత్తపది అంశంలో తారణ, పార్థివ, వ్యయ, సర్వజిత్తు అనే పదాలతో భారతార్థం తెలపమని అడగగా దానికి బాలబ్రహ్మచారి పూరణ ఇది.

ఉ. తారణ కౌతుకంబున గదాధరు ఉడెవ్వనిపై ఉ గడంగున్
దారుణభంగి నంచు మదితల్లడ మందెడి పార్థివాళిపై
దీరని కిన్కమై నడరి దివ్యులు మెచ్చ వ్యయంబొనర్చి వెం
వారెను సర్వజిత్తుడయి యయ్యనిలాత్మజు డాహవంబునన్

భావం : తాను యుద్ధమందలి ఆసక్తిచే గదను ధరించినవాడు ఎవ్వరిమీద భయంకరమైన రీతిలో విజృంభించునో అని రాజ సమూహము తల్లడిల్లుచుండగా దేవతలు మెచ్చునట్లు యుద్ధముతో అందరిని ఓడించి భీముడు అతిశయించెను.

ఇలా బాలబ్రహ్మచారి చతుర్విధ కవితారచనలో ఆరితేరిన విద్వత్కవి. తమ ప్రతిభను అనేకార్థాలతో కూడిన బహుళార్థ తేటగీతి, చతురర్థి కందం, చిత్రకవిత్వం, బంధకవిత్వం, గర్భకవిత్వం, ఆశుకవిత్వం మొదలైన రూపాలలో రచనలు చేశాడు.బాలబ్రహ్మచారి ఎన్నో చక్కని సమస్యాపూరణలు, దత్తపదులను పూరించి అవధానాలలో ఆశువుగా చెప్పి సభాసదులను అలరించేవాడు. వాటిలో కొన్ని మాత్రమే 'చమత్కారదర్శిని' గ్రంథంలో దర్శనమిస్తాయి.

**రచనలు...**

శ్రీ మహేంద్ర గర్వభంగం, మన్నెంకొండ వేంకటేశ్వర శతకద్వయం, రామలింగేశ్వర శతకం, కొడంగల్ వేంకటేశ్వర శతకం, భారతి శతకం, మౌనప్రభు శతకం, శంభులింగ ప్రభు శతకం, రంగనాథ శతకం, సర్వేశ్వర శతకం, కొలిమి కలిమి, నాగ్నజితి పరిణయం, సుగుణవర్మోపాఖ్యానం, బసవ సక్షత్రమాల, కృష్ణరాజీయం వంటి రచనలే కాకుండా కీర్తనలు, తారావళులు, హరికథలు మొదలైన రచనలు చేశాడు. ఆయా సందర్భాలలో రాసిన పద్య ఖండికలు పలు పత్రికలలో ప్రచురించ బడ్డాయి. అంతేకాదు ఇతడు చిత్ర, బంధ, గర్భ కవిత పద్యాలలో ఆరితేరిన వాడు. కవిత్వాన్ని ఎన్ని రకాలుగా తీర్చిదిద్దాలో అన్ని రకాలుగా ఆయా రచనలు చేశాడు. బాలబ్రహ్మచారి వివిధ అవధానాలలో సమస్యాపూరణంలో చెప్పిన పద్యాలను, ఇతర చిత్రకవితా పద్యాలను 'చమత్కార దర్శిని'గా వెలుగులోకి తెచ్చాడు.

**నాగ్నజితి పరిణయం...**

"నాగ్నజితి పరిణయం" ఐదు ఆశ్వాసాల ప్రబంధకావ్యం.

కృష్ణునకు ఎనిమిది భార్యలున్నారు. వారు రుక్మిణి, సత్యభామ, జాంబవతి, కాళింది, మిత్రవింద, భద్ర, లక్షణ, నాగ్నజితి అనే అష్టభార్యలు. ఈ నాగ్నజితి పరిణయం ఇతివృత్తం కృష్ణుడితో నాగ్నజితికి జరిగిన వివాహగాథ. ఈమె కోసల దేశాధిపతియైన నగ్నజితి యొక్క కుమార్తె. కోసల దేశంలోని వృషభాలు ఎవ్వరికీ పట్టుబడకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తుండేవి. రాజు ఈ వృషభాలను ఎవరైతే పట్టుకోగలరో తన కుమార్తెనిచ్చి పెళ్ళి చేస్తానని ప్రకటించాడు. శ్రీకృష్ణుడు ఆ వృషభాలను వధించి నాగ్నజితిని పెళ్ళి చేసుకుంటాడు. నాగ్నజితి పరిణయం యొక్క స్థూల కథ యిది.

**మన్నెముకొండ వేంకటేశ్వర శతకద్వయం...**

పాలమూరు తిరుపతిగా వెలిసిన మన్నెముకొండ వేంకటేశ్వరస్వామి భక్తులకు ఇష్టదైవం. ఈ వెంకటేశ్వరస్వామి పేరు మీదనే రెండు శతకాలను బాలబ్రహ్మచారి రచించాడు. ఒకటి కందపద్యాలలో, మరొకటి ఉత్పలమాల ఛందస్సులో రచించాడు. సాధారణంగా శతకాలు నీతి, భక్తి, వైరాగ్య, వ్యాజస్తుతులలో ఉంటాయి. ఈ రెండు శతకాలు భక్తి ప్రధానమైన శతకాలు కావడం విశేషం. ఈ శతకాలలో భక్తుడు తనకున్న కష్టాలన్నింటినీ స్వామి వారికి విన్నవించి తన కష్టాలను తీర్చమని వేడుకుంటాడు. అంతేకాదు తనకు ఆయురారోగ్యైశ్వ ర్యాలను కలిగించి తన జీవితాన్ని సుఖవంతంగా చేయమని ప్రార్థిస్తాడు. బాలబ్రహ్మచారి వేంకటేశ్వరస్వామి భక్తుడిగా తనకు సుఖజీవనాన్ని ప్రసాదించమని స్వామివారిని కోరుతాడు. ఈ శతకం "మన్నెముగిరి వేంకటేశ మా హృదయేశా" అనే మకుటంతో రచించబడింది. ఈ శతకద్వయంలోని రెండవ శతకం ఉత్పలమాల ఛందస్సులో రచించబడింది. ఇందులోని 108 పద్యాలు ద్విత్వన్నకార ప్రాసలో రాయబడ్డాయి. దీని మకుటం "మన్నెము భూధరాలయ రమా హృదయేశ్వర వేంకటేశ్వరా!". ఇందులోని పద్యాలన్నీ చక్కటి ధారాశుద్ధితో

**బాల**బ్రహ్మచారి చతుర్విధ కవితారచనలో ఆరితేరిన విద్వత్కవి. తమ ప్రతిభను అనేకార్థాలతో కూడిన బహుళార్థ తేటగీతి, చతురర్థి కందం, చిత్రకవిత్వం, బంధకవిత్వం, గర్భకవిత్వం, ఆశుకవిత్వం మొదలైన రూపాలలో రచనలు చేశాడు.బాలబ్రహ్మచారి ఎన్నో చక్కని సమస్యాపూరణలు, దత్తపదులను పూరించి అవధానాలలో ఆశువుగా చెప్పి సభాసదులను అలరించేవాడు.

చదవతగ్గవి.

**వజ్రసూచి...**

సామవేదంలో ఉన్న వజ్రసూచిక ఉపనిషత్తు వజ్రసూచి. దీనిని అశ్వఘోషుడు రచించాడు. బౌద్ధ విద్వాంసుడైన అశ్వఘోషుని శ్లోకాలకు బాలబ్రహ్మచారి చక్కటి అర్థవివరణ చేశాడు. బ్రాహ్మణుడెవరు? అనే విషయంపై అశ్వఘోషుడు చెప్పిన అనేక విషయాలే ఈ వజ్రసూచిలో కనిపిస్తాయి. బ్రాహ్మణుడు అంటే ఎవరు? ఎలా ఉంటారు?. ఎవరిని బ్రాహ్మణులంటారు? వంటి విషయాలు ఇందులో దర్శనమిస్తాయి. జాతివలన బ్రాహ్మణుడు కావటం లేదు. శరీరంలోనే బ్రాహ్మణత్వం లేనప్పుడు జ్ఞానంచే బ్రాహ్మణత్వం సిద్ధించదు. ఆచారం చేతకాని, కర్మల వలన కాని, వేదాభ్యాసం చేత కాని బ్రాహ్మణత్వం సిద్ధించదు. ఇలాంటి విషయాలెన్నో ఈ వజ్రసూచిలో కనిపిస్తాయి.

**మహేంద్ర గర్వభంగం...**

బాలబ్రహ్మచారి రచించిన కావ్యాలలో "మహేంద్ర గర్వభంగం" ఒకటి. ఇది 113 పద్యగద్యాల ఏకాశ్వాస కావ్యం. భాగవత షష్ఠమ స్కంధంలోని విశ్వరూప ఉపాఖ్యానం దీనికి మూలం. ఓష్ఠ్యం, పంచాక్షరి కందం, గుడుసులు కందం, గీతగర్భిత కందం, అనులోమ విలోమ కందం మొదలైన చిత్రకవితా పద్యాలు ఇందులో చాలా ఉన్నాయి. ఈ కావ్యారంభంలో కవి కనకాచలమును (మేరువు), శివుని స్వర్గలోకాన్ని వర్ణించాడు. అమరావతి పట్టణంలోని శిల్పసంపద నేత్రానందం కలిగించే విధంగా ఈ రచన చేశాడు.

**చమత్కార దర్శిని...**

ఈ 'చమత్కార దర్శిని' చతుర్విధ కవితల గ్రంథం. బాలబ్రహ్మచారి గ్రంథాలలో ప్రఖ్యాతిగాంచిన గ్రంథం 'చమత్కారదర్శిని'. ఈ గ్రంథం బాలబ్రహ్మచారి ఘనమైన ప్రతిభను తెలియజేసే ఉద్గ్రంథం. తెలుగుభాషలో ఉన్న చతుర్విధ కవితలు, ఆశు, చిత్ర, బంధ, గర్భ కవితలకు సంబంధించిన పద్యాలతో పాటు తాను అవధానాలలో ఆశువుగా చెప్పిన పద్యాలను ఇందులో పొందుపరిచాడు. బాలబ్రహ్మచారి ఈ గ్రంథ ప్రారంభంలో నాలుగు అర్థాలతో కూడిన చతురర్థి కందం, 32 అర్థాలతో కూడిన బహుళార్థ తేటగీతి రాయడం విశేషం.

**చతురర్థి కందం...**

కం. శ్రీ సత్యాదరణ కళా
భ్యాసుడజుండతనుడంబు
జాంబకుడసదృ గ్భాసుర
గోమహిమాఢ్యుండు
శ్రీ సోమాప్తుండు సంతరించుత మమ్మున్
బహుళార్థ తేటగీతి
తే.గీ. శ్రీ ప్రభేభ్యుడు హరిబుధార్చిత

> **బాల** బ్రహ్మచారి
> **అవధానాలలో దిగ్దంతులు వంటి విద్వత్కవులు, పండితులు, అష్ట, శతావధానులు, కవులు, రచయితలు, ప్రొఫెసర్లు, పృచ్ఛకులుగా, సభాపతులుగా ప్రేక్షకులుగా పాల్గొనడం మరో విశేషం. అవధానాలను నిర్వహించిన పండిత ప్రకాండులెందరో బాల బ్రహ్మచారిని ఘనంగా సన్మానం చేశారు. ముప్పైకి మించి స్వర్ణకంకణాలు, స్వర్ణపతకాలు, ఒక స్వర్ణ కంఠహారం బహుమానంగా పొందాడు.**

సదినుడు
పరమ హితకరుడజపద భ్రాజితుండు
కువలయ వివర్ధనుడసమ గోప్రసిద్ధు
డైన భగవంతుడోము
మమ్మాదరమున

ఈ బహుళార్థ తేటగీతిలో 32 దేవుళ్ళకు సంబంధించిన అర్థాలుండడం విశేషం. ఇందులో వినాయకుడు, బ్రహ్మ, విష్ణువు, ఈశ్వరుడు, సూర్యచంద్రులు మొదలైన 32 మంది దేవతల స్తుతి పద్యమిది.

ఇంకా ఈ గ్రంథంలో తెలుగు సాహిత్యంలో ఉన్న అన్ని రకాల పద్యాల గురించే కాకుండా సొంతంగా తాను కొత్త రకమైన పద్యాలను కూడా బాల బ్రహ్మచారి సృష్టించాడు. కొన్ని పద్యాలలో ప్రశ్నలకు సమాధానాలతో కూడిన పద్యాలు, తలకట్ల పంచాక్షరి, సప్తస్వర కందం, తలకట్ల సర్వలఘుగీతం, అనులోమ విలోమ కందం, గర్భస్థ కందాలు, మత్తేభ గర్భిత సీసం, ఏకాక్షరి కందం, శైలబంధ కందం, ఉత్సాహ గర్భిత పంచచామర శైలబంధం, పంచ చామర గర్భస్థోత్సాహ వృత్తం, సప్తవార కందం మొదలైన చిత్ర, గర్భ, బంధ కవిత్వాలకు సంబంధించిన పద్యాలు ఉన్నాయి.

**అవధానాలు చేసిన ప్రాంతాలు...**

గద్వాల ప్రభువు సీతారామ భూపాల్ ముందు తొలిసారిగా అష్టావధానం ప్రదర్శించిన బాలబ్రహ్మచారి ఆ తర్వాత అనేక ప్రాంతాలలో అవధానాలను చేశాడు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1500 పైగా అష్టావధానాలు, దశావధానాలు, శతావధానాలు కూడా నిర్వహించాడు. బాలబ్రహ్మచారి అవధానాలను తెలంగాణ జిల్లాలలోనే కాకుండా రాయలసీమ, కోస్తాంధ్ర, సర్కారు జిల్లాలలోనూ చేశాడు. తెలంగాణ జిల్లాలలో అధికసంఖ్యలో అవధానాలు చేశాడు. అత్యధికసంఖ్యలో హైదరాబాదు, మహబూబ్ నగర్ జిల్లాలలో 40కి పైగా అవధానాలు చేశాడు. ఇంకా భువనగిరి, హనుమకొండ, వరంగల్, ఆర్మూరు, బొల్లారం, సంగారెడ్డి, తిమ్మాజిపేట, సిద్దిపేట, పాలెం, మేడ్చల్, గద్వాల, మూసాపేట, ఆత్మకూరు, కొకూరు, కొడంగల్, నారాయణపేట, మక్తల్, అచ్చంపేట, పెంట్లవెల్లి మొదలైన ప్రాంతాలలో అవధానాలు చేశాడు. బాలబ్రహ్మచారి ఎక్కువసంఖ్యలో అవధానాలను సర్కారు జిల్లాలలోని విశాఖపట్టణం, రాజమండ్రి, మండపేట, ఏలూరు, మచిలీపట్టణం, గురజాల, కొల్లూరు, మామిళ్ళపల్లి, పిడుగురాళ్ళ, ఒంగోలు మొదలైన ప్రాంతాలలో చేశాడు. రాజమండ్రి లోనూ, మచిలీపట్టణంలోనూ ఒక్కొక్క చోట డజనుకుపైగా

వ్యాసం

అవధానాలు చేశాడు. రాయలసీమ ప్రాంతంలో కర్నూలు, సి.బెళగల్, శ్రీశైలం, ప్రొద్దుటూరు, రాజంపేట, తాడిపత్రి, యాడికి మొదలైన ప్రాంతాలలో అవధానాలు చేశాడు. అవధానాలు చేసిన చోటల్లా అనేక సత్కారాలనందుకున్నాడు.

**అవధానంలో ప్రముఖులు...**

బాలబ్రహ్మాచారి నిర్వహించిన అవధానాలన్నంటిలో లబ్ధప్రతిష్ఠులైన విద్వత్కవులు, అవధానులు, పండితులు, విద్వాంసులు, విద్యావేత్తలు, ప్రముఖ రాజకీయ నాయకులు, కళాశాలల ప్రధానాచార్యులు, ప్రముఖ న్యాయమూర్తులు, న్యాయవాదులు, వైద్య శిఖామణులు, జిల్లా పాలకులు ఉండడం విశేషం. అంతేకాదు బాలబ్రహ్మాచారి అవధానాలలో దిగ్గంతులు వంటి విద్వత్కవులు, పండితులు, అష్ట, శతావధానులు, కవులు, రచయితలు, ప్రొఫెసర్లు, పృచ్ఛకులుగా, సభాపతులుగా ప్రేక్షకులుగా పాల్గొనడం మరో విశేషం.

అవధానాలను నిర్వహించిన పండిత ప్రకాండులెందరో బాల బ్రహ్మాచారిని ఘనంగా సన్మానించారు. మురిపెకి మించి స్వర్ణకంకణాలు, స్వర్ణపతకాలు, ఒక స్వర్ణ కంఠహారం బహుమానంగా పొందాడు.

**బిరుదులు...**

బాలబ్రహ్మాచారి పాండిత్యానికి మెచ్చి అనేక సంస్థానాలు, పౌర సమాజాలు అనేక బిరుదులను ప్రకటించాయి. గద్వాల సంస్థానం వారిచే 'కవిరత్న', తిరుపతిలో 'చిత్రకవితా ప్రవీణ', వరంగల్ రాజరాజనరేంద్ర గ్రంథాలయంలో దూపాటి వెంకటరామాచార్యుల నుండి 'ఆశుకవితాధురీణ', మంగళగిరిలో 'కవిశేఖర', రాజమండ్రిలో శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి నుండి 'కవిశిరోభూషణ', జైపూర్ మహారాజు విక్రమదేవవర్మ నుండి 'అవధాన పంచానన', గుడివాడలో 'చతుర్విధ గీర్వాణ' బిరుదులతో పాటు 'సువర్ణ విజయ ఘంటాకంకణం', నిజామాబాదులో సువర్ణ రత్నకిరీటం పొందిన విశిష్టకవి బాలబ్రహ్మాచారి.

తొలి తెలుగు అంధ అవధాని కోట్ల బాలబ్రహ్మాచారి రాష్ట్ర వ్యాప్తంగా పాలమూరు జిల్లా కీర్తిని ఇనుమడింపచేసి డోకూరు కోట్ల బాలబ్రహ్మాచారి 8 ఏప్రిల్ 1983లో తన జీవితానికి వీడ్కోలు పలి కాడు. తను జీవించి ఉన్నంత వరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అతనికి నెలకు 75 రూపాయల చొప్పున గౌరవ వేతనం అందించేది. ఒక అవధాన పండితుడికి దక్కిన అరుదైన గౌరవం ఇది. తనకు అరవై సంవత్సరాలు వచ్చేంతవరకు అవధానాలు చేస్తూనే ఉండే వాడు. అనంతరం అనేక సాహిత్యసభలలో ప్రసంగాలు చేసేవాడు. ఆయా ప్రసంగాలలో కూడా ఆశువుగా అలవోకగా పద్యాలను చెప్పేవాడు. పాలమూరు జిల్లా సాహిత్య చరిత్రలోనే కాదు తెలుగు సాహిత్య చరిత్రలోనే బాలబ్రహ్మాచారి ఒక అధ్యాయం అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు.

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునికోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

కథ

# కనువిప్పు!

**ధనికులపైన తొలగిపోయే మధ్యతరగతి భ్రమల్ని చిత్రించిన కథ...**



కుంతి
87909 20745

"ఏమిటి సుమ్మీ ! గంట సేపటి నుండి ఫోన్ లో మాట్లాడుతున్నావు. ఆ శ్రీదేవితోనేనా?" అంటూ భార్యను ప్రశ్నించాడు కారుణ్య

"ఔనండి! ముఖ్యమైన విషయాలు మాట్లాడుతున్నాను"అంటూ మరొక అరగంట మాట్లాడి ఫోన్ పెట్టేసింది సుమిత్ర

"చూడు సుమ్మీ! నీవు ఎవరితోనైనా స్నేహంగా ఉండు. కాని ఎదుటి వారి స్టేటస్ తెలుసుకొని నడుచుకో. చివరికి ఇబ్బందులు తలెత్తితే నీ మనసు తట్టుకోలేదు"

"నేను నా క్లోజ్ ఫ్రెండ్ శ్రీదేవితో మాట్లాడినప్పుడల్లా ఇలా అంటుంటారు. మీకసలు శ్రీదేవి గురించి పూర్తిగా తెలియదు. శ్రీమంతురాలు. వాళ్ళాయన చాలా పెద్ద కంపెనీలో పెద్ద పదవిలో ఉన్నాడు. మూడు బంగళాలు, రెండు పెద్ద కార్లు ఉన్నాయి. ఒక్కగానొక్క కొడుకు సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. శ్రీదేవి వారంలో కనీసం రెండు మూడు సార్లు ఫోన్ చేస్తుంది. నేనంటే ఆమెకు చాలా ఇష్టం" అన్నది సుమిత్ర భర్తతో గర్వంగా.

"నీకు తెలిసింది ఒక పార్శ్వం మాత్రమే. వాళ్ళాయన, నేను చిన్నప్పటి నుండి కలిసి పెరిగాము. కలిసినప్పుడల్లా తన భార్య గురించి చెప్పుకొని బాధ పడుతుంటాడు"

"ఏమి చెబుతుంటాడు"

"శ్రీదేవి అత్త మామలను దగ్గరికి చేరనివ్వదట. ఆడపడుచులను చులకనగా చూస్తుందట. బాగా డబ్బుందని, కన్నూ మిన్నూ కానక అహంకారంతో ప్రవర్తిస్తుందట"

"కానీ నాతో చాలా బాగుంటుందండి"

"అదే నాకు అర్థం కావడం లేదు. నీవు పెద్దగా చదువుకోలేదు. డబ్బున్న దానివి కాదు. ఆమె చుట్టూ తిరిగే ఆడవాళ్లకున్న హోదా, దర్జా లేదు. నాకా పెద్ద ఉద్యోగం, పరపతి లేదు. వాళ్ళ ఇంటి ఫర్నీచర్ ఖరీదు అంత చేయదు మన ఇల్లు. అయినా నీతో బాగా ఉంటుంది అంటే అనుమానించాల్సిందే".

"మీవన్నీ ఉట్టి అనుమానాలు. శ్రీదేవి తాను యే ఆస్తి కొన్నా, వెండి, బంగారు నగలు కొన్నా నాకే ముందు చెబుతుంది. ఏ టూర్లకు వెళ్ళి వచ్చినా ముందుగా నాకే చెబుతుంది, తనకు కావలసిన పచ్చళ్లు, ఊరగాయలు నాతోనే పెట్టించుకుంటుంది"

"అంటే చెప్పేది వినడానికి ఒక శ్రోత కావాలి. ఆమె తన డబ్బును, హోదాను ప్రదర్శిస్తే చూడడానికి, ప్రశంసించడానికి ఒక ప్రేక్షకురాలు కావాలి. సేవలు చేయడానికి ఒక వ్యక్తి కావాలి. వెరసి అన్నీ కలబోసిన నీలాంటి వ్యక్తి కావాలి".

"ఏమో నేను మీలా ఆలోచించలేను. అన్నట్లు ఒక విషయం చెప్పడం మరిచాను. రేపు శ్రీదేవి కిట్టి పార్టీ యేర్పాటు చేస్తుంది. నన్ను కూడా రమ్మంది. నేను వంటా వార్పూ పూర్తి చేసి తొమ్మిదింటి కల్లా వెళ్లిపోతాను. మీకు ఇంకొక విషయం చెప్పాలి. ఆమెను ఒకసారి మాటల్లో పెట్టి వాళ్ళ అబ్బాయి జాతకాన్ని తీసుకున్నాను. మా వేదాంతం అన్నయ్యకు చూపించాను. మన అమ్మాయి జాతకంతో సరిపోయింది అని చెప్పాడు. ఒక వేళ సంబంధం కుదిరి మన అమ్మాయి వాళ్ళింటి కోడలుగా వెళితే బాగా సుఖపడుతుంది".

"కయ్యానికైనా వియ్యానికైనా సమ ఉజ్జీలు ఉండాలంటారు పెద్దలు".

"ఆ పెద్దలే పిల్లను ఇచ్చేటప్పుడు సిరిసంపదలున్న ఇంటిలో ఇవ్వమన్నారు".

"నేను నీతో వాదించ లేను. అన్నట్లు మా చెల్లెలు నిన్న ఫోన్ చేస్తే ఎత్తలేదట".

'అప్పుడు శ్రీదేవితో మాట్లాడుతున్నాను. పని ఉన్నా లేకపోయినా 'వదినా ' అంటూ రోజుకు రెండూ మూడు సార్లు ఫోన్ చేస్తుంది. సోది వేస్తుంది".

"నీకు మనుషులను అర్థం చేసుకునే శక్తి లేదు. నేను ఆఫీసుకు వెళుతున్నాను".

సుమిత్ర ఇంటి పని, వంటపని గబగబా ముగించింది. సమయం తొమ్మిది గంటలయింది. కళ్ళు తిరుగుతున్నట్లు అనిపిస్తే, కప్పు కాఫీ

కథ

తాగింది. పిల్లలు, భర్త ఇంటి నుండి బయటికి వెళ్ళగానే శ్రీదేవి ఇంటికి బయలు దేరింది.

శ్రీదేవి ఇంటికి వెళ్ళగానే, తాను ఎవరికెవరికో ఫోన్లు చేస్తూ చాలా అసహనంగా, టెన్షన్‌గా కనిపించింది.

"హాయ్ ! శ్రీదేవి" అంటూ పలకరించింది

"వచ్చావా సుమిత్రా! నీవు ఎపుడు వస్తావా అని ఎదురుచూస్తున్నాను"

"ఏమిటి? యేమి జరిగింది"

"ఆ సారి మా కిట్టి పార్టీ సభ్యులు సంప్రదాయబద్ధమైన తెలుగు వంటలే చేయాలని అన్నారు. నేను శ్రీ నిత్య క్యాటరర్స్ కు ఆర్డర్ ఇచ్చాను. కానీ వాళ్ళు ఈ చివరి క్షణాలలో, తాము రాలేమని కబురుపెట్టారు. అడ్వాన్స్ కూడా వెనక్కి పంపారు. వేరే క్యాటరర్స్‌కు ఫోన్ చేస్తే ఇంత త్వరగా సేవలు అందివ్వలేమని అంటున్నారు. పోనీ హొటల్ నుండి తెప్పించుదామంటే వాళ్ళు హొటల్ నుండి తెప్పించ వద్దు అన్నారు"

"......................................."

"సుమ్మీ! నాకేమి చేయాలో పాలుపోవడం లేదు. వచ్చే వాళ్ళలో ఐ.ఎ.ఎస్. ఆఫీసర్ల భార్యలు, ఇండస్ట్రియలిస్ట్ ల భార్యలున్నారు"

" ....................................."

"ఆ అన్నట్లు నీవు లోగడ ఒకసారి, "నేను మా ఇంటిలో యే ఫంక్షన్ వచ్చినా యాభై, అరవై మందికైనా వంట చేస్తాను. అన్ని వెరైటీస్ చేస్తాను" అన్నావు

"అది నిజమే. కానీ నాకు మా ఆడ పడుచు తోడుగా ఉండడం వల్ల చేసే దానిని"

"పక్క వీధిలోనే మా ఆడపడుచులు ఉన్నారు. కాని నాకు వాళ్ళను పిలవడం ఇష్టం లేదు. సమయానికి మా వంటమ్మాయి రాలేదు. చూస్తే పది అవుతుంది. వాళ్ళు పన్నెండు కల్లా వస్తామన్నారు"అన్నది చేతులు నొక్కుకుంటూ శ్రీదేవి.

"శ్రీదేవి నీవు టెన్షన్ పడకు. కిచెన్ చూపించు. అదేవిధంగా నాకేమేమి చేయాలో చెప్పు" అన్నది సుమిత్ర ఏదో నిశ్చయానికి వచ్చినదానిలా. ఆ మాట కొరకే ఎదురు చూస్తున్నాదానిలా శ్రీదేవి, సుమిత్రకు వంటకాల లిస్ట్, వంటిల్లు, సరుకులు, కూరగాయలు, నాలుగు బర్నర్లు ఉన్న రెండు పొయ్యిలు అప్ప చెప్పి లివింగ్ హాల్లోకి వెళ్ళిపోయింది.

శ్రీదేవి చదివిన వంటకాల లిస్ట్ చూసిన తరువాత కొంచెం భయపడినా, క్షణాల్లో అవి అన్నీ ఎలా చేయాలో తన మనసులో ప్లాన్ వేసుకుంది. తాను కట్టుకొని వచ్చిన కాస్ట్లీ చీర వంట ఇంటిలో పాడయి పోతుంది అనిపించినా, పెద్దగా ఆలోచించక బొడ్డులోకి చెక్కుకుంది. సుశిక్షితురాలైన పాక ప్రవీణురాలిలా వంటకాలు సిద్ధం చేయడంలో మునిగి పోయింది. అలా ఎంత సేపు వంటింటిలో ఉందో తెలియదు.

నవ్వుల కలకలం వినిపించడంతో శ్రీదేవి ఫ్రెండ్స్ వచ్చి ఉంటారని భావించి, తాను చేసిన వంటకాల వైపు చూసింది. మామిడి కాయ పుళిహోరా, ఆలుబోండా, అరటికాయ బజ్జీలు, క్యారెట్ హల్వా, ఆలూ గోబీ వేపుడు, ఆకుకూర పప్పు, వంకాయ పూర్ణం, పోపు పప్పుచారు, టమాట పచ్చడి, అప్పడాలు, వడియాలు కనిపించాయి. గడియారం చూసింది.



పన్నెండున్నర కావస్తుంది. 'రెండున్నర గంటల్లో ఇన్ని పదార్థాలు నేనేనా చేసింది' అనుకున్నది.

ఈసారి ఇంకా గట్టిగా ఈలలు, చప్పట్లు, పాటలు, కేకలు వినిపించ సాగాయి. ఎంతకైనా మంచిదని రాగానే ఇవ్వడానికి వెల్ కమ్ జ్యూస్‌గా ఆరెంజ్ జ్యూస్ సిద్ధం చేసింది.

ఇంతలో శ్రీదేవి వంటింటి లోకి వచ్చి, వండిన పదార్థాలవైపు ఆనందంగా, ఆశ్చర్యంగా చూసింది. ఒకటీ ,రెండు పదార్థాల రుచి చూస్తూ, "అబ్బా! సూపర్! నీవు నా పరువును కాపాడావు"అంటూ అభినందించింది. అంతలో కొందరు వంటింటిలోకి వచ్చారు

శ్రీదేవి వారికి అరటికాయ బజ్జీలు ఇచ్చింది. వాళ్ళు తింటూ, "వావ్! సూపర్!" అంటూ అభినందించారు.

ఒకావిడ "మీ వంటావిడ బాగా వంటలు చేసేట్టుంది. మా ఇంటిలో ఉన్న వంటావిడకు కనీసం చారు కూడా పెట్టి చావరాదు" అన్నది. శ్రీదేవి ఆమె మాటకు యేదో పెద్ద జోక్ విన్నదానిలా పడిపడి నవ్వుతూ, "మనం ఈ బజ్జీలు తింటూ గేమ్స్ ఆడదాం"అంటూ అందరినీ అక్కడి నుండి తీసుకు వెళుతూ, "సుమిత్రా! ఈ జ్యూస్, బజ్జీలు మాకు హాల్‌లోకి తెచ్చి సర్వ్ చేయ్"అంటూ ఆర్డర్ పాస్ చేసి అక్కడి నుండి వెళ్ళింది.

శ్రీదేవి తనను తన స్నేహితురాళ్ళకు పరిచయం చేయకుండా, పనావిడకు చెప్పినట్లు ఆర్డర్ వేయడం బాధగా అనిపించినా, హడావిడిలో అలా చేసిందేమోనని అనుకోని, స్నాక్స్, జ్యూస్ హాల్‌లోకి తీసుకువెళ్ళింది. ఆ తరువాత శ్రీదేవి తన ఫ్రెండ్స్‌తో తంబోలా, కార్డ్స్ వంటి ఆటలు ఆడుతూ బిజీగా ఉండ డంతో సుమిత్రకు యేమి చేయాలో తోచక, హాల్‌లో ఒక టేబుల్ వేసి, చేసిన పదార్థాలన్నీ రకరకాల కేసరోల్స్, బోవల్స్‌లో అందంగా సర్దింది. లంచ్ ప్లేట్స్, గ్లాసెస్ ఆరెంజ్ చేసింది. ఆ తరువాత ఒక పక్కన మౌనంగా కూర్చుంది.

**"శ్రీదేవి నీవు టెన్షన్ పడకు. కిచెన్ చూపించు. అదేవిధంగా నాకేమేమి చేయాలో చెప్పు" అన్నది సుమిత్ర ఏదో నిశ్చయానికి వచ్చినదానిలా. ఆ మాట కొరకే ఎదురు చూస్తున్నాదానిలా శ్రీదేవి, సుమిత్రకు వంటకాల లిస్ట్, వంటిల్లు, సరుకులు, కూరగాయలు, నాలుగు బర్నర్లు ఉన్న రెండు పొయ్యిలు అప్ప చెప్పి లివింగ్ హాల్లోకి వెళ్ళిపోయింది.**

ఒక గంట గడిచిన తరువాత అంత వరకు తన దిక్కు కూడా చూడని శ్రీదేవి, "సుమిత్రా! వి ఆర్ టయర్డ్ అండ్ హంగ్రీ. అందరికీ లంచ్ సర్వ్ చేయ్" అన్నది దర్పంగా. ఎవరికి వాళ్ళు పెట్టుకొని తింటారు అనుకున్న సుమిత్ర ఈ అదనపు బాధ్యతకు కొంత బాధపడుతూ, శ్రీదేవి ఏమైనా అనుకుంటుందేమో అనుకోని, కుర్చీలలో, సోఫాలలో కూర్చున్న అతిథులకు లంచ్ సర్వ్ చేసింది.

వడ్డించేటప్పుడు పొరపాటున ఒకావిడ చీరపైన కాస్తా పోపు పప్పుచారు ఒలికింది. దానితో ఆమె, కోపంగా "యూ రెక్ లెస్ వుమన్... అంటూ గట్టిగా కేకలేసింది. "సారీ! పొరపాటయింది" అని చెబుతున్న వినకుండా తిడుతుండటంతో, నిస్సహాయంగా శ్రీదేవి వైపు చూసింది.

శ్రీదేవి సర్ది చెప్పడానికి బదులుగా, "సుమిత్రా! చూసి వడ్డించవచ్చు కదా" అంటూ సుమిత్రను తిడుతున్న ఆవిడ వద్దకు వెళ్ళి "సారీ" చెప్పింది. సుమిత్రకు మనస్సు చివుక్కుమంది.

శ్రీదేవి గెస్ట్‌లతో పాటు భోజనం చేసింది. సుమిత్రతో మాట వరుసకైనా తినమని అనలేదు. పైగా ఆపని, ఈ పని పురమాయించసాగింది.

సుమిత్రకు ఉదయం తాగిన కాఫీ తప్ప కడుపులో యేమి లేకపోవడంతో, పైగా అప్పటివరకు ఒక్క చేత్తో పెద్ద పనే చేయడంతో ఆకలి, నిస్సత్తువ ముంచు కొచ్చాయి. వెళ్ళి తిందామని అనుకు న్నదల్లా, అభిమానం అడ్డు పడటంతో, అక్కడి నుండి మౌనంగా వంటింటిలోకి వెళ్ళి అక్కడే కళ్ళు మూసుకొని కూర్చుండిపోయింది.

ఇంతకాలం తనతో ఫ్రెండ్లీగా ఉంటూ సినిమాలు, షికార్లు, చీరల గురించి మాట్లాడే శ్రీదేవి ఎందుకు ఇలా బిహేవ్ చేసిందో ఆలోచించసాగింది. మాటల సందర్భంలో ఒక సారి శ్రీదేవి తనతో, "నాకు లోయర్ మిడిల్ క్లాస్, మిడిల్ క్లాస్ వాళ్ళతో స్నేహాలు గిట్టవు. అందుకే మా ఆడపడుచులను దూరం పెడతాను" అన్న మాటలు గుర్తుకు వచ్చాయి.

మరి తానూ మిడిల్ క్లాస్ కదా. అంటే యేమయినా అవసరాలు వస్తే తనలాంటి వాళ్ళతోడు శ్రీదేవికి కావాలి. కాబట్టి తనతో "మత్లబీ దోస్తానా" చేసింది. అవసరాలకు తన ఆడపడుచులను చేరదీస్తే వాళ్ళు యేదైనా ఆశించవచ్చు. తాను యేదీ ఆశించదు. కాబట్టి తనను వాడుకుంది.

తన భర్త తనకీ, శ్రీదేవికీ మధ్య ఉన్న అంతరాన్ని తెలియ జేసినా, శ్రీదేవి లాంటి వాళ్ళ తత్వాన్ని విడమరిచి చెప్పినా తమ మధ్య ఉన్నది పవిత్రమైన స్నేహం అని భావించి వాస్తవాన్ని అర్థం చేసుకోలేదు. ఆలోచిస్తుంటే తన భ్రమలు తొలిగిపోసాగాయి.

అలికిడి కావడంతో కళ్ళు తెరిచి చూసింది. ఎదురుగా శ్రీదేవి మరొక బిగ్ షాట్ తో. 'సుమిత్రా! ఈమె కన్నడిగ. వీళ్ళ ఆయన బ్యాంక్ మేనేజర్. ఈవిడకు నీ వంటలు బాగా నచ్చాయట. వచ్చే వారం వాళ్ళయింటిలో మాకు కిట్టీ పార్టీ అరెంజ్ చేస్తుందట. నీవే వంట చేయాలని పట్టు పడుతుంది. నీకు అయిదు వేలు ఇస్తుందట. నీ తరపున నేను హామీ ఇచ్చాను. మరొక విషయం.ఈ రోజు వచ్చిన వాళ్ళలో మిసెస్ రామ కృష్ణ ఐ.ఎ.ఎస్. ఆఫీసర్ భార్య. ఆమెకు నీ వంట చాలా నచ్చింది. నేను ఇచ్చిన

కథ

పార్టీతో 'ప్లేజ్' అయింది. వాళ్ళమ్మాయిని చూసుకోవడానికి త్వరలో వాళ్ళింటికి రమ్మంది.

మా అబ్బాయి వాళ్ళకు నచ్చి, ఆ సంబంధం కుదిరితే నేను చాలా లక్కీ. కోట్ల సంబంధం. పైగా వాళ్ళు అమెరికాలో సెటిల్ కాబోతున్నారు.అన్నట్లు నేను మిసెస్ సింఘాల్ ఇంటికి వెళ్ళాలి. నీవు తినేసి వెళ్లిపో'' అన్నది.

అంతవరకు శ్రీదేవి ప్రవర్తన గురించి ఆలోచిస్తున్న తనకు, ఆమె మాటలు, ప్రవర్తన మరింత బాధను, అవమానాన్ని కలిగించగా, చివరికి తాను ఆశించినది కూడా జరగదని తెలిసిరావడంతో, ఒక్కసారిగా 'కనువిప్పు' అయినట్లుగా అనిపించింది.

ఇంకా అక్కడ ఒక క్షణం ఉండ బుద్ధికాక, "వస్తా శ్రీదేవి! మా పిల్లలు వచ్చే వేళ అయింది'' అంటూ అక్కడి నుండి బయటపడింది.

ఎట్లా వచ్చిందో,ఇంటికి రాగానే మంచం మీద పడిపోయింది.

ఎవరో భుజాల మీద చేయివేసి లేపడంతో, లేచి కూర్చుంది. ఎదురుగా ఆడపడుచు పార్వతి.

"ఏమిటి సుమ్మీ! తలుపులు తెరిచి అలా పడుకున్నావు. ఒంట్లో బాగాలేదా?'' అంటూ ప్రేమగా తల పైన చేయి వేసింది.

"లేదు వదినా! ఏదో అలసటతోఒళ్ళు మరిచి నిద్రపోయాను'' అన్నది.

పార్వతి వంట ఇంటిలోకి వెళ్ళి ఒక ప్లేట్, కప్పు తెచ్చింది. అందులో తాను తీసుకు వచ్చిన గారెలు, పచ్చడి ప్లేట్‌లో పెట్టి, కప్పులో పాయసం పోసి చేతికి ఇచ్చింది.

"వదినా! మీరేందుకు కష్టపడు తున్నారు'' అంటూ లేచి పలహారం అందుకుంది.

"మా రాఘవకు జాబ్ కన్ఫర్మ్ అయింది. మంచి ప్యాకేజ్ కూడా ఇచ్చారు. ఒక సంవత్సరం తరువాత అమెరికాకు కూడా పంపుతారట. దానితో ఇంటిలోనే ప్రసాదాలు చేసాను. మనవీధి చివర ఉన్న వినాయకుని గుడికి వెళ్ళి, నైవేద్యం సమర్పించాను. మీతో ఈ ఆనందం పంచుకోవాలని సరాసరి ఇటే వస్తున్నాను. మాకు, నీవు అన్నయ్య తప్ప ఇంకెవరు ఉన్నారు'' అన్నది ఆప్యాయంగా.

ఆకలి వల్లనో, పార్వతి ఆప్యాయతతో కూడిన మాటల వల్లనో సుమిత్ర, పార్వతి పెట్టిన ప్రసాదాలను ఆవురావురని తిన్నది. ప్లేట్ సింక్ లో వేసి వచ్చి పార్వతి చేతులు పట్టుకొని మౌనంగా కూర్చుంది

"ఏమిటి సుమ్మీ!'' అలా ఉన్నావు అంది.

'నీ చేతిలో పాయసం నీ మనసంతా కమ్మగా ఉంది. ఆ కమ్మదనాన్ని నా బిడ్డకు కూడా పంచు....

నీ కోడలిగా చేసుకొని''అన్నది

"ఇందూ పుట్టగానే నా కోడలు అయింది. ఇంకా నీవు నాకు వేరే చెప్పాలా సుమ్మీ!'అంది

"రాఘవకు సంబంధించిన శుభవార్త మీ అన్నయ్యకు ఫోన్ చేసి చెబుదాం పద'' అంటూ లాండ్ లైన్ కనెక్షన్ ఉన్న హాల్ వైపుకు దారితీసింది సుమిత్ర.

పార్వతి సంతోషంగా సుమిత్రను అనుసరించింది.

కవిత

# వేగుచుక్కలు



**కలిపె రాజ్ కుమార్, 81251 44729**

ఆవలి చీమలు ఈవలికి దూరకుండా
అనుక్షణం సైనికులు కావలి కాస్తరు!
అంగుళం జాగా అన్యాక్రాంతం కాకుండా
అప్రమత్తంగా విహంగ వీక్షణం చేస్తరు!!

ఆలుబిడ్డలను ఇరుగుపొరుగుకొదిలి
ఆయుధాలతో దోస్తీ జబర్దస్త్ గ చేస్తరు!
దివారాత్రాలు అలుపెరుగని ధీరత్వంతో
నిఘానేత్రాలై నిబ్బరంగ సంచరిస్తరు!!

మాయతెరలపై వలపు చిలకలు
ముచ్చటతో మురిపెంగా పలకరిస్తయ్!
మరుగు మందులతో వేగుచుక్కలు
వెచ్చ వెచ్చగా కులకరిస్తయ్!!

అంగలార్చుతూ చొంగ కార్చితే
తేరగా తేనె తుట్టెను కదుపుతయ్!

తేనెలూరే పెదాలను తేలికగా కుదువ బెట్టి
రణరంగ మర్మాంగాలను లాఘవంగా లాక్కుంటై!!

చాణక్య సూక్తులను చాలా వల్లె వేయించినా
గుణపాఠం నేర్వని గుడ్లగూబలు!
గూఢరహస్యాల గుడ్డలమూటలను
ఒక్కటొక్కటిగా ఒలిచి అప్పనంగా ఒప్పజెప్తాయి!!

గోమాయువుల గోత్రాలెరిగి
కపట వ్యూహాలను కంటితో ఛేదించాలి!
దాయాదుల దారుణాలను
దౌత్య నీతితో దఖలుపరచ యత్నించాలి!!



*(హనీట్రాప్ లను దృష్టిలో ఉంచుకుని)*

# స్త్రీత్వ వేదనలో 'జ్వలిత కౌసల్య'

రామాయణ కాలం నాటి ఒక సాత్వికురాలు రగిలిన తీరును విశ్లేషించిన వ్యాసం...



డా॥ వంగరి త్రివేణి
99514 44803

'ఆధునిక రచనల్లో ప్రాచీన సాహిత్యంలో కన్నా స్త్రీ ప్రాధాన్యం ఎక్కువగా కనిపిస్తుంది. స్త్రీ విముక్తిని కోరే మహిళా చైతన్య భావాల వ్యాప్తి, పరిధి ఇటీవలి దశాబ్దాల్లో ఇంకా విస్తరించింది. స్త్రీ వాదోద్యమ ప్రభావం పురుషుల మీద, పురుషుల రచనల మీద పడడం ఆహ్వానించదగింది. స్త్రీ వాదులు కోరే సాంఘిక న్యాయాన్ని ఇప్పుడిప్పుడే పురుషులు అర్థం చేసుకుంటున్నారు. అంగీకరిస్తున్నారు. ఈ విషయంలో జరుగవలసిన అభివృద్ధి చాలా ఉన్నప్పటికీ, కనీసం ప్రథమ దశ ప్రారంభమయింది. భూమయ్య చిత్రించిన 'జ్వలితకౌసల్య' ను ఈ దృక్కోణం నుంచి అర్థం చేసుకోవాలి. కావ్యనామమే కావ్య వస్తు స్ఫోరకంగా ఉంది. అయితే భూమయ్య కావ్యం స్త్రీవాద కావ్యం అని నేను ముద్ర వెయ్యటం లేదు. ఈ కావ్యాన్ని అర్థం చేసుకోవడానికి స్త్రీవాద పరిచయం ఉపయోగిస్తుందనే నా సూచన' (పుట.2)

'జ్వలిత కౌసల్య' మొదటి ముద్రణ సందర్భంలో 'లఘుటిప్పణి' రచిస్తూ ఆచార్య చేకూరి రామారావు ప్రస్తావించిన అంశం ఇది. ఆచార్య అనుమాండ్ల భూమయ్య 1999 నాటికే ఈ పుస్తకాన్ని రచించి ప్రచురించారు. స్త్రీవాద భావ జాలం తెలుగు సాహిత్యంలో ప్రవేశించి విస్తృత ప్రయోజనాలు చేకూరుతున్న




కాలమది. స్త్రీవాద పరివ్యాప్తిలోను, ఉద్యమ రూపంలో కార్యరూపం దాల్చడంలోను సాహిత్యం హితోధిక సాయం చేస్తున్న సమయమది. ఆ పరిమిత కాలంలోనే స్త్రీవాదం ప్రపంచ ప్రమాణాల మీద నిలబడుతూ వినూత్న భావజాలాన్ని ప్రకటించింది. స్త్రీలు వెలువరించిన సాహిత్యమే గాక, ఆచార్య చేకూరి రామారావు చెప్పినట్లు పురుషుల సాహిత్య మనోగతాలపై ప్రభావాన్ని చూపింది. సంప్రదాయక పౌరాణిక పాత్రల్లో గల స్త్రీల అభినివేశాన్ని సాహిత్యబద్ధం చేస్తూ నూతన ఒరవడిని సృష్టించారు. ఆధునిక సాహిత్య ధోరణులకు అనుగుణంగా సావిత్రి, పురూరవ, సీత, జాబాలి, వరూధిని, ఊర్మిళ, కౌసల్య, కైకేయి, కచదేవయాని, గాంధారి, పూర్ణమ్మ, కన్యక పాత్రల భావైక స్ఫూర్తిని చిత్రించారు. స్త్రీ పౌరుష కాంక్షను, శక్తి సామర్థ్యాలను, మనోఅభీష్టాన్ని, చింతనాత్మక వ్యథను వెలువరించారు. తద్వారా ఆధునిక సమాజానికి ఒక ఉపదేశాత్మక సందేశం అందించారు.

'జ్వలిత కౌసల్య' కావ్యాన్ని స్త్రీవాద కోణం నుండి అవగాహన చేసుకోవడమే ఈ వ్యాసం ఉద్దేశం. సహృదయులు అవలోకిస్తారని ఆశిస్తున్నాను. ఆచార్య అనుమాండ్ల భూమయ్య దృక్పథం స్త్రీవాదం గాకపోయినా వస్తు నిర్దేశం దృష్ట్యా ఈ అంశం నిర్ణయాత్మమైందని భావిస్తున్నాను. పూర్తి కథాంశం కౌసల్య గుండెలలో గూడు కట్టుకున్న అగ్నిజ్వాలలను విచ్ఛేదం చేయడం. కౌసల్య మనోగతాన్ని ఆవిష్కరించడం. తద్వారా దీర్ఘకాలంగా ఉన్న మనోవ్యథ నుండి ఉపశమనం కోరుకోవడం. ఈ నేపథ్యంలోనే తన సంసారిక జీవితంలో తీరని కోరికలు, బహుభార్యత్వం వల్ల భర్త నుండి పొందిన ప్రేమానురాగాలు, తోటి సవతులతో పడిన అవమానాలు ఒకటేమి సగటు మహిళ పడే ఆవేదన కౌసల్యలో ఆవిష్కృతమవుతుంది. కౌసల్య

వ్యాసం

మనోవేదన స్త్రీవాద లక్షణాలకు అన్వయింపదగినవే.

మరొక అంశం 'జ్వలిత కౌసల్య' ఒక విధంగా చేతనాత్మక కావ్యం. అంతర్గత మధనం, భావాల సంఘర్షణ, అనుభవాల సంచయం అన్ని కలిపి మనో విశ్లేషణ సూత్రాల్లోకి కౌసల్య ఇమిడిపోతుంది. మానసిక వ్యధను ప్రత్యక్షంగా ఈ కావ్యంలో చిత్రించారు కవి. ఎంతో కాలంగా మనస్సులో దాచుకున్న ఆవేశాన్ని, క్రోధాన్ని బయట పెట్టడం మనోవైజ్ఞానిక అంశాలకు అనువర్తించ వచ్చు. అచేతనంలో దాగి ఉన్న మానసిక సంవేదనను చేతనత్వంలోకి తీసుకొని రావడం ఇందులోని ప్రధానాంశం. దు:ఖప్రోదిని ఛేధించడానికి కవి ఈ కావ్యాన్ని ఆలంబనగా చేసుకున్నారు. తనకు కలిగిన అన్యాయాన్ని మరొకరి విషయంలో కలుగకుండా ఉండడంలో కౌసల్య చేసిన ఉపదేశం సత్ప్రవర్తన దిశగా నడుస్తుంది. కథాగమనాన్ని, పాత్రల ప్రవర్తనా శైలిని కవి అత్యంత నేర్పుతో ప్రదర్శించారు.

ఉపదేశాత్మకంగా కావ్యాన్ని వెలువరిచడంలో కవి ప్రధాన శ్రద్ధ వహించారు. ఆధునిక సాహిత్యంలో ఇటువంటి ప్రయత్నాలు చాలా జరిగాయి. స్వతంత్ర కథలను తీసుకొని పాత్రల పరంగా ధర్మప్రభోదం విస్తృతం చేశారు రచయితలు. అంతేగాక సంప్రదాయిక పాత కథల ప్రయోగం నేటి సమాజాన్ని సంస్కరించాయి. సందేశాత్మకమైన గాథలు వ్యవస్థ పునరుద్ధరణకు కృషిచేశాయి. సామాజిక ప్రయోజనానికి ప్రాచీన సాహిత్యంలోని గుణాత్మకమైన వస్తు నేపథ్యం కవులకు తోడ్పాటునందించాయి.

'జ్వలిత కౌసల్య' కావ్య స్వభావంలో స్త్రీవాద భావవ్యక్తీకరణ మనోవైజ్ఞానికి విశ్లేషణ, ఉపదేశాత్మకం వంటి విభిన్నమైన మౌలికాంశాలను గుర్తించవచ్చు. కవి కావ్య నిర్మాణంలో ప్రకృష్టమైన వస్తువును సరళతరం చేశారు. పద్య రచనా సౌగంధంలో మేటి ఆచార్య అనుమాండ్ల భూమయ్య రామాయణ గాథలోని కౌసల్య మనోవేదనను వాల్మీకి రచనాపరంగా నినదించారు కవి. వాల్మీకి రామాయణం లోని ఆయోధ్య కాండలో 20వ సర్గలో కౌసల్య శ్రీరాముని ఎదుట తన వేదనను వ్యక్తపరిచిన ఘట్టం ఉంది. మొత్తం ఆరు సర్గలలో వ్యక్తపరిచిన ఆవేదన కవి కావ్యానికి ప్రధానాధారంగా నిలిచింది. ఆ ప్రేరణ వల్లనే ఈ కావ్యం రూపొందింది. శ్రీరాముడు ఈ జన్మకు ఏకపత్నీ వ్రతుడిగా ఉంటానని ప్రమాణం చేయడం ఇందులోని ముఖ్యాంశం. కథాంశాన్ని మొత్తం ఎనిమిది ఉప శీర్షికలలో విభజించారు. సంక్లిష్టమైన కథ ఉప శీర్షికలో ఒద్దికగా నిలిపారు భూమయ్య. కైకేయి వరం, జ్వలిత కౌసల్య, అనంత క్రోధం, మాతృ హృదయం, పితృ వాక్యం, పుత్ర వాత్సల్యం, ఏకపత్నీ వ్రతం, మంగళాశాసనం వంటివి ఈ కావ్యానికి ఒక క్రమణికను సూచించాయి. కథా గమనంలో కార్యోన్ముఖతను సాధించడం కవి కవితా ప్రక్రియలో ప్రదర్శించిన ప్రత్యేక నైపుణ్యం. 109 పద్యాలు కలిగిన ఈ కావ్యం నాలుగు ముద్రణలు సంతరించుకోవడం విశేషం. చేకూరి రామారావు, బేతవోలు రామబ్రహ్మం, పేర్వారం జగన్నాథం వంటి విమర్శకులు ఈ కావ్య ముద్రణలో ముందు మాటలు రాశారు. అబ్బూరి ఛాయాదేవి, మలయ వాసిని, వాసా ప్రభావతి, వెంకమాంబ, గంగప్ప వంటి సాహితీవేత్తలు స్త్రీ సంవేదనా రూపంలో 'జ్వలిత కౌసల్య'ను పరామర్శించారు.



తండ్రి ఆజ్ఞ మేరకు పినతల్లి ఇంటికి వెళ్ళిన శ్రీరాముడికి ఘోర ఉపద్రవం మీద పడుతుంది. పట్టాభిషిక్తం పొందే వేళలో అరణ్యానికి వెళ్ళాలనే కైక అనుజ్ఞను శ్రీరాముడు శిరసావహిస్తాడు. తన తల్లితో నివేదించి అనుమతి పొందడానికి కౌసల్య భవనానికి వచ్చినప్పటి నుండి కథ ప్రస్థానం ప్రారంభమవుతుంది. ఆచార్య అనుమాండ్ల కౌసల్య మనో చింతనను ప్రవేశ పెట్టడానికి ఆరంభ పద్యాన్ని ప్రయోగించారు. తల్లిదండ్రుల సాపేక్ష కైకేయి వరంలో ఉపేక్ష ప్రత్యక్ష కావ్య కథన ధారకు ఉత్కర్షగా నిలిచింది.

తల్లి కొడుకుల ఆప్యాయతా వాత్సల్యాలను అత్యంత మధురంగా భూమయ్య ప్రవేశపెట్టారు.

స్వాగతింప తన కెదురు వచ్చినట్టి
తల్లి పాదమ్ములను మ్రొక్కె ధర్మమూర్తి
రామచంద్రుండు, కౌసల్య రామునెత్తి
శిరము మూర్కొనె కౌగిట జేర్చి

*(పుట.15)*

వర్తమాన కాలంలో తెలుగువారింటి వ్యవహార రూపంలో ఉన్న ఆచార సంప్రదాయాలను ప్రవేశపెట్టారు కవి. కౌసల్య రామచంద్రుల అనుబంధాన్ని చూపించారు. శ్రీరాముడు శిరస్సు వంచి గౌరవ వందనం చేయడం, కౌసల్య శ్రీరాముడిపై పుత్ర వాత్సల్యాన్ని ప్రకటించడం హృదయ మనోహరంగా భూమయ్య రచించారు.

గతంలో తన తండ్రి కైకకు ఇచ్చిన రెండు వరాలను ప్రస్తుతం తీర్చుకుంటున్నట్లు... తల్లితో నివేదిస్తాడు శ్రీరాముడు. ఒకటి భరతుడికి యువరాజ పట్టాభిషేకం, రెండవది పద్నాలుగు సంవత్సరాలు రాముడు అరణ్యవాసం చేయడం. ఈ విషయాలు తెలిపి

అడవులకు వెళ్ళడానికి తల్లి కౌసల్య అనుమతిని పొందడానికి వచ్చినట్లుగా తెలుపుతాడు. తండ్రి ఆజ్ఞను పాటించడం ఉత్తమ ధర్మంగా ప్రకటిస్తాడు. ఒక్కసారిగా రాముడి మాటలు విన్న కౌసల్య 'స్వర్గమున నుండి పడిన దేవత వోలె నేల పడిపోయె' అని కవి వర్ణిస్తాడు. శాపవశాన అప్పుడప్పుడు దేవ లోకం నుండి దేవ కన్యలు, కిన్నెరలు, గంధర్వులు, కింపురుషులు భూలోకం మీద ఉద్భవించడం చూస్తుంటాం. భూమయ్య ఈ ఉపమానం ప్రయోగించడంలో తన జన్మను కోల్పోయిన స్త్రీ దైన్యస్థితి ఎలా ఉంటుందో అర్థమవుతుంది. కౌసల్య దు:ఖ వారధికి ఇది అనుసంధానింపబడింది.

స్త్రీలు తమకు కలిగిన శోకానికి, విషాదానికి ప్రకృతిని ప్రమేయం చేయడం గమనిస్తుంటాం. కౌసల్య తన కుమారునికి కలిగిన విపత్తుకు చింతిస్తుంది. 'ఇదేమి దినము కత్తులే కిరణములుగా కరకు గుండె దాల్చి సూర్యుడిదేలా ఉదయము నందె' అంటూ తన విధికి, వ్యధకు విలపిస్తుంది. ఒక్కో దినం గడియను బట్టి శుభాలు, అశుభాలుగా పరిగణింపబడుతాయి. కాలం మీద, సూర్య చంద్రుల కాలగమనం మీద జనులకు కొన్ని నమ్మకాలు, విశ్వాసాలు ఉన్నాయి. ప్రకోపాలు కూడా లేకపోలేదు.

పుట్టినింట ఆనాడు నేపొందిన సుఖ
మేమెకాని, ఈ మీ తండ్రి ఇంట నేను
కాలు మోపిన పిదప సుఖము నెరుంగ
నిన్ను గన్నాను బ్రతుకు కన్నీరు
తడిచె'

అంటూ కౌసల్య తన జీవిత గాధను వినిపిస్తున్న సందర్భంలో ఒక విషయం స్పష్టమవుతుంది. పుట్టింట్లో తానెంత సుఖం పొందిందో తెలియని తనంలోనే కౌసల్య వివాహం జరిగింది. బాల్యంలోనే దశరథ మహారాజుతో పరిణయం జరగడం కూడా ఆమె దు:ఖానికి ఒక హేతువు. బాల్య వివాహాల మీది దుష్ప్రభావాలు రామాయణ కాలం నుండి భారంగా మారాయని 'జ్వలిత కౌసల్య' ద్వారా ప్రత్యక్షంగా తెలుస్తుంది. చివరకు అంత:పుర స్త్రీలు అయినా వైవాహిక జీవితంలో దు:ఖ సాగరాన్ని ఈదారనడానికి ఈ దృష్టాంతం తార్కాణంగా నిలుస్తుంది. తాను పుట్టి పెరిగి, ఆడి పాడి, ఆనందంగా గడిపిన రోజులు అనుభవంలో లేని పరిస్థితి ఆమెది. ఇక వివాహం అయిన తర్వాత అత్తవారింటిలో ఏనాడు సుఖం పొందినట్లు ఏ ఆనవాలు వ్యక్తపరచలేకపోవడం ఆమె విధిరాతను తలపోస్తాయి. దీనికి రెండు కారణాలను కవి భూమయ్య ప్రస్ఫుటం చేశాడు. ఒకటి కౌసల్య వివాహానంతరం భర్త నుండి సుఖం పొందలేకపోవడం. దీనికి కారణం దశరథుడి బహుభార్యత్వ ప్రాధాన్యం. కైకేయిపై మోజును పెంచుకోవడం. ఆమెకు దాసుడు కావడం. రెండవది సపత్నుల వ్యవహార ధోరణి. కౌసల్య పట్టమహిషి అయినా ఆమెకు గౌరవాదరణలు దక్కలేకపోవడం. సపత్నుల పరుష వాక్కులు ఆమె హృదయాన్ని గాయపరచడం. అవమానాల జలధి ఉధృతంగా మారి గుండెలో సుళ్ళు తిరగడం.

న దృష్ట పూర్వం కళ్యాణం సుఖం నా పతి పౌరుషే

**స్త్రీలు తమకు కలిగిన శోకానికి, విషాదానికి ప్రకృతిని ప్రమేయం చేయడం గమనిస్తుంటాం. కౌసల్య తన కుమారునికి కలిగిన విపత్తుకు చింతిస్తుంది. 'ఇదేమి దినము కత్తులే కిరణములుగా కరకు గుండె దాల్చి సూర్యుడిదేలా ఉదయము నందె' అంటూ తన విధికి, వ్యధకు విలపిస్తుంది. ఒక్కో దినం గడియను బట్టి శుభాలు, అశుభాలుగా పరిగణింపబడుతాయి. కాలం మీద, సూర్య చంద్రుల కాలగమనం మీద జనులకు కొన్ని నమ్మకాలు, విశ్వాసాలు ఉన్నాయి. ప్రకోపాలు కూడా లేకపోలేదు.**

అపి ప్రత్యేపి పశ్యేయ మితి
రామాస్థితం మయా
*అయోధ్య : సర్గ : 20 : శ్లో : 38*
అత్యంత నిగృహీతాస్మి భర్తుర్నిత్య
మతంత్రితా
పరివారేణ కైకేయ్యా
సమావాప్యధవావరా
*అయోధ్య : సర్గ : 20 : శ్లో : 42*

వాల్మీకి రామాయణంలో శ్లోకాలను అనుమాండ్ల భూమయ్య తన ముందు మాటలో ప్రస్తావించారు. భర్త వల్ల సుఖం లేకపోయిన విషయాన్ని వాల్మీకి రామాయణంలో పై శ్లోకాల్లో తెలుపబడింది. ఈ కావ్యానికి రామాయణ శ్లోకాల్లో కౌసల్య హృదయ తప్త జ్వాలను కవి ప్రవేశపెట్టారు. ఈ శ్లోకాల ఆధారంగానే కరుణ రసాత్మక గాథగా ఈ కావ్యం రూపాంతరం చెందింది.

**వంధ్యత్వం....**

కొడుకు మీద ఉన్న ప్రేమ, వాత్సల్యం కౌసల్య నోట అద్భుతంగా ప్రకటింపజేశారు భూమయ్య. శ్రీరామ చంద్రుడు రాజ్యానికి యువరాజు పట్టాభిషిక్తుడైనప్పుడే తాను సుఖపడే దశ వస్తుందని భావించింది. కౌసల్య తన కడుపు తీపి మేర రామచంద్రుని అల్లారు ముద్దుగా పెంచుతుంది. ఆ సమయంలో నిప్పులాంటి వార్త ఆమె అంతరంగాన్ని కల్లోలం చేసింది. పద్నాలుగు సంవత్సరాలు దండకారణ్యంలో వనవాసం చేయటం అనే తండ్రి ఆజ్ఞను ఆమె జీర్ణించుకోలేకపోయింది. ఆ విషయం ముందుగా తెలిసి ఉంటే కొడుకుగా శ్రీరాముడిని కనకుండా ఉండేదానిని అని ఆమె బాధపడుతుంది. కన్నతీపిని కూడా వద్దనుకునే విషమ పరిస్థితి కౌసల్యకు ఎదురవడమనేది మాత్ర హృదయం కలవరపడే విషయం.

నాడు నిన్నునే గనకున్న నష్టమేమి
కలిగెడిది? వంధ్యయను పేరొకటి యే
తప్ప
సంతులేదన్న ఏకైక చింత తప్ప
వంధ్యకు మరొక్క చింత రవ్వంత
లేదు *(పుట.20)*

ఏ ఇల్లాలు అయినా గొడ్రాలుగా ఉండడం అనే విషయాన్ని కలలోనైనా తలంచదు. కాని కౌసల్య తన నోటి ద్వారా ఆ పద్యాన్ని ఉచ్ఛరించడం అత్యంత వేదనాభరితమైంది. కొడుకును కని అడవుల పాలు చేయడం కంటే గొడ్రాలుగా మిగిలిపోవటమే ఉత్తమంగా భావించిన కౌసల్య కడుపుకోతను ఇక్కడ అర్థం చేసుకోవచ్చు. కవి అనుమాండ్ల భూమయ్య కౌసల్య పాత్రలో స్త్రీ దు:ఖ హేతువుకు పరాకాష్టగా వంధ్యత్వమనే శబ్దాన్ని ప్రయోగించడం గమనించవచ్చు.

**కడుపుకోత...**

కౌసల్య పరి పరివిధాలుగా శ్రీరాముడి మీద ఉన్న తల్లి ప్రేమను వ్యక్తపరిచిన తీరు కవి తన నేర్పుతో ప్రదర్శించాడు. తన దు:ఖానికి అంతం లేదని వాపోతూ, తనకు ఇంత దు:ఖం అనుభవించే శక్తి లేదని తలపోస్తుంది కౌసల్య. తన మీద దయచూపే ఏ దైవం కనిపించడం లేదని దు:ఖిస్తుంది. ఏ దిక్కు చూసినా శూన్యమే కనిపిస్తుందని తన దురదృష్టానికి చింతిస్తుంది.

కౌసల్య బాల్యంలో తన రామచంద్రుడు ఆడిన ఆటలు, అల్లారు ముద్దుగా పెరిగిన జ్ఞాపకాలు, చిలిపి చేష్టలను కౌసల్య గుర్తుకు తెచ్చుకోవడం కథా సందర్భాన్ని బట్టి ప్రధానమైనది. వెన్నను కొంత తిని అంతకన్నా మన్నును రుచిగా తిన గోరే రాముడిని చూసి కౌసల్య ఆవేదన చెందేదట. తల్లి చేత తిట్లు తింటూ దెబ్బ తగలకుండా తిరిగేవాడట. ఆటలు ఆడి అలిసిపోయి అమ్మ ఒడిలో చేరి పాలు తాగుతూ, తన కోరిక తీరలేదని ఏడ్చే వాడట. 'అమ్మ పిలిచె రారా! అన్నము తినిపోవేగ' అని కౌసల్య ఎంత పిలిచినా ఆట పాటలలో మునిగి పోయేవాడట. ఇటువంటి శ్రీరాముడి అల్లారు ముద్దు చేష్టలను మరువకముందే అడవుల పాలు కావడం కౌసల్యకు తీరని దు:ఖాన్ని మిగిలించింది.

*- జాలి చూప / గలుగు దైవ మొక్కరు గాని కానరారు / శూన్య గగనమే ఏ వైపు చూడనైన (పుట.21)*

*- దెబ్బ తగలకుండ తిరిగెడు పని చేష్ట / కనగ నింత నోచుకొనన లేదా? (పుట.21)*

*- తలపు తీరుకున్న ఏడ్పు తీయని పసి ఏడ్పు / వినగనింత నోచుకొననా నేను? (పుట.21)*

*- ఆడి పాడుచుండు అందాల రాశిని / కనగ వినగ నోచుకొనగ లేదా? (పుట.21)*

విధి తనతో ఆడుతున్న ఆటకు కౌసల్య ఎంతగా వ్యధ చెందిందో ఈ పద్యపాదాల్లో స్పష్టంగా కవి వ్యక్తపరిచాడు.

**సంతాన పరితాపం...**

సంతానం కోసం ఎన్నో నోములు, వ్రతాలు నోచింది కౌసల్య. ఎంతో కాలంగా అవన్ని 'ఎడారి నలికిన విత్తనములయ్యె' నని ఒక శిలగా మారిపోయింది. ఎప్పుడైతే శ్రీరాముడు జన్మించాడో, అప్పుడు కౌసల్య పునర్జన్మ ఎత్తినట్లుగా భావించింది. ఒక తల్లిగా సార్థకం కాని స్త్రీ జన్మ ఊహించలేనిది. కౌసల్య సంతానప్రాప్తి కోసం పరితపించిన సన్నివేశాలు కవి సహజంగానే వర్ణించాడు. తాను సంతానం కోరుకుంటే తన ఇంటిలో సాక్షాత్తు ఆ శ్రీ మహా విష్ణువే అవతరించినట్టుగా భావించింది.

*పాల సంద్రమే మా ఇంట పరిమళించె*
*కల్పవృక్షమే నట్టింట కదలి యాడె*
*సత్య ధర్మమ్ములమృతమై జాలువారె*
*చలువ పందిళ్ళు వేసెను చందమామ*
*(పుట.22)*

శ్రీరాముని పుట్టుక సందర్భాన్ని ఆనంద పరవశాన్ని కౌసల్య వదనంలో కవి అద్భుతంగా వర్ణించాడు. బాల్యం నుండి రామచంద్రుని చూచుకోవడమే తపంగా, అలంకరించడమే పూజగా కౌసల్యకు కాలం సాగింది. అంతలోనే యువరాజు పదవికి రాముడు చేరుకోవడం తల్లికి ఆశ్చర్యమే. ఇంతలోనే వనవాస ఆజ్ఞను తట్టుకోలేకపోయింది. 'నా ఉరమ్ము పగుల ఏడ్చి ఏడ్చి శిలనైతినెపుడొ, ఇప్పుడేడ్చి ఏడ్చి నేనేమౌదు నింక తండ్రి!' అంటూ రోదిస్తున్న తీరు కవి నైపుణ్యంలో కరుణను చిందించింది.

**భర్త ప్రేమ లేమి...**

భర్తవల్ల సుఖం పొందలేకపోవడమనేది దీర్ఘకాలంగా కౌసల్య తీరని దు:ఖానికి కారణంగా నిలిచింది. పేగుతెంచుకు పుట్టిన బిడ్డను వనవాసం పంపడం ధర్మమూర్తి అయిన మహారాజుకు తగునా అని నిలదీస్తుంది. శ్రీరామచంద్రుడు అడవులకు పయనమై వెళ్తుండగా 'జీవముండునే? కూలిన చెట్టునైతి' అని కౌసల్య రోదిస్తుంది. తన పెండ్లి అయిన పుటి నుండి శుభంగానీ, సుఖంగానీ అంతవరకు తాను చూడలేదంటూ శ్రీరాముడితో మొరపెట్టుకుంటుంది. తన భర్త ఒక రాజు అయి ఉండగా తాను మాత్రం కళ తప్పి ఉన్నానని బాధపడు తుంది. ఈ సందర్భంలో కవి అద్భుత పోలిక వర్ణించారు 'సూర్యుని ముఖ మొక్కింతైన చూడలేని కమలవనమట్లు' భర్త ప్రేమనే కనలేని బ్రతుకిదేమి!' అని తలరాతను నిందిస్తుంది.

*నాణ్యమౌ ఏడువారాల నగలు కలవు*
*నను గొలువ దాస దాసీజనమ్ము కలదు*
*ఎన్ని ఉండి వీనిననుభవింపలేని*
*భాగ్యహీనను పతిప్రేమబడయలేక*

> **సంతానం కోసం ఎన్నో నోములు, వ్రతాలు నోచింది కౌసల్య. ఎంతో కాలంగా అవన్ని 'ఎడారి నలికిన విత్తనములయ్యె' నని ఒక శిలగా మారి పోయింది. ఎప్పుడైతే శ్రీరాముడు జన్మించాడో, అప్పుడు కౌసల్య పునర్జన్మ ఎత్తినట్లుగా భావించింది. ఒక తల్లిగా సార్థకం కాని స్త్రీ జన్మ ఊహించలేనిది. కౌసల్య సంతానప్రాప్తి కోసం పరితపించిన సన్ని వేశాలు కవి సహజంగానే వర్ణించాడు. తాను సంతానం కోరుకుంటే తన ఇంటిలో సాక్షాత్తు ఆ శ్రీ మహా విష్ణువే అవతరించినట్టుగా భావించింది.**

వ్యాసం

(పుట. 24)

సగటు స్త్రీ భర్తనుండి ఆశించేవి ప్రేమానురాగాలు మాత్రమే. కౌసల్యకు ఏడువారాల నగలు, చుట్టూ దాసదాసీ జనము ఉండి కూడా భాగ్యవిహీనురాలైన స్థితిని కవి తన కవితా ప్రతిభలో ప్రదర్శించారు.

**సపత్నుల హేళన...**

ఏ ఇల్లాలు అయిన ఎంత కష్టమొచ్చినా భరిస్తుంది కాని సవతి పోరును భరింపగరాదు. కాని కౌసల్యకు అనునిత్యం సవతుల నుండి పరుష వాక్యాలు, దూషణలు ఎదురవుతూనే ఉంటాయి. సపత్నులతో సమానమైన గౌరవాన్ని పొందలేని తన చిన్నతనాన్ని శ్రీరాముడి ముందు విన్నవించు కుంటుంది. రాజుకు పెద్ద భార్య అయి ఉండి, ప్రజల దృష్టిలో మహారాణి అయి ఉండి కూడా సపత్నులతో పడుతున్న హింసను కౌసల్య విడమరిచి చెప్పింది.

*సా బహూన్య మనోజ్ఞాని వాక్యాని*
*హృదయచ్ఛిదాం*
*అహంత్రోష్యే సపత్నీ నామ వరాణాం*
*వరా సతీ (అయోధ్య : సర్గ : 20, శ్లో : 39)*

*సవతులిందరిలో నాకు సాటివచ్చు*
*వారెవరు లేరు, నా కంటె*
*వయసులోన*
*చిన్న వారయు వారు నన్నెన్ని మాట*
*లాడి కష్టపెట్టెదరొనే ననగరాదు*
*(పుట.24)*

వాల్మీకి రామాయణంలో కౌసల్య శ్రీరాముడితో తన సపత్నుల వల్ల పడిన పరుష వాక్కుల తీరు స్పష్టంగా చెప్ప బడింది. అనుమాండ్ల భూమయ్య ఈ విషయాన్ని ప్రత్యేకంగా పేర్కొన్నారు. తల్లి అనుభవించిన సపత్నుల వల్ల బాధ, తన సీతకు ఎదురు కాకూడదనే ఉద్దేశంతో ఏకపత్నీ వ్రతుడిగా ప్రతిజ్ఞ చేశాడు. సపత్నుల హేవగింపు వల్ల పొందిన బాధ ఈ కావ్యానికి మూలాధారంగా నిలిచింది. తల్లి హితబోధ ద్వారా శ్రీరాముడిలో సంస్కరణ భావాన్ని పెంపొందింపజేసింది. కౌసల్య తన దు:ఖం రెట్టింపు కావడానికి రెండు కారణాలు గాక మూడింటిని తెలుపుతుంది. ఒకటి పతి ప్రేమ లేకపోవడం, రెండు సపత్నుల పరుషవచనాలు, మూడవది శ్రీరాముడి వనగమనం.

**స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల లేమి...**

యువరాజు పదవిని అలంకరించే కొడుకు ఉండగానే దూషణలకు గురవు తున్నానని కౌసల్య వ్యధ చెందుతుంది. ఇక శ్రీరాముడు అడవులకు వెళ్ళిపోయిన తర్వాత తన పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అని బాధపడుతుంది. తన భర్త తనకు ఏ మాత్రం స్వేచ్ఛ ఇవ్వలేదని రాముడితో మొరపెట్టుకుంటుంది కౌసల్య.

*నేను రాణినే అయి కూడ కాను, మీ జ*
*నకుడు నను నిగ్రహించి ఇంతయును*
*స్వేచ్ఛ*
*నీయలేదు, ఆ తల్లి కైకేయి దాస*
*జనముతో సాటిగానైన సరకుగొనడు*
*(పుట.25)*

అంటూ దశరథుడు ఎంతగా ఆమెను కట్టుదిట్టం చేసేవాడో తెలుపుతుంది. భార్యలకు స్వేచ్ఛ ఇవ్వకపోవడమనేది పితృస్వామ్య వ్యవస్థలో మొదటిది. స్త్రీలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అవసరం లేదనే పురుషాధిపత్య సమాజం అనాదిగా కొనసాగుతూ వస్తున్న విషయం వాల్మీకి రామాయణంలోనే తెలుస్తుంది. తాను ఒక పట్టమహిషి కూడా. రాజు స్వేచ్ఛ ఇవ్వక పోవడాన్ని ధిక్కరిస్తుంది కౌసల్య. తన భర్త చులకన భావంతో చూడడం వల్ల దాసి జనంలో తన రాణితనం చెలామణి కావడం లేదని బాధ పడుతుంది. ఇప్పటికీ దాసీజనం ఈ రీతికి నడుచుకొంటున్న సందర్భంలో కైక కొడుకు రాజయిన తర్వాత భయంతో తనను చూడడానికి రారేమోనని కౌసల్య సందేహిస్తుంది. ఏకాంతాన్ని ఎలా భరించగలనని శ్రీరాము డితో నివేదిస్తుంది. 'కాలమింక నా గళమున బడిన కాలనాగొ ఏమొ!' అని కౌసల్య చింతిస్తుంది.

**కైకేయి పోరు...**

కౌసల్య తన సవతులన్నింటిలో కైక సాధింపును తట్టుకోలేకపోతుంది. ఎల్లప్పుడు పరుష వాక్యాలతో దూషించే కైకేయి తన మీద ఎంతటి క్రోధాగ్నిని చల్లుతుందోననే కౌసల్య వాపోతుంది. కైక వ్యక్తిత్వాన్ని కౌసల్య ఆవేదనలో కవి అత్యంత సహజంగా చిత్రించారు. శ్రీరాముడు అడవులకు వెళ్ళిన తర్వాత కౌసల్యను కైకేయి బ్రతుకనివ్వదనే మాటను కవి ప్రస్తావించడంలో ఆమె ఎంతటి నియంత స్వభావాన్ని కలిగిందో తెలుస్తుంది.

*కాల సర్పమట్లు కడు వంకరగ నడుచు*
*నడత గల కైక కుబుసమ్ము విడిచె ;*
*ఇపుడు*
*విషము చిమ్ముచు నను కాటు*
*వేయునేమొ?*
*కన్నతండ్రి! నాయన! నిన్నె కాటువేసె.*
*(పుట.26)*

అంటూ కైకేయిని కాలసర్పంతో పోల్చుతూ కౌసల్య ఆక్రోశిస్తుంది. కాని తన కష్టాలను, బాధలను కౌసల్య తన ఇష్ట సఖులకు కూడా చెప్పుకోలేదట. కవి అనుమాండ్ల భూమయ్య కౌసల్య స్వభావాన్ని చిత్రిస్తూ 'నా ముఖాన మట్టి విసిరినదని నేను / నట్లె కోపించి మట్టిని ఆమె మీద / విసరలేను. దానిని తీసివేయుమేలు' అని తెలుపుతారు. కౌసల్య వ్యక్తిత్వంలో నీతి, ధర్మం, మంచితనం ప్రదర్శింపజేశారు కవి.

**సవతుల కలత...**

కైకేయి మొదలైన సవతులలో ఎదురయ్యే కలతను ఎదలోనే దాచుకొని ఇంతకాలం సగమైపోయిన కౌసల్య ఈ ముసలితనంలో ఇంకా భరింపలేక పోయింది. పట్టమహిషి అయినందు వల్ల సవతులందరూ తనను అధికంగా బాధిస్తున్నట్లుగా కౌసల్య తెలుపుతుంది. మొదటి భార్యను అయిన నేరం వల్ల నేమో తనను మరింత సవతులు అవమానిస్తున్నట్లు ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

**మాతృ ప్రేమ...**

లక్ష్మణుడు ఆవేశంగా మాట్లాడిన మాటలు న్యాయమనిపించి భావించిన

కౌసల్య శ్రీరాముడి వనవాసానికి అనుమతించదు. తండ్రి లాగా తల్లి కూడా పూజ్యురాలని చెబుతూ అడవులకు వెళ్ళకూడదని శ్రీరాముడిని ఆజ్ఞాపిస్తుంది. ఈ సందర్భంలోనే కవి భూమయ్య కౌసల్యలో పుత్రుడిపై ఉన్న ప్రేమను అనేక విధాలుగా వర్ణిస్తారు. చిన్నప్పటి నుండి కౌసల్యకు కలిగిన బాధనెల్లా రాముడు తన చిట్టి వ్రేళ్ళతో తుడిచిన సన్నివేశాలను గుర్తు చేసారు. ఆ వేదనతోనే రాముడు పసితనంలో ఆడిన ఆట వస్తువులే ఆయన అడవులకు వెళ్ళిన తర్వాత ఆమెకు బ్రతుకు వస్తువులవు తాయని సూచించారు.

క్రూర మృగముల నిలయమ్ము, కోయటన్న
పలుకు దిక్కులేని అడవి పదియునాలు
గేండ్లు పగలు గడచిన రేయియె గడవదు
ఇట్లివియె నాకిరువదెన్మిదేండ్లు తండ్రి!
(పుట.41)

అడవులలో ఎటువంటి పరిస్థితి ఉంటుందో కౌసల్య తలచుకొని బాధపడు తుంది. ఆ రాముడి పసితనం నుండి అల్లారు ముద్దుగా పెంచిన జ్ఞాపకాలను నెమరు వేసుకుంది. రాముడికి మెత్తని గుడ్డ ఒత్తుకొని పోయినా బాధపడే తల్లి మనస్సు అడవుల్లో కఱకురాళ్ళ మీద నిద్రించడం దుర్భరమైందని ఆవేదన చెందుతుంది.

కడుపులో ఉండగా రాముడు తన పాదాలతో తన్నుతుండగా కౌసల్య ఆ పాదాలు ఎంత కందిపోయెనో అని కలత చెందిందట. భూమయ్య వర్ణనలో తల్లి ప్రేమకు తార్కాణంగా కౌసల్యనే నిలుస్తుందని చెప్పవచ్చు. కాని అటువంటి పాదాలు రాయిరప్పలు తాకి రక్తం చిందిస్తాయని తలచుకొని బాధపడుతుంది. 'తండ్రీ! నీ ముద్దు పాదమందారములకు నా యెదను తొడుగుదునయ్య!' అంటూ కౌసల్య పేర్కొంటుంది. తల్లి ప్రేమకు అపూర్వ నిర్వచనం ఈ పద్య పాదం. కవి మాతృ స్పర్శకు గొప్ప చమత్కృతి. తనను కూడా అడవులకు తోలుకొని పొమ్మని కౌసల్య ప్రాధేయపడుతుంది. అడవుల్లోని భయానక పరిస్థితులను రాముడికి తెలియజేస్తుంది.

> **లక్ష్మణుడు** ఆవేశంగా మాట్లాడిన మాటలు న్యాయమని పించి భావించిన కౌసల్య శ్రీరాముడి వనవాసానికి అనుమతిం చదు. తండ్రి లాగా తల్లి కూడా పూజ్యురాలని చెబుతూ అడవులకు వెళ్ళకూడదని శ్రీరాముడిని ఆజ్ఞాపిస్తుంది. ఈ సందర్భంలోనే కవి భూమయ్య కౌసల్యలో పుత్రుడిపై ఉన్న ప్రేమను అనేక విధాలుగా వర్ణిస్తారు.

## లక్ష్మణుడి సేవ...

ఈ కావ్యంలో లక్ష్మణుడి మాటలు కౌసల్య దు:ఖానికి కొంత ఉపశమనాన్ని కలిగిస్తాయి. పుత్ర శోకంతో కుమిలి పోతున్న కౌసల్యను చూసి తన తండ్రిపై ఉగ్రరూపమెత్తుతాడు. రాముడు అడవులకు వెళ్ళకూడదని వారిస్తాడు. తన అన్నకోసం ఏమైనా చేస్తానంటాడు లక్ష్మణుడు. చివరికి తండ్రిని, కైకను, భరతుడిని బంధిస్తానని శపథం చేస్తాడు. రాముడిపై అచంచల భక్తిని ప్రదర్శిస్తాడు. లక్ష్మణుడి ఆక్రోశం కౌసల్య ఆవేదనను కొంత శాంతింపజేసింది. 'అన్నకు ఆపద సంభవింపనే నగ్నిని దూకెద ముందుగనే' అన్న లక్ష్మణుడి మాటల్లో అగ్రజుడి పైగల సోదరప్రేమ, సేవాతత్పరత కనిపిస్తుంది. కవి ఈ పాత్ర కల్పనలో ఉత్సాహాన్ని ప్రదర్శించారు.

## రాముడి ఏకపత్నీ వ్రతం...

'జ్వలిత కౌసల్య'గా రగిలిపోతున్న తల్లి దు:ఖాన్ని నివారింపజేస్తూ శ్రీరామ చంద్రుడు చల్లగా స్వచ్ఛంగా ఏకపత్నీవ్రతం ప్రతిజ్ఞ చేస్తాడు. తల్లి నిరంతర శోకానికి కారణం తండ్రి ప్రేమ లేకపోవడం, తండ్రి బహుభార్యత్వాన్ని స్వీకరించడం అని గ్రహిస్తాడు. తన తల్లి లాగా సీత దు:ఖించకూడదని నిర్ణయించుకొని మాట ఇస్తాడు.

గడిచినట్టి కాలమ్మేదో గడిచిపోయె
తండ్రి తప్పొప్పులివియని తలపలేను
ఏ పరిస్థితులెట్లు రానిమ్ము నాకు
ఒక్క సీతయే ఈ జన్మకున్న భార్య.
(పుట. 57)

అన్న శ్రీరాముడి ప్రతిజ్ఞకు కౌసల్య దు:ఖం తొలిగిపోయినట్లుగా కవి కల్పించారు. 'ఏదో పరిమళామృత పుష్పమింత సాగివచ్చి కౌసల్య శిరస్సుపై విచ్చుకొనియె' అని వర్ణిస్తారు. కౌసల్య తనకు జరిగిన పరాభవం తిరిగి తీసుకొని రాలేనిది. తన కాలం చెల్లిపోయింది. తన సీతకు ఇటువంటి దుర్గతి పట్టకూడదని కౌసల్య మనోభావం. ఈ ప్రతిజ్ఞతో కవి తన కావ్యానికి సద్గతిని ఏర్పరిచారు. ఆచార్య అనుమాండ్ల భూమయ్య స్త్రీత్వంలో కౌసల్యను చిత్రించి రాముడిని ధర్మనిరతి వైపు పయనింపజేశారు. మూర్తిమత్వ నిర్మాణంలో 'జ్వలిత కౌసల్య'ను అపూర్వ సృష్టిగా నిలువరింపజేశారు. సంప్రదాయ స్త్రీవాద ధోరణికి ప్రతినిధిగా ఈ కావ్యాన్ని చిత్రించారు. సమకాలీన సామాజిక వీక్షణంలో అంతర్భాగంగా పౌరాణిక ఐతిహాసిక పాత్రల మనోగతాన్ని ఆవిష్కరించారు.

## ఆధారగ్రంథాలు...


1. కృష్ణకుమారి, నాయని, ఆచార్య, 2013, విమర్శ విద్యా సార్వభౌమం, మనస్వినీ దేవి ప్రచురణలు, హైదరాబాద్.
2. ప్రియదర్శిని, కె.,డా॥, (సం) 2015, ప్రతిభాప్రత్యయి, మనస్వినీ దేవి ప్రచురణలు, హైదరాబాద్.
3. భూమయ్య, అనుమాండ్ల, డా॥, 2004, అంతర్వీక్షణం, మనస్వినీ దేవి ప్రచురణలు, హైదరాబాద్.
4. భూమయ్య, అనుమాండ్ల, డా॥, 2011, (నాల్గవ ముద్రణ), జ్వలిత కౌసల్య, మనస్వినీ దేవి ప్రచురణలు, హైదరాబాద్.
5. రామారావు, చేకూరి, ఆచార్య (సం) 2003, అంతర్వీక్షణ సార్వభౌమం, మనస్వినీ దేవి ప్రచురణలు, హైదరాబాద్.

కవిత



# హృదయేశ్వరి

కొరుప్రోలు హరనాథ్, 97035 42598



ఒక హృది పొంగింది
ఒక మది గతి తప్పింది
మనసు పొరల్లో చెలరేగే
కల్లోలానికి
కళ్ళెం వేసేది
ఆ చెలి ఒక్కతే...

ఆ చెలిని వర్ణించ
ఈ కవితాక్షార తోరణ
మాలలు సరిపోవేమో...

అసలవి కురులా
మరులుగొలిపే
విరుల తరుల
పసిడి తీగలు
వెన్నెల్లో మిలమిల మెరిసే
మిణుగురులు...

అనిపిస్తుంది
ఆ చెలి కళాఖండాన్ని చెక్కాలని
ఆ పలు వరుసలు
కలువ కొలనులో
తామర పువ్వుల
వెలుగు జిలుగులు...

ఆ పసిడి ఛాయ మేను
పరవశాన్ని గొలిపే
సుందర సౌందర్యం
మలుపులు తిరిగిన
ఆ కనురెప్పలు...

మేఘాల మాటు నుంచి
సుతారంగ కదిలొస్తున్న
మబ్బుల తునకలు
ఆ పెదవులు
రసరమ్యామృత
తేనెల ధారలు....

అందుకొనుము చెలీ
ఈ మేఘ సందేశము
కాళిదాసుని కాకున్నా
ఒక కవి హృదయం నుంచి
విప్పారిన పొద్దు తిరుగుడు
పువ్వులా అక్షర కిరణాలు
అందుకొనుము చెలీ
అలంకరించుకో....

సాహితీ శిఖరం

# కవుల చైతన్యానికి ప్రతీక...

# జేస్లావ్ మిలోస్జ్



1980 సాహిత్య నోబెల్ విజేత....

జేస్లావ్ మిలోస్జ్ ఒక పోలిష్ అమెరికన్ కవి, గద్య రచయిత, అనువాదకుడు మరియు దౌత్యవేత్త. జేస్లావ్ మిలోస్జ్ ఆ సందర్భంలో స్వీడిష్ అకాడమీ మిలోస్జ్‌ను "తీవ్రమైన సంఘర్షణల ప్రపంచంలో మనిషి యొక్క బహిర్గత స్థితిని వినిపించే "రచయిత" అని పేర్కొంది. మిలోస్జ్ రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో జర్మన్ వార్సా ఆక్రమణ నుండి బయటపడి, యుద్ధానంతర కాలంలో పోలిష్ ప్రభుత్వానికి సాంస్కృతిక అనుబంధంగా మారాడు. కమ్యూనిస్ట్ అధికారులు బెదిరించినప్పుడు, అతను ఫ్రాన్స్‌కు వెళ్ళిపోయాడు. చివరికి యునైటెడ్ స్టేట్స్‌లో ప్రవాసాన్ని ఎంచుకున్నాడు, అక్కడ అతను బర్కిలీలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ అయ్యాడు. అతని కవిత్వం ముఖ్యంగా అతని యుద్ధకాల అనుభవం గురించి మరియు ఒక గద్య పుస్తకం, ది క్యాప్టివ్ మైండ్‌లో స్టాలినిజం యొక్క అంచనా, అతనికి ప్రముఖ వలస కళాకారుడిగా మరియు మేధావిగా పేరు తెచ్చింది. మిలోస్జ్ నైతికత, రాజకీయాలు, చరిత్ర మరియు విశ్వాసం యొక్క ప్రశ్నలను పరిష్కరించాడు. అనువాదకుడిగా, అతను పాశ్చాత్య రచనలను పోలిష్ ప్రేక్షకులకు పరిచయం చేసాడు. పండితునిగా, సంపాదకుడిగా, అతను పాశ్చాత్య దేశాలలో స్లావిక్ సాహిత్యంపై ఎక్కువ అవగాహన కల్పించాడు. 9 అక్టోబర్ 1980న, స్వీడిష్ అకాడమీ మిలోస్జ్ సాహిత్యంలో నోబెల్ బహుమతిని గెలుచుకున్నట్లు ప్రకటించింది. ఈ అవార్డు అతడిని ప్రపంచ ఖ్యాతిని తెచ్చిపెట్టింది. తన నోబెల్ ఉపన్యాసంలో, మిలోస్జ్ కవి పాత్ర గురించి తన అభిప్రాయాన్ని వివరించాడు, 20వ శతాబ్దపు విషాదాల గురించి విచారించాడు. 1981లో, మిలోస్జ్ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో కవిత్వానికి సంబంధించిన నార్టన్ ప్రొఫెసర్‌గా నియమితుడయ్యాడు, అక్కడ అతను చార్లెస్ ఎలియట్ నార్టన్ ఉపన్యాసాలను అందించడానికి ఆహ్వానించబడ్డాడు. అతను నోబెల్ గ్రహీత కావడానికి ముందు, అన్యాయంగా ఖైదు చేయబడిన లేదా హింసించబడిన రచయితల దృష్టిని ఆకర్షించడానికి అతను అవకాశాన్ని ఉపయోగించుకున్నాడు. ఈ ఉపన్యాసాలు ది విట్‌నెస్ ఆఫ్ పొయెట్రీ (1983)గా ప్రచురించబడ్డాయి. మిలోస్జ్ హైమ్ ఆఫ్ ది పర్ల్ (1981), బెల్స్ ఇన్ వింటర్ (1984) మరియు అన్ ఎటైనబుల్ ఎర్త్ (1986) కవితా సంకలనాలు మరియు బిగినింగ్ విత్ మై స్ట్రీట్స్ (1986) అనే వ్యాస సంకలనంతో సహా పారిస్‌లోని తన దీర్ఘకాల ప్రచురణకర్త ద్వారా పోలిష్‌లో రచనలను ప్రచురించడం కొనసాగించాడు. మిలోస్జ్ 2004లో పోలాండ్‌లోని క్రాకోవ్‌లో మరణించాడు. పోలాండ్‌లోని విశిష్ట పోల్స్‌కు గౌరవప్రదమైన ప్రదేశంగా పేరుగాంచిన స్కాల్కా అనే చర్చిలో అతని అంత్యక్రియలు జరిగాయి.



కథ

# ఉపనయనం

హాస్యోక్తులతో మనసు ఉల్లాసపరిచే కథ...

అసామాన్యుడు

ఉమాపతి ఒక తెలుగు ఉపాధ్యాయుడు. అతను ఆంగ్ల పదాలను మక్కికి మక్కి అనువాదం చేసి మాట్లాడుతుంటాడు. ఉమాపతి సెల్ మోగుతోంది. అతను అది ఎక్కడ వుందో కనపడక వెతుకుతూ "నా చరవాణి ఎక్కడ? చరవాణీ ఎక్కడున్నావే?" అని గట్టిగఅరుస్తూ వుంటే,

కిచన్‌లో కిచిడీ చేస్తున్న భార్య కనకం కోపంగా "చరవాణా అదెవత్తీ?" అంటూనడ్డి మీద చేతులు పెట్టుకొని చేతిలో గరిటతో సహా వచ్చింది.

"అదేనే కనకం! నా సెల్ ఫోను".

"అలా అఘోరించ వచ్చుగా!" అని, "మీ చొక్కా జేబులో వుంది" అని చెప్పి వెళ్లి పోయింది.

వెంటనే తెచ్చుకొని ఆకుపచ్చ మీట నొక్కి... ఎవరూ, అన్నాడు

"నేను బావా! రమాపతిని. మా అబ్బాయి గణపతికి ఈ నెల పదో తేదీన ఉపనయనం చేస్తున్నాము. మీరూ, చెల్లి తప్పక రావాలి. ఏ ట్రైన్‌కి వస్తారో చెప్తే స్టేషన్‌కి కారు పంపిస్తాను".

"సరే వస్తాం లే బావా!" అని సెల్ పెట్టేసి భార్యను "కనకం! యిటు రావోయ్" అని పిలిచాడు.

"మీ అన్న కొడుకు ఉపనయనం అట .తప్పక రమ్మన్నాడు.

అంచేత 'దరిద్ర రథం'లో రెండు శయనాలు పుస్తకం చెయ్యమని సంతోషకర ప్రయాణాల వాడికి నీ చరవాణి లో చేప్పేయ్" అన్నాడు.

కనకం నెత్తి కొట్టుకుంటూ "మీ భార్యనైన పాపానికి 'దరిద్ర రథం' అంటే 'గరీబ్ రథ్' అనీ 'శయనాలు' అంటే 'బెర్త్స్' అనీ అర్థ మయింది. ఆ పుస్తకం చెయ్యడమేమిటో? ఆ సంతోష ప్రయాణాల వాడెవడో? మీరే వివరించండి".

"అదేనే! మన వెనక వీధిలో ఆనంద్ ట్రావెల్స్ వాడికి బుక్ చెయ్యమని చెప్పు".

"అధికార భాషా చైర్మన్ గారూ! మీకో దండం" అని రెండు చేతులూ శబ్దం వచ్చేలా కొట్టింది కనకం. దోవకి పూరీ కూరా చేసుకొని బయల్దేరారు. ట్రైన్ ఎక్కి సర్దుకొని కూచున్న తర్వాత, "కనకం! అసలే నీది ద్విగవాక్ష శయనం, మెళ్ళో నగలూ గట్రా జాగ్రత్త" అన్నాడు ఉమాపతి.

"ఈ ద్విగవాక్ష శయనం ఏమిటండీ ?" అంటే "సైడ్ లోయర్ బెర్త్" వివరించాడు.

కనకం నిట్టూర్చి "నా రవ్వల గాజులూ, చంద్ర హారం పక్కింటి పంకజం దగ్గర జాగ్రత్త చెయ్యమని ఇచ్చి వచ్చాను, మిగతావి నా బ్యాగులో జాగ్రత్తగా వున్నాయి లెండి" అంది.

"అయ్యో! ఏ లెక్కా పత్రం లేకుండా వాళ్ళింట్లో ఎందుకు పెట్టావే?

రేప్పొద్దున ఆవిడ నా దగ్గర పెట్టలేదంటే ఏమి చేస్తావే?

అసలే ఆమె మొగుడు మన్మథరావు పానబోతూ, పరిభ్రమణ బోతూనూ" అన్నాడు.

"పానబోతూ, పరిభ్రమణ బోతూ ఏమిటండీ?"

అంటే "తాగుబోతూ, తిరుగు బోతూ" అని వివరించాడు ఉమాపతి.

"మహానుభావా! ఇంగ్లీషు పదాలకే అనుకున్నా తెలుగు పదాలకు కూడా పర్యాయ పదాలు కనిపెడుతున్నారా?" అని తల బాదుకుంది.

"అది సరే కానీ! మనకు ఆ తెలుగు ఖాతా కార్యాలయంలో తాళపేటిక ఒకటి విలపించింది కదా! అందులో పెట్టి రావలిసింది" అన్నాడు.

కాసేపు ఆలోచించి "ఓహో! ఆంధ్రా బ్యాంక్ లో లాకర్ ఒకటి ఏడిచింది కదా!" అని అర్థం చేసుకొని "మీరే పెట్టి వచ్చి ఉండవచ్చు కదా!" అని దబాయించే సరికి నోరు మూసుకొని పడుకున్నాడు.

పొద్దున్నే హైదరాబాద్ చేరారు.

"మీ అన్న చతుశ్చక్ర వాహనం (కారు) పంపిస్తానన్నాడు. పంప లేదు చూశావా?" అని సరే "ఈ త్రిశ్చక్ర వాహనంలో వెడదాం" అంటూ (ఆటో) మాట్లాడాడు.

ఫంక్షన్ హాల్ దగ్గర దిగి లోపలికి వెళ్లి

"దరిద్ర రథంలో వస్తానని దూరవాణి లో చెప్పాను కదా!



**ఉమాపతి** తయారై "అరే నా ఉపలో చానాలు (కళ్ళజోడు) ఎక్కడ?" అని కళ్ళజోడు కోసం వెతికాడు. కనపడ లేదు. అలాగే తడుముకుంటూ మండపం లోకి వెళ్ళాడు. అంతా మసక మసక గావుంది ఎవరూ సరిగ్గా కనపడడం లేదు. భార్య కోసం వెతుకుతు న్నాడు. 'కనకం ఎక్కడుంది?' అనుకుంటుంటే, అక్కడే కనకాంబరం చీర కనపడింది.

చతుశ్చక్ర వాహనం పంపలేదేమిటీ?" అని బావ మరిదిని నిలదీశాడు.

రమాపతి తెల్లబోయి చూస్తూ వుంటే కనకం వివరించింది.

"సారీ బావా! మా అబ్బాయి కారు తీసుకొని వెళ్ళాడు. సమయానికి కారు యింట్లో లేదు" అన్నాడు రమాపతి.

ఈ లోపల తమకిచ్చిన గదిలో సామాను సర్దేసి కనకం త్వరగా స్నానం చేసి కనకాంబరం పట్టుచీర కట్టుకొని ముస్తాబై, నేను పెళ్లి మండపంలోకి వెళ్తు న్నాను" అంటూ, త్వరగా తయారై వెళ్ళిపోయింది.

ఉమాపతి తయారై "అరే నా ఉపలో చానాలు (కళ్ళజోడు) ఎక్కడ?" అని కళ్ళజోడు కోసం వెతికాడు. కనపడ లేదు. అలాగే తడుముకుంటూ మండపం లోకి వెళ్ళాడు. అంతా మసక మసక గావుంది ఎవరూ సరిగ్గా కనపడడం లేదు. భార్య కోసం వెతుకుతున్నాడు. 'కనకం ఎక్కడుంది?' అనుకుంటూంటే, అక్కడే కనకాంబరం చీర కనపడింది. 'అదిగో కనకం ఇక్కడే వుంది' అనుకుంటూ వెళ్లి కొంగు పట్టుకొని లాగాడు. ఆవిడ తిరిగి చూసి ఉమాపతి గూబ గుయ్యిమని పించింది.

"ఏమిటీ తిక్క తిక్కగా వుందా?" అని అంటే ఏమైందంటే నా ఉపనయనాలు కనపడ లేదు" అని ఉమాపతి ఏదో చెప్పబోతూంటే

ఆవిడ భర్త వచ్చి కాలర్ పట్టుకొని " ఉపనయనానికి వచ్చి ఉపనయనాలు కనబడ లేదంటా వేమిటి?" అంటూ కొట్టబోతుంటే,

కనకం చూసి పరిగెత్తు కొచ్చి ఆపి "అన్నయ్యగారూ! ఆయన మా ఆయనండీ! క్షమించండి. ఏదో పొరబాటు అయింది" అంటూ "ఏమిటండీ! ఇదీ" అంటే,

"కనకం! నీవు కనకాంబరం చీర కదా కట్టుకుంది. చీర ఎప్పుడు మార్చావు? నా ఉపనయనాలు కనపడక నేను చస్తుంటే?" అన్నాడు.

"అబ్బా! ఫంక్షన్‌లో గంట కొక చీర మారుస్తాము. ఇంతకీ ఉపనయనాలేమిటి?" అంది. "నా కళ్ళజోడు కనపడ లేదు అన్నాడు ఉమా పతి.

కనకం నెత్తి బాదుకొని "నిన్నరాత్రి రైల్లో నా బ్యాగులో పెట్టారు కదా!" అని తీసి కళ్ళకు తగిలించి, అందరికీ సారీ లు చెప్పి వెళ్ళింది.

ఊరికి బయల్దేరి వెళ్ళేటప్పుడు, రమాపతి బావ గారిని ఆటపట్టిస్తూ "బావా! ఈ సారి వచ్చేటప్పుడుఉపనయనాలు దగ్గరుంచుకో! అంటే స్పేర్ కళ్ళజోడు అన్నమాట అన్నాడు.

మీలో చాలామందికి తెలియని తెలుగు పదాలు పరిచయం చేశాను అనుకుంటున్నాను.

నవ్వుల ఉప ఉపనయనాలు.

# సౌందర్య కోన



మహెజబీన్, 98665 87919

**Kashmiri Poet:**
Ashraf Ravi / అష్రాఫ్ రావి

**Hindi:**
Dr.Mudaseer Ahamad Bhatt / డా॥ ముదసిర్ అహమద్ భట్

**English:**
Mahammed Shafi Radhar / మహమ్మద్ షఫీ రాధార్

**Telugu:**
Mrs. Mahe Jabeen / మహెజబీన్

*(The poem is translated in Telugu for Akashvani (All India Radio), Hyderabad on the occasion of National Symposium of Poetry 2022 and broadcast on 26 January as part of Republic Day celebrations).*

ఈడెన్ వనంలో వికసించిన సౌందర్య సుమం ఈ కోన. అనురాగ నగరం లో నవ వధువు ఇది. దేదీప్యమాన వెలుగు ఇది. శిశిరమైన సరే! ఆకు రాల్చని సైప్రస్ వృక్ష ఛాయ ఇది. అరబ్ నేల మీద ప్రవహించే పవిత్ర జమ్ జమ్ నీళ్ళలా-ఎడారి ఒయాసిస్సు ఇది. ఆడమ్ పుత్రిక ఇది. సౌందర్య కోన ఇది!

పరిమళ భరిత దేహ రూపం! అడవి గుండా నడిచే ఘజల్ గానం. అస్తమించే సంధ్యా కాంతిలో కనిపించే నెలవంక. చీకటిలో వెలుతురు దివిటీ లా చంద్రపక్ష వెన్నెల. ఆడమ్ పుత్రిక ఇది. సౌందర్య కోన ఇది!

శిశిర అనంతర వసంతానికి దూరాన్ని తగ్గిస్తుంది ఫల పుష్పాల దృశ్యం. ఆకుపచ్చ గడ్డి మైదానంలో నీలి రంగు కుసుమం వికసించిందని, వసంత ఆగమన పవనం చెప్పి వెళ్తుంది. హేమంత సమయాల వెచ్చదనం ఈ కోన. గ్రీష్మంలో కురిసే తొలకరి జల్లు ఇది. ఆడమ్ పుత్రిక ఇది. సౌందర్య కోన ఇది!

సీతలోని అమాయకత్వం ఈ కోన. రాముని మాట లాంటిది ఈ కోన. ఇది హబ్బా ఖాతూన్, మీరా, పార్వతిల నిలయం. ఆకాశాన్ని అందుకుంది ఈ కోన! కానీ, రావణుని మోహతృష్ణలా ఎవరో మా మీద కన్నేశారు, అమృతాన్ని మాకు కాకుండా చేస్తున్నారు. అందుకే- ఉన్నతమైన ఈ కోన అవరోహణమై కిందికి జారింది. తన త్యాగమే అమరత్వాన్ని ఇస్తుంది ఈ కోనకు.

ధరిత్రి శోభిత వాణిజ్య కోన ఇది. కోటలో మహారాణిలా! ఇది లల్లేశ్వరి, ఫూలన్, మదర్ థెరిసా. ఇది హెలెన్! శత వర్ష యుద్ధ సంఘర్షణా గాథ ఇది! రాజ్యాల సంరక్షిత ఇది. కానీ ఇప్పుడిది కృషీవలుని వ్యథ. మహాసాగరాలలోతు ఇది. పర్వత ఎత్తు ఇది. ఆడమ్ పుత్రిక ఇది. సౌందర్య కోన ఇది!

మనిషి పుట్టుకకు ఆదిమ గర్భం ఈ కోన. కూరలో ఉప్పులా - తీపిలో చక్కెరలా ఈ కోన. మానవీయతకు ప్రమాణ పత్రం ఇది.

ఏమైనా గాని, ఓ మాట చెప్పాలి! శిరస్సుకు మకుటాయమానం ఈ కోన. స్నేహానికి చల్లని నీడై ఓదార్పు నిస్తుంది. నడిచే దారుల్లో ఊదా రంగు పూలు వెదజల్లుతుంది. తల్లి తండ్రి అయి లాలించి, పిల్లల్ని ప్రేమిస్తుంది. ఆడమ్ పుత్రిక ఇది. సౌందర్య కోన ఇది!

ఈ కోన మీద ఎనలేని ప్రేమతో కవి అష్రాఫ్ రావి పాడే పాట ఇక్కడ ప్రతిధ్వనిస్తుంది. 'ఇది సుఖాల కోన, దుఃఖ హరిణి, నయన జ్యోతి, ఎన్నో ప్రశ్నల, అనేక మాటల సమాధానం ఈ కోన. ఈ కోన లేకపోతే బ్రతుకే లేదు. ఈ కోన పుట్టాకే భూమి విలసిల్లింది. ఇది జగత్ జనని. ప్రకృతికి స్వీయ రూపం. ఈ కోనకు ఋణపడి ఉన్నాం' అంటూ కవి అష్రాఫ్ రావి గానం భూలోక స్వర్గమైన ఈ కోనలో మారుమోగుతోంది. అందుకే - ఆడమ్ పుత్రిక ఇది. సౌందర్య కోన ఇది!

కవిత

# జీవిత పుస్తకం



రమేశ్ నల్లగొండ, 83094 52179

నూరు పుటల జీవిత పుస్తకం
ముఖ చిత్రం బహుసుందరం
ఆనందమయ, ఆశావహ
ముందుమాట సుమధురం
అల్లరి, చిలిపిదనపు పసిడి ప్రాయపు
వర్ణమయ కాగితాల కవర్ పేజీలు
ఎంతో అందమైనవి, అద్భుతమైనవి

ఊహకు అందని కష్టాలూ కన్నీళ్లు
మనసులో సంఘర్షణలూ, సంవేదనలు
సంస్కృత పద ప్రయోగ సమాసాల వాక్యాల
మహాకవుల దీర్ఘ కవిత్వాలు మరి
అర్థం కావడం గగనమే అవి
అయినా మాటల మణి దీవుల్లో అన్వేషిస్తూ ఉంటుంటే
చివరాఖరికి దొరుకుతుంది పదరాశుల జాడ కాబోలు
సమకాలీన సంఘటనల సస్పెన్స్ థ్రిల్లర్ క్రైమ్ కథల
పుటలుపాడే వాయులీనం ఆశ్చర్యకర, ఆందోళనల
రహస్య స్వరాలనే వినిపిస్తుంటుంది

సుదూర ప్రాంతాల
అబ్బురపరచే ఆచార వ్యవహారాల
ప్రకృతి వింతలు విశేషాల రాతల సమాహారం
మనిషిని పులకింతల డోలలూపుతూనే ఉంటుంది
అనువాద కథలన్నీ సమజాగాని కొండమలుపుల రూటు
సరికిరాని అనుబంధాల ఎడబాటు
మనుజుని నిత్య అలజడులు
అతని కనుల కన్నీటి జడులన్నీ
శూన్యంగా ఎదురు చూసే పదకేళి గడులు
అరిషడ్వర్గాల సశేష కథాకథనాలు...
లోతైన సుడిగుండాలు

ఏ ఆగాధాలలో ఆద్మి పడి అంచులదాక
మునిగిపోతున్నడో కచ్చితంగా చెప్పటం అసాధ్యం
నల్లని చింపుల చివరి పేజీలు చిత్రమైనవి
తెల్లని అక్షరాల వార్ధక్య వాక్యాల తీగల ముదిమి
వీణియ నిశ్శబ్దంగా నిరుత్సాహంగా జరామయ గాథలను
భయంకర అంపశయ్య బాధలను మీటి
మలిసందె రాగాలను శృతి తప్పి మతి
తప్పి పాడుతుంటుంది

చరమ మజిలీ అనుభవాల సరిగమలను
మనం తప్పకుండా వినడమెంతో అవసరం

వాక్యాలు.. పేరాలు...కథలు, కథనాలు...
కొన్ని ఎదలోతులను కొలుస్తు ఉంటాయి
కొన్ని పాశ్చాత్తాపంగా చూస్తూ ఉంటాయి
కొన్ని ఆశాభావాన్ని, ఆత్మ విశ్వాసాన్ని
ఆకాశమంత మానవత్వాన్ని
అనంత ప్రేమతత్వాన్ని..... ప్రభోధిస్తుంటాయి

బాపు బొమ్మల, నూరు కమ్మల బ్రతుకు గ్రంథం
అపురూపం, అద్వితీయం ఎవరిది వారికే
అర్థమయ్యే ఈ గ్రంథమెంతో ఘనం
అపుడపుడు ముందు మాటలు,
ముఖ్యమైన స్టాంజాలను,
పేజీలను తప్పక చేసుకోవాలి మననం
ఈ జీవితకాలంలోఎన్ని పేజీలు
తిరుగేయగలమో మనం
జీవించడం ఎలాగో అర్థమయ్యే లోపే
జీవితానికి అల్విదా ఆఖరు పుట ఉందేమో బహుశా
అందుకే
క్షణక్షణం... అక్షరమక్షరం
పదంపదం, వాక్యం వాక్యం పేజీ పేజీ
ఆస్వాదించడంలో ఉండరాదు రాజీ
కాలం కథ మనకు తెల్పరాదు
నిముషమైనా వృథా కారాదు
కనుమూసే కడదాకా.. మనకు లేదు విరామం



# పడమటి గాలి, తూర్పుగాలి

స్త్రీ, పురుష సంబంధాలలోని ఒడిదుడుకులు చూపిన ఈ పక్షం పుస్తక పరిచయం



కూర చిదంబరం
86393 38675

హిందూ సాంప్రదాయాలు అతి ప్రాచీనమైనవి. కాలం అనే లిత్మస్ పరీక్ష నెదుర్కొని, మంచీ చెడుల గీటురాయి మీద పరీక్షించబడి, ఏది ఆచరణీయమో, ఏవి వర్జితమో నిర్ణయించబడ్డాయి. అట్టి సాంప్రదాయాల్లో వివాహబంధం ఒకటి. జీవితాంతమే గాక, ఏడు జన్మల వరకు నిలిచి ఉండే అనుబంధం ఇది.

పాశ్చాత్య సంస్కృతి అనుకరణ, తొందరపాటు నిర్ణయాల వల్ల దేశంలోని యువత పెడత్రోవన పడుతున్నది. మన కట్టుబాటలను వీరు క్షణికావేశం వల్ల సరియైన నిర్ణయం తీసుకొనక చులకన చేసి నష్టపోతున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకోవద్దని ముందుగానే ఈ నవల ద్వారా రచయిత్రి లలితావర్మ హెచ్చరిస్తున్నారు.




లివ్-ఇన్-రిలేషన్‌షిప్ (సహజీవనం) అన్నది మన దేశానికి అంటిన జాడ్యం. ఈ రిలేషన్‌షిప్‌లో యువతీయువకు లిద్దరు పెళ్ళవకుండానే 'సహజీవనం' సాగిస్తారు. ఇష్టం లేని పక్షంలో విడిపోతారు. అయితే, 'సహజీవనం'లో ఎక్కువ వ్యధకు గురి అయ్యేది యువతి. సహజీవనం వల్ల సంతానం కలిగితే, స్త్రీ ఎక్కువ నష్టపోతుంది అని రచయిత్రి లలితావర్మ తన నవల 'కలిసుందామా'...? లో హెచ్చరిస్తున్నారు.

మధులత (మధు) ఉన్నత విద్యావంతురాలు. ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో మంచి జీతం, ఉద్యోగం. మధు తల్లి వనజ. ప్రేమ వివాహంతో పెద్దలకు దూరంగా ఉండాల్సివస్తుంది. మధు, భరత్‌లు ఆమె సంతానం. కాలక్రమేణా వనజకు భర్త క్రూరత్వం, శాడిజం తెలిసి వచ్చి భర్తతో విడిపోయి పిల్లలను పెంచి పెద్దచేస్తుంది. ఒకసారి దెబ్బతిన్న ఆమె జీవితం వల్ల పిల్లలు ఆచితూచి అడుగేయాలని కోరుకునే మధ్యతరగతి మహిళ. వనజ మరియు మధు తమ్ముడు (మధుకు) సంబంధాలు చూస్తుంటారు.

ముక్కు మొకం ఎరగని వ్యక్తిని క్షణంపాటు పెళ్ళిచూపులు చూసి, జీవితాంతం పెళ్ళి అనే చట్రంలో ఇరుక్కుపోవటం అంత తెలివైన నిర్ణయం కాదని, భావ సారూప్యత ఉన్న తన సహోద్యోగి అశ్విన్ అనే యువకునితో 'సహజీవనం' సాగించాలని నిర్ణయించు కున్న విషయం తల్లికి చెబుతుంది.

మధు అశ్విన్‌లు సహజీవనం గడుపుతూ, ఒకనాటి క్షణికోద్రేకం వల్ల ఒక్కటవుతారు. ఫలితంగా మధు గర్భం దాలుస్తుంది.

స్వభావరీత్యా మధు దుందుడుకు. ఓర్మి లేకపోవటంవల్ల తొందరపాటు నిర్ణయాలు తీసుకునే యువతి. చిన్నచిన్న పొరపొచ్చాల వల్ల క్రమక్రమంగా సహజీవనం పట్ల ఇద్దరికీ మొహం మొత్తుతుంది. అనుమానాలు, అపోహలు వారి సహజీవనంలో చోటు చేసుకుం టాయి. అశ్విన్‌ను విడిచి వేరుగా 'పేయింగ్ గెస్ట్'గా ఉంటుంది. వనజ భరత్‌లు మధు పెద్దమ్మ కూతురు లాయరైన రేవతి మధును 'కన్విన్స్' చేసే ప్రయత్నం చేస్తారు. టిపికల్ మెంటాలిటీ గల మధు ఎవరి మాటా వినదు. పైపెచ్చు

పుస్తక పరిచయం

బుద్ధి గడపబోతోన్న వారినే ఈసడించు కుంటుంది. స్థానచలనం, బుద్ధి భ్రమణం తట్టుకోలేని ఆమెకు 'అబార్షన్' అవుతుంది. మనసు ఏది చెప్తే అదే! బుద్ధితో ఆలోచించటం చేతకాని మధులో అంతర్మథనం మొదలవుతుంది. నిదానస్థుడైన అశ్విన్, భరత్, వనజల సాయంతో మధుకు దగ్గరయ్యే ప్రయత్నం చేస్తుంటాడు. తాళి కట్టలేదు... అంతేకాని మధు తన సర్వస్వం అన్న భావనతో మధు మనసులో వెనుదిరిగి చూసుకునే అవకాశం కల్పిస్తాడు. 'మధుది కాస్త టిపికల్ మెంటాలిటీ. అంతేకాని ఈ రోజుల్లో కొందరు ఆడపిల్లల్లా విచ్చలవిడితనం లేదు. హద్దులు మీరదు. పబ్బులు గిట్టవు' అనుకున్న అశ్విన్ ఆమెలో మార్పులు తేవటంలో సఫలీకృతుడవుతాడు.

మనం సాంప్రదాయాల గొప్పతనం 'ఆన్‌సైట్'లో అమెరికా వెళ్ళిన మధుకు అక్కడ 'సితార రిచర్డ్' జంటను చూసాక

**చిన్న చిన్న పొరపొచ్చాల వల్ల క్రమక్రమంగా సహజీవనం పట్ల ఇద్దరికీ మొహం మొత్తుతుంది. అనుమానాలు, అపోహలు వారి సహజీవనంలో చోటు చేసుకుంటాయి. అశ్విన్‌ను విడిచి వేరుగా 'పేయింగ్ గెస్ట్'గా ఉంటుంది. వనజ భరత్‌లు మధు పెద్దమ్మ కూతురు లాయరైన రేవతి మధును 'కన్విన్స్' చేసే ప్రయత్నం చేస్తారు. టిపికల్ మెంటాలిటీ గల మధు ఎవరి మాటా వినదు.**

తెలుస్తుంది. సముద్ర మథనంలో ముందు హాలాహలం పుట్టిన తర్వాతే అమృతం ఉద్భవించినట్లు, తులనాత్మకంగా అమెరికా జీవితాల్ని గమనించాక కాని, ఆమెకు మన సాంప్రదాయాలు, వాటి గొప్పతనం తెలిసివస్తుంది. 'సహజీవనపు' ఆలోచనలు అధిగమించి, సాంప్రదాయ బద్ధంగా, మధు అశ్విన్‌లు పెళ్ళాడటంతో నవల ముగుస్తుంది.

కథ సామాన్యమైనదే! అయినా, కథనంతో రచయిత్రి అతి సమర్థవం తంగా విడువక చదివించేలా మలిచారు.

'ఆవేశంలో బంధాలు తెంచుకుంటే ఆపదలో ఎవరూ ఉండరు' (పేజి 112). 'అనాదిగా ఆడపిల్లల రక్షణ కోసం ఏర్పడిన ఆచారాలను దురాచారాలుగా మార్చి ఎందరో ఛాందసులు ఆడపిల్లలను బలి తీసుకుంటున్నారు' (పేజి. 128), 'లివ్-ఇన్-రిలేషన్‌షిప్' విషయంలో చట్టం ఏమీ చేయలేదు. (పే. 31) 'తోడు' అంటే మానసికానందాలను యథేచ్ఛంగా అనుభవించటం వరకే. కష్టం కలిగినప్పుడు ఎవరిదారి వారిదే (పే. 23) లాంటి ఆలోచనాపూరితమైన వాక్యాలు రచయిత్రి లోతైన నిశితమైన లోచూపుకు అద్దం పడతాయి.

కవిత

# ఆల్చిప్పలు

క్రాంతి దారులు
అద్భుత ఆదర్శాలు
నేడుగాలికి

అణుసమరం
జనమరణగీతం
అసురహస్తం

ప్రజాపాలన
వెతకాలి భూగోళం
ఆశ ఆవిరి

పైసలప్రేమ
దొరకదోయిభామ
పెళ్ళి ఓ కల

క్షణికానందం
వికృతి ప్రేమికులు
రాక్షస దారి

పిల్లగాలులు
పచ్చని తివాచీలు
కనుమరుగు

తోపులుమాయం
తటాకాలకుతూట్లు
తెలివిలేమి



రేడియమ్, 92915 27757

కవిత

# వాళ్ళు వెళ్ళిపోతున్నారు

కొండి మల్లారెడ్డి

పగలూ... రాత్రుల్నీ..
రథానికి రెండుచక్రాల్లా జోడించి
లోతట్టు ప్రాంతాల్లోంచి
కాలాల్ని నెట్టుకొస్తున్నవాళ్ళు

మాట మాత్రంగానైనా
చెప్పకుండా వెనుదిరిగి చూసే
తీరికేలేదన్నట్టు వెళ్ళిపోతున్నారు

దిగాల్సిన చోటు
సమీపించక మునుపే
ముల్లెమూట సర్దుకొని ఆదరబాదరగా
నిష్క్రమిస్తున్న ప్రయాణికుల్లా
అనివార్యంగానే వాళ్ళు వెళ్ళిపోతున్నారు

ఆవుపులి కథలోలా ఇచ్చిన మాటకోసం
లేగదూడని వదలి పులిదాపుకు
వెళ్ళడానికి మనసొప్పని తల్లి ఆవు తండ్లాటలా
తటపటాయిస్తూనే వెళ్ళిపోతున్నారు

తుఫానుగాలుల్లో
పడవను వొడుపుగా వొడ్డుకు చేర్చి
తమబాధ్యత తీరిపోయిందన్నంత ధీమాగా
వీడ్కోలు పలుకుతున్న నావికుల్లా
వాళ్ళు వెళ్ళిపోతున్నారు

మునుమెల్లిన కూలీతల్లి
వొడ్డుమీద పడుకోబెట్టిన పసికూనకు
పాలివ్వడానికి వెళ్తున్నంత ఆత్రంగా
వడివడిగానే వాళ్ళు వెళ్ళిపోతున్నారు

ఉపన్యాసం పూర్తవ్వకమునుపే
ఎవరో అడ్డంకులు కల్పించినట్టు
అర్ధాంతరంగా వేదిక దిగివెళ్ళిపోతున్న వక్తల్లా
విసురుగా తలవంచుకొని వాళ్ళు వెళ్ళిపోతున్నారు

సెలవులుపూర్తయ్యాక
ఊళ్ళను వదిలిన పిల్లలు
స్కూళ్ళకు వెళుతున్నంత బేలగా
వెనుదిరిగి చూడకుండానే వాళ్ళు వెళ్ళిపోతున్నారు

ఆకురాలుతున్న రుతువుల్లా
అడవుల్ని ఖాళీ చేసి వెళ్ళిపోతున్నవాళ్ళని
ఎవరైనా అనునయించి...
అక్షరాలకు రెక్కలిచ్చి
పక్షుల్లా ఎగురవేసి పొమ్మని చెప్పండి

నెలనెలా వెన్నెల్లో ఎవరో వొకరి మిద్దె మీద
అక్షరాలతో వాళ్ళు చేయాల్సిన యుద్ధం
ఇంకా మిగిలే వుందని
అలిగి పోతున్న వాళ్ళని ఆగి పొమ్మని చెప్పండి



సాహితీ శిఖరం

1979 జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత

## అద్భుత నవలల సృష్టి కర్త...

# బీరేంద్ర కుమార్ భట్టాచార్య

బీరేంద్ర కుమార్ భట్టాచార్య ప్రఖ్యాత అస్సామీ సాహిత్యవేత్త. జ్ఞానపీఠ్, కేంద్ర సాహిత్య అకాడెమీ వంటి ప్రతిష్ఠాత్మక సాహిత్య పురస్కారాల గ్రహీతగా ఆయన భారతీయ సాహిత్యరంగంలో లబ్ధప్రతిష్ఠుడు. బీరేంద్ర కుమార్ భట్టాచార్య 1925లో అస్సాంలో జన్మించారు. ఆయన పత్రికా సంపాదకునిగా, ఉపాధ్యాయునిగా పనిచేశారు. ఆయన గౌహతీ విశ్వవిద్యాలయంలో జర్నలిజం విభాగంలో రీడర్‌గా ఉద్యోగ బాధ్యతలు నెరవేర్చారు. బీరేంద్ర కుమార్ భట్టాచార్య నవలలు, కథలు, కవితలు రచించినా నవలాకారునిగా అస్సామీ సాహిత్యరంగంలో సుప్రసిద్ధులయ్యారు. తొలి నవల రాజ్ పథె రింగైను 1957లో రచించారు. ఒక్కరోజులోనే జరిగే ఘటనలతో సాగే ఈ ప్రయోగాత్మక నవలలో రాజకీయ, సామాజిక విశ్లేషణలు చేశారు. 1958లో బీరేంద్ర వ్రాసిన రెండవ నవల ఆఐ (అమ్మ) లో సాధారణమైన పల్లెటూరిలో నూతన నాగరికత, యాంత్రికతల ప్రభావాన్ని చిత్రీకరించారు. బీరేంద్రకు ప్రఖ్యాతిని సాధించిపెట్టిన యారు ఇంగం (తెలుగులో జనవాహిని) నవలను 1960లో రచించారు. ఈ నవలకు ప్రతిష్ఠాత్మకమైన కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కారం లభించింది. నాగాజాతి జనజీవితాన్ని, వారి ఉద్యమాలను ఆధారంగా చేసుకుని రచించిన ఈ నవల అస్సామీ భాషలోనే కాక ఇతర భారతీయ భాషల్లోకీ, ఆంగ్లంలోకి అనువదించబడి సుప్రసిద్ధమై నిలిచింది. తంఖ్రుల్ నాగా తెగలు 20వ శతాబ్ది ద్వితీయ అర్ధభాగంలో జపాను-ఆజాద్ హిందు సేనల ఆక్రమణ, ద్వితీయ ప్రపంచ యుద్ధబీభత్సం, ఫిజో ఆధ్వర్యంలో వేర్పాటువాద ఉద్యమం, ఉగ్రవాదం వంటి పరిస్థితుల వల్ల ప్రాభవితమైన తీరు, ఎదుర్కొన్న కష్టనిష్టూరాలను నవల నేపథ్యంగా ఎంచుకుని రాశారు. ఈశాన్య రాష్ట్రాలపై చైనా యుద్ధ నేపథ్యంలో శతఘ్ని (1964) నవల రచించారు. 1942 కాలంలో అస్సామీలు బ్రిటీష్ ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ చేసిన పోరాటాన్ని గురించి రాసిన మృత్యుంజయ్ నవలను వ్రాశారు. బహుళ ప్రచారాన్ని పొందిన ఈ నవల ద్వారా బీరేంద్ర ప్రతిష్ఠాత్మక జ్ఞానపీఠ్ పురస్కారాన్ని పొందారు. ఆయన రచించిన చిన్న కథలు రెండు సంపుటాలుగా ప్రచురితమయ్యాయి. 1985లో మృత్యుంజయ్ నవలకుగాను జ్ఞానపీఠ్ పురస్కారం పొందారు. కేంద్ర సాహిత్య అకాడెమీ అధ్యక్షునిగా పనిచేశారు. అస్సాం సాహిత్య సభ 1983-85కాలంలో అధ్యక్షునిగా వ్యవహరించారు. 1950 దశాబ్ది చివరి సంవత్సరాలలో మణిపూర్ రాష్ట్రంలోని ఉఖ్రుల్ ప్రాంతంలో వెంచర్ క్రిస్టియన్ హైస్కూలులో ఉపాధ్యాయునిగా పనిచేశారు. ఆయన 1997లో మరణించారు.



వ్యాసం

# రంగు రంగుల పూల పండుగ - బతుకమ్మ

తెలంగాణలో జరుగు బతుకమ్మ పండుగను పురస్కరించుకొని...



గునుగుంట్ల శైలజ
97052 22397

బతుకమ్మ పండుగను తెలంగాణా రాష్ట్రములో ఆశ్వయుజ మాస శుద్ధ పాడ్యమి నుండి తొమ్మిది రోజుల పాటు జరుపుకుంటారు.-ఈ పూలపండుగ బతుకమ్మ ఎంగిలిపూలతో మొదలుపెట్టి సద్దులబతుకమ్మతో ముగిసిపోతుంది. దీనిలో భాగంగా మొదటి ఎనిమిది రోజులూ, పెళ్ళికాని ఆడపిల్లలు ఆడుకుం టారు. దీనిని బొడ్డెమ్మ అంటారు. తొమ్మిదవ రోజున మాత్రం సద్దుల బతకమ్మ అంటారు. బకతమ్మ పండుగ ఆశ్వయుజ మాసంలో రావడం వల్ల వర్ష ఋతువుతో నిండిన చెరువులు తొణికిస లాడుతూ వుంటాయి. పండి ఒరిగిన జొన్న చేలూ, పచ్చగా పెరిగే పైరు సంపద, విరబూసిన చెట్లతో ప్రకృతి సౌందర్యమయంగా వుంటుంది. ఈ పండుగ రోజుల్లో పుట్ట మన్నుతో ఒక బొమ్మను చేసి, బహుళ పంచమి నాడు దానిని ప్రతిష్ఠించి దాని పైన, ఒక కలశాన్ని వుంచి, కలశంపైన పసుపు ముద్దతో గౌరమ్మను నిలిపి పూలతోనూ, పసుపు తోనూ అలంకరిస్తారు. ఈ విధంగా ప్రతి ఇంటిలోనూ చేయకపోయినా, గ్రామానికి ఒక గృహంలో చేసినా సరిపోతుందని వారి అభిప్రాయం. బొడ్డెమ్మను నిలిపిన తరువాత ఆ వాడలో వున్న ఆడపిల్ల లందరూ అక్కడ గుమికూడుతారు. ఈ వినోదాన్ని చూడడానికి పెద్దలందరూ వస్తారు. ఇలా ఎనిమిది రోజులూ కన్నె పడచులు ఆడుకుంటారు. తరువాత నవమి రోజున కోడి కూసే సమయాన స్త్రీలు లేచి, పరిసరాలన్నీ తిరిగి రకరకాల పూలు సేకరించి, రంగు రంగుల పూలను త్రికోణాకారంలో పేర్చి అలంకరించిన బతుకమ్మల చుట్టూ చప్పట్లు చరుస్తూ వలయంగా తిరుగుతూ బతుకమ్మ పాటలు అనే పాటలను పాడతారు. బొడ్డెమ్మతో మొదలు ఎంగిలిపువ్వు బతుకమ్మ, సద్దుల బతుకమ్మ.. ఇలా దేని ప్రత్యేకత దానిదే.. తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మలను బావిలో లేదా నీటి ప్రవాహంలో నిమజ్జనం చేస్తారు. 'బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో' అని సాగే ఈ పాటల్లో మహిళలు తమ కష్ట సుఖాలు, ప్రేమ, స్నేహం, బంధుత్వం, ఆప్యాయతలు వ్యక్తపరుస్తారు.

తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఈ పండుగ ఎంతో ప్రాచుర్యంలోకి వచ్చింది. గత వెయ్యి ఏళ్లుగా బతుకమ్మను ఇక్కడి ప్రజలు తమ ఇంటి దేవతగా పూజిస్తు న్నారు. ఎన్నో చరిత్రలు, పురాణాలు మేళవిస్తారు, ఎన్నో చారిత్రక పాటలు పాడుతారు. ఈ పాటలు చాలా వినసొం పుగా ఉంటాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఈ బతుకమ్మ పండుగ. తెలంగాణ అస్తిత్వం బతుకమ్మ లోనే ఉంది. తెలంగాణ నేలపై బతుకమ్మ పండుగను శతాబ్దాలుగా జరుపుకుం టున్నారు. ఈ సాంప్రదాయం ఎలా మొదలైందో చెప్పడానికి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. నవాబులు, భూస్వాముల పెత్తందారీ తనంలో నలిగిపోతున్న తెలంగాణ గ్రామీణ సమాజంలో మహిళల బతుకులు దుర్భరంగా ఉండేవి. వారి అకృత్యాలకు నలిగిపోయిన వారిని, తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకున్నవారిని తలచుకొని తోటి మహిళలు విచారించే వారు. వారికి ప్రతీకగా పూలను పేర్చి బతుకవమ్మా లేదా బతుకు అమ్మా అంటూ దీవిస్తూ పాటలు పాడేవారు. "బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో" పాటల వెనుక ఉండే మర్మం ఇదే.

తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగలో మొదటిరోజు బతుకమ్మను ఎంగిలిపువ్వు బతుకమ్మ అని, చివరి రోజు బతుకమ్మను సద్దుల బతుకమ్మ అని అంటారు. ఈ రోజుల్లో ఆడపడుచులు అందరూ అత్తవారింటి నుంచి కన్నవారింటికి చేరుకుని ఈ పూల పండుగ జరుపుకోవటానికి తయారవు తారు. ఈ తొమ్మిది రోజులలో వీరు రోజూ బతుకమ్మలు చేసి, ప్రతీ సాయంత్రం వాని చుట్టూ తిరుగుతూ ఆడుతారు. ఆ తరువాత దగ్గరలో ఉన్న జలాలలో నిమజ్జనం చేస్తారు. అయితే

వ్యాసం

చివరి రోజు బతుకమ్మ (సద్దుల బతుకమ్మ) పండుగ అత్యంత మనో హరంగా ఉంటుంది. ఆ రోజు మగవారంతా పచ్చిక బయళ్ళలోనికి పోయి తంగేడు, గునుగు మొదలగు పూలను భారీగా ఏరుకుని వస్తారు. ఆ తరువాత ఇంటిళ్ళపాదీ కూర్చుని ఆ పూలతో బతుకమ్మను తయారు చేస్తారు. ఇందులో గునుగు పూలు, తంగెడు పూలు ముఖ్య భూమికను పోషిస్తాయి. ఈ పూలను జాగ్రత్తగా ఒక రాగి పళ్ళెంలో వలయాకారంగా, రంగులు మార్చుకుంటూ పేరుస్తారు. ముందుగా తంగెడు ఆకులు, పూలు పళ్లెంలో లేదా తాంబోలంలో పేర్చుతారు, ఆపై తంగేడు పూల కట్టలు పేర్చుతారు. మధ్య మధ్యలో ఇతర రకాల పూలను ఉపయోగిస్తారు. ఈ అమరిక ఎంత పెద్దదిగా ఉంటే అంత అందంగా ఉంటుంది. తెల్లని గునుక పూలను రంగులతో అద్ది పెడతారు. పేర్చడం అయ్యాక పైన పసుపుతో చేసిన గౌరిమాతను పెడతారు. ఇలా పేర్చిన బతుకమ్మను గృహంలోని దైవస్థానంలో అమర్చి కొవ్వొత్తులతో, అగరొత్తులతో అలంకరించి పూజిస్తారు. సాయంకాలం అందరూ తమ తమ బతకమ్మలతో ఒక చోట చేరి వాటిని మధ్యలో పెట్టి వాటి చుట్టూ తిరుగుతూ పాటలతో గౌరి దేవిని కీర్తిస్తూ ఆడవారు పాడుతారు. ఆడవారు వారికి ఉన్న అన్ని రకాల ఆభరణాలను ధరించి కొత్త బట్టలు కట్టుకుంటారు. ఇలా చాలా సేపు ఆడాక మగవారు వాటిని చెరువులో నిమజ్జనం చేస్తారు. ఆపై ఆ పళ్లెంలో తెచ్చిన నీటితో ఆడవారు వాయినమమ్మా వాయినం అంటూ వాయినాలు ఇచ్చి పుచ్చుకుంటారు. ఆపై ఇంటి నుండి తీసుకువచ్చిన పెరుగన్నం, సత్తుపిండి లను ఇచ్చి పుచ్చుకొని తింటారు. చివరి రోజు సాయంత్రం, ఆడపడు చులు అందరూ చక్కగా దుస్తులు, అభరణాలు ధరించి బతుక మ్మను వాకిలిలో పెడతారు. చుట్టుపక్కల ఉన్న వారు కూడా వారి బతుకమ్మలను ఇదే విధంగా అమర్చి వాటి చుట్టూ పెద్ద వలయాకారంలో చేరుతారు. ఐక్యత, సోదరభావం, ప్రేమను కలపి రంగరిస్తూ మానవ హారం ఏర్పరిచి పాటలు పాడుతారు. ఒకరు ముందుగా పాట మొదలుపెడితే మిగిలినవారు వారితో గొంతు కలుపుతూ పాడుతారు. ఈ జానపద గీతాలు చుట్టు పక్కలా ప్రతి ధ్వనిస్తూ ప్రత్యేకమైన తెలంగాణా సంస్కృతిని ఆవిష్కరిస్తాయి. చీకటి పడుతుంది అనగా, స్త్రీలందరూ ఈ బతుకమ్మలను తలపై పెట్టుకుని ఊరిలో ఉన్న పెద్ద చెరువు గానీ, తటాకంవైపు గానీ ఊరేగింపుగా బయలుదేరుతారు. ఈ ఊరేగింపు అందంగా అలంకిరించుకున్న స్త్రీలు, బతుకమ్మలతో అత్యంత సుందరంగా, వైభావయానంగా ఉంటుంది. డప్పు వాయిద్యాలతో ఊరేగింపు కొనసాగుతుంది, జానపద గీతాలతో వీధులు మారుమోగుతాయి. జలాశయం చేరుకున్న తరువాత, బతుకమ్మలను ఒక దగ్గర



**తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ పాత్ర ఎంతో విశిష్టమైంది. ఉద్యమ సందర్భాల్లో బతుకమ్మతో ఊరేగింపులు చేసిన తెలంగాణ ప్రజలు తమ తమ అస్తిత్వాన్ని సగర్వంగా ప్రకటించు కున్నారు. తెలంగాణ రాక ముందు ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఉన్న తెలంగాణ ప్రజలు బతుకమ్మని ఎక్కువగా ఆచరించేవారు కాదు. ఖమ్మం కోదాడ పరిసర ప్రాంతాల ప్రజలు అంతగా ఆడేవారు కాదు. కోదాడకు సమీపంగా ఉన్న మా గణపవరం గ్రామంలో నా చిన్నప్పటి నుంచి బతుకమ్మ సంబరాలు, దశమి రోజు జమ్మికి వెళ్లడం లాంటివి మాకు తెలియదు.**

వ్యాసం

సమూహంగా పెట్టి వాటి చుట్టూ చప్పట్లతో తిరుగుతూ బతుకమ్మ పాటలు పాడుతూ ఆడపడుచులు, మహిళలు తమ ఆనందాన్ని వ్యక్తపరు స్తారు. మెల్లగా బతుకమ్మలను పాటలు పాడుతూ, ఆడుతూ నీటిలో జారవిడు స్తారు. ఆ తరువాత మలీద అనే పిండి వంటకాన్ని బంధు మిత్రులకు పంచిపెడతారు. ఆ తరువాత ఖాళీ తాంబాలంతో పాడుతూ, బతుకమ్మను కీర్తిస్తూ ఇంటికి చేరుతారు. ఈ తొమ్మిది రోజులూ, ఈ పాటలన్నీ అర్ధరాత్రి వరకూ వీధులలో మారు మ్రోగుతూనే ఉంటాయి.

తెలంగాణ ఉద్యమంలో బతుకమ్మ పాత్ర ఎంతో విశిష్టమైంది. ఉద్యమ సందర్భాల్లో బతుకమ్మతో ఊరేగింపులు చేసిన తెలంగాణ ప్రజలు తమ తమ అస్తిత్వాన్ని సగర్వంగా ప్రకటించుకున్నారు. తెలంగాణ రాక ముందు ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో ఉన్న తెలంగాణ ప్రజలు బతుకమ్మని ఎక్కువగా ఆచరించేవారు కాదు. ఖమ్మం కోదాడ పరిసర ప్రాంతాల ప్రజలు అంతగా ఆడేవారు కాదు. కోదాడకు సమీపంగా ఉన్న మా గణపవరం గ్రామంలో నా చిన్నప్పటి నుంచి బతుకమ్మ సంబరాలు, దశమి రోజు జమ్మికి వెళ్లడం లాంటివి మాకు తెలియదు. కానీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బతుకమ్మ పండుగ యొక్క ప్రత్యేకత అన్ని ప్రాంతాలకు వ్యాపించింది. తెలంగాణ ప్రభుత్వం గ్రామ పంచాయతీలో నిధులు కేటాయించిన తర్వాత ప్రజలందరూ ఈ పూల పండుగలో పాల్గొనడం జరుగుతుంది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత బతుకమ్మను రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తరుణంలో బతుకమ్మ ఖండాంతరాలు దాటి ప్రాధాన్యత మరింతగా పెరిగిపోయింది. తెలంగాణ పర్యాటక శాఖ, తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో 2018, అక్టోబర్ 19న ఆకాశంలో బతుకమ్మ కార్యక్రమం జరిగింది. బతుకమ్మను పట్టుకొని పారా మోటారులో ఎక్కిన పలువురు మహిళలు ఆకాశంలో 5 నిముషాలపాటు విహరించారు. బతుకమ్మ పండుగ ప్రకృతిని అరాధించే పెద్ద పండుగ. పూలు బాగా వికసించే కాలంలో, జలవనరులు సమృద్ధిగా పొంగి పొరలే సమయంలో బతుకమ్మ పండుగ వచ్చి, భూమితో, జలంతో, మానవ అనుబంధాన్ని సంబరంగా జరుపుకోబడు తుంది. ఈ సంబరాలు జరుపుకునే వారం అంతటా స్త్రీలు"బొడ్డెమ్మ"(మట్టితో చేసే దుర్గాదేవి బొమ్మ) ను బతుకమ్మతో పాటూ చేసి నిమజ్జనం చేస్తారు.



**బతుకమ్మలు** స్తూపాల ఆకారంలో వుంటాయి. లింగాల తయారీలో కూడా ఇటువంటి సంప్రదాయ ముందని చాలాచోట్ల చెప్పబడింది. పూర్వం బౌద్ధులు తమ ఆరాధనలో భాగంగా చేసుకున్న స్తూపాలను పూలు, మట్టి, ఇసుక, పేడ, రాయి, ఇటుకలతో తయారు చేసుకునేవారు. బౌద్ధభిక్షుకులు నిరంతరం ప్రయాణిస్తుండడం వల్ల స్తూపారాధనకు తమకు దొరికిన వాటినే స్తూపాలుగా చేసుకుని బుద్ధునికి ప్రతీకగా నమస్కరించేవారు.

దసరా పండుగ సందర్భంగా కొలిచే హిందూదేవత నవదుర్గారూపాల్లో కూష్మాండిని ఒకటి. ఎనిమిదవ రోజున కూష్మాండినిని అర్చిస్తారు. అదేరోజు బతుకమ్మలాడుతారు. కొన్ని ప్రాచీన ఆచారాలను మతాలు స్వంతం చేసుకున్న క్రమం చరిత్రలో కనిపిస్తుంది మనకు. ఈ పండుగకు కూడా కులాల మసిపూయడం అనాచారం. ఇది ఎక్కువ (పెద్దకులాల) వాళ్ళ పండుగ కాదు వెనుకబడ్డ వాళ్ళదే. తొలి మొలకలను, తొలిపూతను కొలిచే ఆచారం గిరిజనులదే. పువ్వంటే రేపటి ఫలమని వాళ్ళకు తెలుసు. ఆడపిల్లలను, పువ్వుల్ని కొలిచే పండుగే మన బతుకమ్మ. ఈ పండుగకు మతం లేదు. మతాచారాలు రుద్దబడ్డాయి. మన ప్రాంతంలో కూష్మాండిని ఆరాధన జైనులవల్ల వచ్చింది. జైనమతానుయాయులైన కాకతీయులవల్ల ప్రోత్సహించబడ్డది. జైనంలో 22వ తీర్థంకరుని శాసనదేవత, యక్షిణి అంబిక లేదా కూష్మాండిని. ఈమె ప్రతిమాలక్షణంలో చేతుల్లో ఫలాలతో, ఇద్దరు పిల్లలతో, మామిడిచెట్టు కింద కూర్చొనివున్నట్టు వుంది. అంబిక కూడా ఒక అమ్మదేవతే. ఈ దేవతలకు ప్రతిమారూపాలు క్రీ.శ. 5వ శతాబ్దం నుంచే కల్పించబడ్డాయి. అంతకు

వ్యాసం

ముందున్నట్టు చారిత్రకాధారాలు లేవు.

బతుకమ్మల తయారీలో కూడా చాలా భేదాలు కనిపిస్తాయి. బతుకమ్మలు స్తూపాల ఆకారంలో వుంటాయి. లింగాల తయారీలో కూడా ఇటువంటి సంప్రదాయ ముందని చాలాచోట్ల చెప్పబడింది. పూర్వం బౌద్ధులు తమ ఆరాధనలో భాగంగా చేసుకున్న స్తూపాలను పూలు, మట్టి, ఇసుక, పేడ, రాయి, ఇటుకలతో తయారుచేసుకునేవారు. బౌద్ధభిక్షుకులు నిరంతరం ప్రయాణిస్తుండడం వల్ల స్తూపారాధనకు తమకు దొరికిన వాటినే స్తూపాలుగా చేసుకుని బుద్ధునికి ప్రతీకగా నమస్కరించేవారు. పూలు, ఇసుక, మట్టి, పేడ స్తూపాలను నీటిలో కలిపేసేవారు మర్యాదగా. వాళ్ళు తిరుగాడిన ప్రదేశాల్లోని ఎన్నో వాగులు, ప్రవాహాలు భిక్కేరులుగా పిలువబడుతున్నది ఒక్క తెలంగాణలోనే. అందువల్లనే తొలుత బౌద్ధులైన గిరిజనులు, వనజనులు ఈ ఆచారాన్ని కొనసాగించివుంటారు. దానికి వారి కోరికలు మన్నించిన అమ్మదేవతకు ప్రతీకగా తర్వాత చేసుకుని వుంటారు. పిదప కాలాల్లో వచ్చిన మతపరిణామాల వల్ల ఈ దేవతలను తమ, తమ మత దేవతలుగా చేసుకున్నారు. ఆ దేవతలే బౌద్ధంలో హారీతిగా, జైనంలో ఆమ్ర కూష్మాండినిగా, హిందూమతంలో అంబికగా పూజింపబడ్డారు. తెలంగాణాలో అతిప్రాచీనమైన అమ్మదేవతల ఆరాధనమే తల్లుల రూపంలో ఏ దేవత వచ్చినా తమ దేవతల్లో కలుపుకున్న సంప్రదాయమే బతుకమ్మ జాతరగా నిలిచిపోయింది. దసరాపండుగతో బతుకమ్మను కలుపడం, అమ్మదేవతలను కాకుండా పితృదేవతలను పూజించే ఆచారంగా మారడం 'పెత్రామాస'(పితృ అమావాస్య)ను ఈ పండుగలో చేర్చడం తర్వాతి కాలాల్లో వచ్చిన పరిణామమే.

జనపదుల ఆచారాలు చాలా ప్రాచీనమైనవి. అవి వేలయేండ్ల పూర్వపువి. ఒక్కో జాతికి, ప్రాంతానికి పరిమితమైనవి. బతుకమ్మ మనకు, మన తెలంగాణాకే పరిమితమైంది. ప్రపంచంలో మరెక్కడా లేని పూలపూజ మన సంస్కృతి. బతుకమ్మ జానపదుల పండుగ. బతుకమ్మ ఆటలో గుస్సాడి నృత్యం, చప్పట్లలో జానపదుల పాట, ఆటల కలయిక మన మూలాలను ఎరుకపరిచే మంచి సంప్రదాయం. బతుకమ్మ అచ్చతెలుగు మాట. దాన్ని సంస్కృతీకరించి పౌరాణికం చెయ్యొద్దు.

బతుకమ్మ పండగ వస్తూందంటే తెలంగాణా పల్లెల్లో నూతనోత్సాహం వెల్లి విరుస్తుంది. అది ఒక పెద్ద సంబరంగా భావిస్తారు. ఇళ్ళు శుభ్ర పరుస్తారు. చక్కగా అలంకరించు కుంటారు. ఆడపిల్లల్ని పుట్టింటికి తీసుకు వస్తారు. కొత్తగా పెళ్ళైన ఆడపిల్లలకు అత్తగారి ఇంటి నుంచి కాగితపు పూలతో చేసిన బతకమ్మను వాయినంగా పంపు తారు. అత్తగారింట్లో వుండే ప్రతి ఆడపిల్లా ఎప్పుడు కన్న వారింటికి వెళ్ళాలా? కన్నవారి పిలుపు ఎప్పుడు వస్తుందా? తనను తీసుకువెళ్ళడానికి అన్న ఇంకా రాలేదే అన్న బాధను వ్యక్తపరుస్తారు.

ఉదాహరణకు పండుగ వస్తుందంటే, ప్రియుని రాకకై ఎదురు చూసే ప్రియురాండ్లు పాడుకునే పాట....

బతకమ్మ బతకమ్మ ఉయ్యాలో-
బంగారు బతుకమ్మ ఉయ్యాలో
నానోము పండింది ఉయ్యాలో-
నీనోము పండిందా ఉయ్యాలో
మావారు వచ్చిరి ఉయ్యాలో- మీవారు
వచ్చిరా ఉయ్యాలో

ఈ విధంగా ఎన్నో పాటలు పాడుతారు. తొమ్మిదవ నాడు బొడ్డెమ్మ నర్పించి కలశంలో, ఆవాడ పిల్లలు ప్రతిదినం తెచ్చి పోసే బియ్యం పరమాన్నం వండి పంచి పెట్టి ఒక బావి దరి చేరి

"బొడ్డెమ్మ బొడ్డెమ్మ... బిడ్డలెందారే
బావిల పడ్డ వారికి... వారిద్దరమ్మా
చెర్ల బడ్డ వారికి... చేరిద్దరమ్మా
కుంటల్ల బడ్డ వారికి... కోరుద్దరమ్మ
నిద్రపో బొడ్డెమ్మ... నిద్ర బోవమ్మ
నిద్రకు నూరేండ్లు... నీకి వెయ్యేండ్లు
నిను గన్న తల్లికి.... నిండ నూరేండ్లు"

అంటూ బొడ్డెమ్మను నీటిలో వదులుతారు.

బొడ్డెమ్మపండుగ నాడు 'బొడ్డెమ్మ బొడ్డెమ్మా వలలో, బిడ్డాలెందారే.. వలలో' అని పాడే పాట సంతానం గురించే కదా. నాటి రోజుల్లో ప్రసవ సమయాల్లో శిశు మరణాలు ఎక్కువగా వుండేవి. నీటిరేవులే ఆనాటి తల్లులకు ప్రసూతి స్థలాలు. నీళ్ళల్లో ప్రసవించే సమయంలో తల్లులు తమసంతు బతికినందుకు ప్రతీకగా నీటివారన పెరిగే తంగేడు, గునుగు పూలముద్దలను నిమజ్జనం చేసివుంటారు. ఆ తల్లుల ఆచారమే బతుకమ్మ పండుగగా మారి వుంటుంది. ఇది తెలంగాణా ప్రాంతానికే చెందడం మన గొప్ప సంస్కృతికి సాక్ష్యం. ఎవ్వరికన్న ఐదారుగురు కన్నా ఎక్కువమంది పిల్లలుంటే ఆ తల్లిని గౌరవించేవాళ్ళు. మానవజాతి పిల్లల వల్లనే కదా ఇన్ని వేలయేండ్లుగా మనుగడ సాగిస్తుంది. అందుకే తల్లికంత గౌరవం. అమ్మతనం మీద భక్తి. ఆ భక్తే అమ్మదేవతలను కల్పించింది, పూజించింది. అమ్మదేవతల పూజల్లో ఒక ఆరాధనా రూపమే మన బతుకమ్మ. కూష్మాండిని దేవతకు ప్రతీకగా గుమ్మడిపువ్వును పూజించే ఆచారమే బతుకమ్మ పండుగగా మారిందని కొందరి అభిప్రాయం. మన పూర్వీకులు ఇనుము-ఉక్కు తయారీకి తంగేడుచెక్కను వాడేవారని నేను విన్నాను. తోలు తయారీకి తంగేడు ఎంత అవసరమో అందరికి తెలుసు. గునుగుకు నీళ్ళను శుభ్రపరిచే గుణముంది. తమకు నిత్య జీవితావసరాలైన తంగేడు, గునుగు పూలతో మన పూర్వీకులు తమ అమ్మ దేవత (కూష్మాండిని)ని పూజించే రూపమే పరిణామంలో జాతరగా మారి వుంటుంది. గునుగు, తంగేడు పువ్వులతో కొప్పురం రూపంలో పూల బతుకమ్మను పేర్చి, శిఖరం లేదా సిగమీద గుమ్మడి పువ్వుంచి, పసుపు, కుంకుమలతో అలంకరిస్తారు. పూజ పువ్వులను తొక్కుట్లవెయ్యని ఆచారమే బతుకమ్మలను నీళ్ళలో వదిలే సంప్రదాయమైంది.

కథ

# గుర్తుంచుకొండ్రి

**జీవితంలోని ఎగుడు దిగుడులు చిత్రించిన కథ...**



దారం గంగాధర్

ఓ చిన్న పల్లెటూర్లె ఎంకట్రామయ్య పేరున్న రైతుండు. ఎంత లేదన్న ఇర్వైదు బిగా పంట వండె ఎగుసం, ఆలుమందలు సుత శాన ఉన్నై.

గీయన శాన మంచోడని పేరెల్ళినోడు ఆ పల్లె సుట్టూత పల్లెల్లోలంత గీయన్ని దేమునోలె మొక్కేటోళ్ళు. పల్లెల్ల ఏ ఆపదొచ్చినా ఆదుకునేటోడు. అందరికీ గుండెల్ల నిల్చినోడు.

గసోంటి అయ్యకాన నేను పొలం పనులు చేయించటం కని గుమస్తా చేస్తున్న. ఇద్దరం చిన్నప్పటి దోస్తులమే. రామయ్యకు అన్ని ఇసాబుల్లో ఖరాఖండిగ ఉండి పాలళ్ళ నీళ్ళు నీళ్ళల్ల పాల లెక్క కలిసి ఉండేటోళ్ళం. మా ఇద్దరి కుతికె ఒక్కటే.

ఇసిత్రం ఏందంటే అయ్యకు నాకు చెరి ఒక్క కొడుకే. అయ్య కొడుకు వినోద్, నా కొడుకు ఆనంద్ ఇద్దరూ ఒకటే క్లాసు చదువుకుంటుండ్రు.

నాకు పక్కా యాదికుంది. మా పిలగాండ్లు ఐదో తరగతి సదుకునేటప్పుడనుకుంట మా పల్లె సుట్టుపక్కలూర్లళ్ళ అన్నలు (నక్సలైట్స్) వస్తుపోతున్నరని, ఆళ్ళు శాన మొండోళ్ళని ఆల్ల మనసుల నల్లగొస్తే ఎనకా ముందేం సోంచ్ చేయక ఖతం చేసుడో ఇంకేదో చేస్తున్నారని అయ్యకు తెల్సింది.

పయ్యకుక్కకు సారకుక్క సోపతైనట్లు ఊళ్లె పనీపాట లేక బేవార్సుగా తిరిగే గలత్ పోరగాండ్లు ఆళ్ల జతకట్టి పని చేసుకొని బతికేటోళ్ళను సతాయిస్తున్నరు జులుం ఎక్వైపోయింది.

గీ ఇసెం తెల్సి ఎంకట్రామయ్య నన్ను పిల్సి 'వారి గంగన్నా దుష్టే దూర వర్జతే' అని మన పెద్దమనుసులు అంటుండ్రి. దుష్టుల్ని చూసి దూరముండాలె బష్టుని చూసి బాదుకుండాలె. ఇగ మనం ఈ పల్లెలిడిసి పట్నం బోవాలే. మనం ఇంత ముద్దేస్తే తిని బతికినోళ్ళు (చెంబెడు) దొప్పెడు గంజి వోస్తే తాగినోళ్ళు సుత ఈ అన్నల్తోని మిలాఖత్ అయ్యిండ్రు. నా మీద షికాయతులు చేస్తుండ్రట. నా మంది అనుకున్నోలల్ల సుత ఓర్వలేని తన మొచ్చినంకల మనం ఈడ ఉండుడు మంచిది కాదు. మనం ఎంత యెల్లెం అయితే అంత యెల్లెం ఈడున్నుంచి యెల్లిపోవాలే" అని భయంతో సెప్పిండు.

అయ్యకు పాణంల పాణం లేక ఉన్నోన్నా. నన్ను సుత తనతో తీస్కపోతా నని పట్టువట్టిండు. అయ్యకు నీడలెక్క ఉన్నోన్ని తన మాటను కాదంటానా?" అట్లే అయ్యా! నీవెక్కడుంటే నేనక్కడే" నని మాటిచ్చిన.

అయ్యకున్న పొలం పాట్రాలో గొంచెం అమ్మిండు. గొంచెం తన పాలేర్ల కిచ్చిండ్రు. గరీబోళ్ళకు పాడిపసుల్ని దానం జేసి పట్నంకు బయలెల్లేటప్పుడు పల్లెలోళ్లంతా "అయ్యా! కట్టకాలంల మాతోని దు:ఖం పంచుకున్నవ్. అన్నదానం చేసి ఆదుకున్నవ్. కులం, మతం, ఇసాబు తెంచక మా అందర్ని కల్సుకొని పోయినే, నువ్వు కనవడే దేవునివి నువ్వు వోతే మా గతేం కావాల్నయ్యా! ఈ పల్లెలన్నీ ఖబ్రస్తాన్ (శ్మశాస) లైతైయి. "గిట్ల అనుకుంట ఒద్దని బతిమాలుతుండ్రు. గూడు చెదిరిన పెట్టెళ్లెక్క గిలగిల కొట్టుకుండ్రు. గనిగా కర్కోటకులకు ఎరిసినయ్య మాత్రం బయటేసిన అడుగు లోపలికెయ్యలే.

తెల్లారేటికల్లా పట్నం చేరుకున్నం. తనకు తెల్సినోళ్ళకు చెప్పి అయ్యగారు ఉండన్కి ఓ పెద్ద ఇల్లు మాట్లాడి పెట్టిండు. అదే ఇంట్లో మా రెండు కుటుంబాలోళ్లం ఉండవస్తిమి.

గిట్ల కొన్ని దినాలు గడ్సిపోంగనె ఎంకట్రామయ్య తనకు పత్వార ఉన్నోళ్ళ తోని రియల్ ఎస్టేట్ దందల పొత్తు కుదిరిండు. గిట్ల ఓ రెండు యాడాదులు గడ్సిపోయినంక తానే సొంతం దంద షుర్వు చేసి అండ్ల నాకు సుత కొంత ఇస్సా ఇచ్చిండు.

నిత్తెంగా దంద మీద మంచి, నిగరాని (సూజర్విజన్) చేసుకుంటగా రియల్ ఎస్టేట్ దందని బగ్గా పెద్దగ చేసినం. అయ్యకు మంచి పేరొచ్చి లక్షలు కోట్లు కమాయించే ఎట్లయితే దంద/ యాపారం

కథ

పెరుగుడు షుర్వైందో గట్లే మా ఇద్దరి కొడ్కులు సుక పెరిగి పెద్దోళ్ళైరి.

నా కొడుకు సక్కని బుద్దులు నేర్చుకుంటుండు. పన్నెండు సద్వేకాన్నుంచి ఎన్‌సిసిల చేరి సంఘసేవల సితం బిజీగా ఉండు. వాని తెలివితోని యూనివర్సిటీ సదువుల సుత మంచి పేరు తెచ్చుకొనె. "పుట్టిన గడ్డకు పానమియ్యాలె ఈ దేశం ఈ భూమి నీకేమిచ్చింది కాదు బిడ్డా. నువ్వు దేశానికి ఏం జేశావన్నది సోంచాయించికో" అని ఆనికి అప్పుడప్పుడు నేను చెప్పెటోన్ని. గా మాటలని నా మక్సత్ పూర చేసుకుంట పాతికేండ్లోడాయె.

అదే అయ్యగారి కొడుక్కు పైసల గమాండెక్కువై నీతీ నియమాలు, కట్టుబాట్లు బేఖాతరు చేసి, ఆవార గాండ్ల సోపతి, జల్సాల ఊబిలో కూరుకుపోయి, క్లబ్బులు, పబ్బులని నిషాబాజికి పురాగ గులాం అయ్యిండు.

గివన్ని జూసి నా పానం ఆగక "గిదేంది బిడ్డా! గిట్ల ఆవారైతివి. మీ నాయిన నల్గుట్ల పతేర ఉన్నోడు, గాయిన ఇజ్జత్ దీసే పనులు జేయవడ్తివి" అని మెత్తగనో గట్టిగనో జెప్పెటోన్ని గన్ని అయ్య ఒక్కనాడు సుక బెదిరిచ్చిన పాపాన వోలె.

నేను మందలించినందుకేమో ఒక్క కుతికోలే ఉన్న మా ఇద్దరి నడ్మ చిచ్చు వెట్టుడు షుర్వు జేసిండు. ఈ గంగడి పీడవోతె నా ఆగం తిరుగుళ్ళకు అడ్డు పోతదని, నామీద ఎన్నో పీతుర్లు జెప్పి మా ఇద్దరిని దూరం జేసిండు మొదాలు ఆని మాటలు నమ్మలేగని గదేదో ఉల్టా పల్టా చేసి చెప్పంగ చెప్పంగ అయ్యగారు కన్నపేగు మాయ ప్రేమలో బడి నాతోని మాట బందుజేసిండు ఎంకట్రామయ్య.

గట్ల అయ్యగారు మేము మెల్లిమెల్లిగా కలువక దూరమైతిమి గిట్ల మేము కల్సి మాట్లాడుకోక 10, 20 ఏండ్లైపోయె.

వినోదు తిరుగుళ్ళకు పట్టపగ్గాలు లేకుండా వోయినై అని అయ్యగారు గుండె శోకంతో ఆరోగ్గం దెబ్బతిందని సితం కంజోరైండని, రియల్ ఎస్టేట్ దందా పురోగ దెబ్బ దిన్నదని తెల్సే ఇయ్యాల్టి పోటీ పర్పంచంలో యాపారం ఒకసారి ఎనుక వడ్తే మళ్లా ముందుకు వోకడ కష్టం. ఆయన కట్టిన బంగ్లాలు నాణ్యత లేక అమ్ముడువోతలేవట. పెట్టిన పెట్టుబడు లన్నీ ఎక్కడికక్కడ ఆగిపోయి

**బూజా** దుమ్మువట్టి. ఇంటికేసిన రంగంతా ఎల్సిపోయి, మందిలేని కొంపోలె కనవడె. షుర్వుల ఈ ఇల్లు కాదేమో అనుకున్న గని ఇంటి గేటుకు రాసున్న పేరు 'తులసి నివాసం' సూసి గేటు తలుపు మెల్లిగ తీసిన తెర్సుకోలె. పక్కే ఉన్న కాలింగ్ బెల్ నొక్కితి అదీ మోగలే అనుమానంతోనే "అక్కా! తులిసుమ్మక్కా అంటు పిల్సిన. సప్పుడు లేదు. మల్లొకసారి బిగాతా పిల్సిన "ఎవరూ?" అనుకుంట ఓ ముసలవ్వ అంటు గేటు తెర్సి బయటకొచ్చె.



కథ

గదేదో మూల్గే నక్క మీద తాటికాయ వడ్డట్లు ముసలితనం సుత అయ్యను ఎక్కిరించింది. ఏపారం ఏట్లె కల్సిపాయె. కొడుకు ఆగం తిరుగుట్లకు నల్గురి పరువు బజారుపాలు గావట్టె అని మంచం బట్టిండు.

గిట్ల కాలం గడ్వంగ నేనెన్నోమార్లను కున్న అయ్యను ఒకసారి చూసి రావాలని ఆయినె సుత "గంగన్న నొకసారి రమ్మనుండ్రి. ఆయనెతోని మాట్లాడేదుం దని" కవరు మీద కవరు జేసిండు గని నా గుండెల మసులుతున్న బాధ నన్ను అయ్యకానికి పోనియ్యలే, గని కొన్ని దినాలకు మనసుండవట్టలేక వినోదు పిల్లోడు ఏమన్నా ఫర్వాలేదనుకొని గుండె బండ చేసుకొని హిమ్మత్ చేసి మా డ్రైవరు పిలగాన్ని పిలిసి కార్లో బయలెల్లిన.

గిట్ల ఏవేవో సోంచుచేసుకుంటు ఉండంగనే అయ్యగారి ఇల్లు రానే వచ్చె. కారు ఆగంగనే దిగి చూత్తునా అది అయ్యగారి ఇల్లు లెక్క లేదు. బూజూ దుమ్మూ వట్టి. ఇంటికేసిన రంగంతా ఎల్సిపోయి, మందిలేని కొంపోలె కనవడె. షుర్వుల ఈ ఇల్లు కాదేమో అనుకున్న గని ఇంటి గేటుకు రాసున్న పేరు 'తులసి నివాసం' సూసి గేటు తలుపు మెల్లిగ తీసిన తెర్సుకోలె. పక్కే ఉన్న కాలింగ్ బెల్ నొక్కితి అదీ మోగలే అనుమానంతోనే "అక్కా! తులిసమ్మక్కా" అంటు పిల్సిన. సప్పుడు లేదు. మల్లొకసారి బిగాతా పిల్సిన "ఎవరూ?" అనుకుంట ఓ ముసలవ్వ అంటు గేటు తెర్సి బయటకొచ్చె. ఆమెను చూసి మస్తు పరేషానైన. ఎందుకంటే ఆమెవ్వరో కాదు. అయ్యగారి ఇల్లాలు తులసి గామె కుందనం బొమ్మ లెక్కుండెడిది. గీయ్యాల్ల బొందల కెల్లి తీసిన పీనుగు లెక్క కనవడ్తున్నది. నన్ను సూసీ సూడంగనే మురిపెంతో ఇంట్లకెళ్ళి" మన గంగన్నొచ్చిండయ్యా" అని చెప్తున్న మాటలు నా శెవుల పడ్డె.

నేను మెల్లంగా అడుగులేసుకుంటు లోపలికి ఎల్తినో లేదో "గంగన్నా వస్తివా రారా గంగన్నా!" అనుకుంట నన్ను గభాల్న వాటేసుకునే అయ్యగారు. దు:ఖం మురిపెం ఒక్కసారే ఉప్పొంగి కంట్లెకెళ్ళి నీళ్ళు ఎగదోసుకొని బయటికొస్తున్నై. గొంతసేపు మేమిద్దరం ఈ దునియానే మర్సిపోయినం. గిట్ల ఎంతసేపైందో.

"అన్నా! కూసుండ్రన్నా" అన్న తులిసెమ్మ మాటకు మళ్ళ లోకంల కొచ్చినం ఇద్దరం సోఫాల ఒకళ్ళ పక్కనొకళ్ళం కూలవడ్డం.

అయ్యని చూసుకుంట "అయ్యా! ఏందయ్యా గిట్లైపోయినవ్" అని అడుగుతుంటే నా కండ్లళ్ళ నీళ్ళు ఆగక ధారలై కారవట్టె. గాయన మాసిపోయి నెరిసిన గడ్డం, బక్కగైన పెయ్యి, గూట్లెకు వోయిన కండ్ల గుడ్లు, ఎన్నో దినాలసంది బీమారై మంచం పట్టిన రోగిస్టోని లెక్క కనవడ్తుండు.

"చెప్పుడు మాటలిని పానంల పానమసుంటి నిన్ను దూరం చేసుకుంటి గంగన్నా! నేం జేసిన గలత్ సజా ఇపుడు భోగిస్తున్న. "ఆయన మాటల్లనే కాదు. కండ్లళ్ళ సుత తను తప్పు చేసిన ఇసం కొట్టచ్చినట్లు కనవడ్తున్నది. ఆయన కండ్లకెళ్ళి ఆనకు సూరుధారలు కారినట్లు కండ్లనీళ్ళు కారుతూనే ఉన్నై.

"అట్లనకయ్యా! నిన్ను యాది చేసుకోని దినం లేదు. నిన్ను సూడాలని కొట్టుకోని నిమిసెం లేదు. ఇప్పుడైతే అచ్చిన గదయ్యా! కొన్ని దినాలు దుష్టగడెలుం డనేమో, అవి పోయినై. నేనొచ్చిన నీవేం ఫికర్ పెట్టుకోకుండ్రి" అని అనుకుంట ఎంకట్రామయ్యను ఊకుండ వెడ్తున్న.

ఏ ఒక్కపూటైనా పెండ్లాం పిల్లలున్నా రని తెల్సుకుని మనసిప్పి మాట్లాడిండా? ఏ ఏ నడిరాత్రి దాటినంక పూటుగా తాగి తూలుకుంట అస్తడు. పంటడు. బారెడు పొద్దెక్కినంకాల లేసి ఆదరబాదర తయారై కొంపలంటుకవోయినోని లెక్క బుర్రున కారెక్కి ఉడాయిస్తడు. ఆనికి పెళ్ళాం పిల్లలు అమ్మా అయ్య ఎవ్వలి పట్టింపు లేదు. ఆనికి కావల్సిందల్లా పక్కు చెక్కుబుక్కులు, బ్యాంకు బాలెన్సులు, దోస్తులు గింతే.

"అదికాదు గంగన్నా! నాకున్నది ఒక్క కొడుకే గదా అని గార్వం జేసిన. సద్విసంత సద్వు చెప్పించిన, శాన్ల ఫరకొద్దని అడిగినంత డబ్బిస్తి, కోరుకున్న కారు కొనిస్తి, వాడడిగింది ఇస్తి. వాడికేం తక్కువ చేస్తి ఆని కోసం కోట్ల సంపద ఒదిచ్చి ఇస్తి. ఇయ్యాల వాడు నన్ను గిట్ల మంచబట్టిచ్చే".

అయ్య మాటల కడ్డుజెప్తు "ఈ ఆస్తులు అంతస్తులేమన్న శాశ్వితమా. నువ్వెంతో దయాధర్మాత్ముడివి. నాకెర్క లేదా. పాతికేళ్ళనాడే మన పల్లెలో సానమంది గరీబు గాళ్ళకు దానధర్మాలు చేసినోడివి. తోటి మనుషులంతా బాగుంటే మనం బాగుంటం అని సోంచు చేసేటి మనసున్న మారాజువి...".

"నీ కొడుకు సూడు దేశం మొత్తం షాన్‌తో చెప్పుకొనే ఫాజీల అవ్వల్దార్ దర్జ ఆఫీసరైండు. నీ పిల్లోనిల ఎంత నీతి నియమముంది. ఎంత రీతి రివాజుంది. మా ఇంటికొచ్చినా ఎక్కడైనా ఎదురైనా "అమ్మా! బాగున్నారా? అంకుల్ బాగున్నారా?" అని ఎంత మర్యాదతో ప్రేమతో పలకరించి నమస్కరిస్తాడో. ఎదిగినకొద్దీ ఒదిగి ఉండడమంటే గిదే కావొచ్చు. ఎన్ని నోములు నోచుకుంటే మా రుక్మిణి గింతటి కొడుకుని కన్నదో కదా!..." కొన్ని నిమిషాలు ఇద్దరికిద్దరం కామూష్‌గానే ఉన్నం.

మళ్ళీ తానే "నా కొడుకున్నాడు. వాడు దేనికి? ఏడ్వనికా? మొత్తుకోనికా? ఒక్క బుద్దన్న సక్కగున్నదా? ఏ ఒక్కనాడు సుతా ఇంటికి అర్ధరాత్రి దాటకముందు రాలే. ఏ ఒక్కపూటైనా పెండ్లాం పిల్లలున్నా రని తెల్సుకుని మనసిప్పి మాట్లాడిండా? ఏ ఏ నడిరాత్రి దాటినంక పూటుగా తాగి తూలుకుంట అస్తడు. పంటడు. బారెడు పొద్దెక్కినంకాల లేసి ఆదరబాదర తయారై కొంపలంటుకవోయినోని లెక్క బుర్రున కారెక్కి ఉడాయిస్తడు. ఆనికి పెళ్ళాం పిల్లలు అమ్మా అయ్య ఎవ్వలి పట్టింపు

లేదు. ఆనికి కావల్సిందల్లా పక్తు చెక్కుబుక్కులు, బ్యాంకు బాలెన్సులు, దోస్తులు గింతే. గీ ఆవార తిరుగుళ్ళే". మళ్లా మా ఇద్దరి నడుమ కొంత కామూషి. నేను సుత గమ్మునే ఉన్న.

మళ్ళా షురు జేసిండు. "ఎన్నడో ఒకనాడు ఆని నాయనమ్మ అడుగుతుండె "ఆరి ఇనోదూ! నీ సూపే బంగారైంది బిడ్డా! ఏ ఒక్కనాడైనా మాతోని మనసిప్పి మాట్లాడవైతివి. నీ పెండ్లాం బిడ్డడితోనన్నా ముద్దూ మురిపెం లేకపాయె. ఫకాతు దోస్తులు దోస్తులని బయటనే తిరుగుతవు. బేవార్సుగాని లెక్క. దునియాల నీకే ఉన్నరా దోస్తులు. ఇంకెవలికన్నా ఉన్నారా లేరా?" అని నిలదీసి అడిగేద్ది. నా దిమాకు తిరిగి ఒకనాడు నేను సుత గట్టిగనే మందలిస్తి. "ఒరే బాడ్కావ్, ఒక్కమాట మాట్లాడవ్. ఇనీ ఇననట్టు జారుకుంటవ్. అసలు నీ సంగతేందిరా!" అని గదమాయించిన. ఎంటనే నా మీదికి చెయ్యెత్తె. గది చూసి నేను బిర్రబీసుకుపోయిన మారుమాట్లాడక నిల్సుండిపోయిన. ఆని కొడుకుని చూస్తె కడుపు తరుక్కుపోతది. కోడలు పిల్ల గంగ దేవసుంటిది. ఎంత పెద్ద సదువు సద్వుకున్నదో అంత నిదానమున్న పిల్ల. గామె దిమాకు గనక పల్టాయించి ఏమన్న జేస్తే మా పరువు బజారుపాలు గాక ఏమవుతది. మా కడుపుల ఎట్ల చెడవుట్టిండో, మా కంటికి నిద్ర కరువైంది. మనసుల మనసు లేదు..."

ఎంకట్రామయ్య మాటల్ల బాధ గండ్ల నీళ్ళతోనే తెలుస్తున్నది. మళ్ళా చెప్పుడు షురువు జేసిండు తన యెతను.

"గంగన్నా! గిట్ల నెలలు యాడాదులు గడ్సిపోవట్టె. కోడలు పొల్ల మనడ్ని సంకనేసుకొని తన తల్లిగారింటికెళ్ళిపోయె. ఆని నడకల ఫరక్ లేదు. అసలు గల్తంతా నాదే. ఒక్క కొడ్కే అని నెత్తిన వెట్టుకుంటి. గదేదో మొక్కై అంగనిది మానై అంగదన్న శాస్త్రం పక్కా సుబూతైంది. గీ పట్నంల కొచ్చిన. మొదట్లనే అజమాయిషిల పెట్టుంటే గీయాల్ల గిట్ల అయటోడే కాడేమో అని ఇషయమే పట్టించుకోక యాపారం అనుకుంట అండ్లనే మునిగితి. అడిగినంత డబ్బిచ్చిన, అని దోస్తుల్ని తెచ్చి నాకు ములాఖత్ చేయిస్తుండె "డాడీ! గీయిన పెద్దాఫీసరు కొడ్కు. గాయిన మినిస్టర్ కొడ్కు. గీయిన పెద్ద బిజినెస్ వాళ్ళ కొడ్కు" గిట్ల చెప్తుంటే నేను లోలోపల మస్తు ఖుషీ అయిపోతుంటి. నా కొడ్కు పెద్దమందితోని దోస్తానా జేస్తున్నడని షాన గొప్పోడైతడని.

గని ఆని తల్లి తులిసికి అనుమానమొచ్చిందేమో ఒకనాడు "అయ్యా! ఈ నడుమ దునియ పిల్లగాండ్లు శాన పాడైపోతున్నరట. గవేవో నిషాబాజికి అలవాటైపోతున్నరని టీవీల్ల సూపిస్తున్నరు. మొన్న నేను చూసిన. మన పిల్లోడ్ని కొంచెం కనిపెట్టుండ్రి" అన్ని అంది. గనీ ఆమె మాటలు బేఫర్వాయి చేస్తి. ఉల్టా ఆమెనే గద్మాయించి వెట్టిన. పెద్ద పెద్ద దోస్తానతో నా ఖదర్ మరింత పెరుగుతదనుకొంటి. గాల్లె మేడలు కడ్తి. గీ మేడలు ఒట్టి దూది పింజాల్లెక్క ఎగిరి పోతయని తెల్వకపాయె. ఆని మాయ మాటలిని తోడవుట్టినసుంటి నిన్ను దూరం జేసుకొని నా కొంప కొల్లేరు చేసుకుంటి. గానాడే గా అన్నల సేతుల సచ్చినా బాగుండె. ఇయ్యాల ఈ ఆపతి రాకుండెడిది..." తన కంట్లెకెళ్ళి నీళ్ళధారలు కారుతునే ఉన్నై.

గవేవో నిషాబాజికి అలవాటై పోతున్నరని టీవీల్ల సూపిస్తున్నరు. మొన్న నేను చూసిన. మన పిల్లోడ్ని కొంచెం కనిపెట్టుండ్రి" అన్ని అంది. గనీ ఆమె మాటలు బేఫర్వాయి చేస్తి. ఉల్టా ఆమెనే గద్మాయించి వెట్టిన పెద్ద పెద్ద దోస్తానతో నా ఖదర్ మరింత పెరుగుతదనుకొంటి. గాల్లె మేడలు కడ్తి. గీ మేడలు ఒట్టి దూది పింజాల్లెక్క ఎగిరి పోతయని తెల్వకపాయె. ఆని మాయ మాటలిని తోడవుట్టినసుంటి నిన్ను దూరం జేసుకొని నా కొంప కొల్లేరు చేసుకుంటి. గానాడే గా అన్నల సేతల సచ్చునా బాగుండె.



"ఊకో అయ్యా! బాధపడుకు. చేతులు కాలినంక ఆకులు పట్టుకుంటంటే ఫాయిద లేదు. గదేదో ముందే ఉండాలె. పోని ఇడ్సిపెట్టుండ్రి. గడ్సిందంతా పీడకల అని అది మర్వాలె. నేనున్న, నేనున్నంక మీకు రందెందుకయ్యా!..."

నా మాటల మద్దె అందుకుని "అదికాదు గంగన్నా.. మీ వినోదుని సూడ ఎంత గొప్ప ఆఫీసరైండు. మన రాష్ట్రానికి దేశానికే పేరు తెచ్చిండు. మిలిట్రీ యుద్ధంల ఆని సాహసానికి మెచ్చి మొన్న హైదరాబాదుల పౌరసన్మానం చేసిండ్రు. టీవీల చూసి మేము ముర్సిపోతిమి. కంటె గసుంటి బిడ్డడ్ని కనాలె.

నేను తనకు రెండు చేతుల దండం వెడ్తు "అయ్యా! అదంతా మీ దయనే. మీ సహకారం లేకుంటే నేనెక్కడుండెటోన్ని. నా కొడుకెక్కడుండెటోడు. వాడు చిన్నగున్నప్పటి సంది. మీ గొప్పతనాన్ని, మీ ఇన్సాయత్ని. మీ దయాగుణాన్ని ఎప్పుడు చెప్పెటోన్ని. ఈ జీవితం నీటి బుడగ ఎప్పుడు పగిలిపోతదో తెల్వదు. ఉన్నంతసేపు అందిరతో సఖ్యతగా ఉండాలె. నీకు తోసిన సాయం చేయాలె. పెద్దలను గౌరవించి, నైతిక విలువలు కాపాడాలె బిడ్డా! ఈ కష్టసుఖాలు చీకటి ఎలుగుల లెక్క. అస్తై పోతై గవిట్ని లెక్కవెట్టొద్దు..." గిట్ల మిమ్మల్ని గురించి చెప్పెటోన్ని..."

సత్తుడబ్బల రాళ్ళేసి ఊపుతే అచ్చే సప్పుడు లెక్క బడబడా చెప్పుకుపోతున్న. అయ్యగారు మౌన ముని లెక్క గమ్మున ఇంటున్నడు. గిట్ల మా ముచ్చట్ల నడుమ బూట్ల సప్పుడు దబదబమని ఇనవడ్డన్నైయని మాటనాపి అటు సూస్తి. పోలీసులు బిలబిలమని మా ముందరికెళ్లే ఇంట్లకు సొరబడిరి. అది సూసి హైరానైపోయినం.

"గాడేడి. బద్మాష్ వినోద్ గాడేడి? యాడ దాక్కున్నడు.." అని కేకలేసుకుంట ఇంట్ల మూలమూలన ఎతుకుతుండ్రు. అయ్యగారు కళ్ళప్పగించి బిత్తరవోయి

కథ

సూస్తున్నడు.

వాళ్ళెందుకొచ్చిరో తెల్వదు. జెర హిమ్మత్ చేసుకుని "ఏంది సారూ! ఏమైందీ" అని అడిగితి.

"మీ ఇంట్ల డ్రగ్స్ ఉన్నవని సమాచారం. అందుకే ఇంటిని సోదా చేస్తున్నం".

అప్పుడే ఎంకట్రామయ్య క్యాలికొచ్చినట్టుండు. "ఏం సార్ మా ఇంట్ల డ్రగ్సా..." అని అడుగుతుండగనే ఇంట్లో నుంచి తెచ్చిన పాకెట్లేవో చూపిస్తు "ఇవేంటివి? ఇవి కావా?" అంటూ "గా వినోద్ తల్లిదండ్రులెవరు?" అని అడిగిరి.

"నేనే సర్" అని వణుకుతూ చెప్పిండు అయ్యగారు.

"గట్లనా! గట్లైతే నడు పోలీస్టేషన్కి, యాప చెట్టుకు యాపకాయలు కాయక పోతే మామిడి కాయలు కాస్తాయా? ఎసుంటోళ్ళకు అసుంటోళ్ళు పుడ్తరు. ఏం కొడ్కును కన్నవయ్యా! నడు..." అనుకుంట బయటకు నడ్సింద్రు పోలీసులు.

మారు మాట్లాడకుండ కుక్క పిల్లోలె వారెనుక వెళ్ళిండు అయ్యగారు.

ఇదంతా గమనిస్తున్న తులిసమ్మ గోముగా ఏడుస్తున్నది నోటిమాట రాక. ఆ ఎంటనే నా కొడుకు యాదికొచ్చి ఎంటనే ఆనికి ఫోను కల్పి జరిగిన ఇషయం చెప్పితి.

"నేనిప్పుడు చెబ్బీస్ జనవరి పరేడ్ ప్రాక్టీసులో ఉన్న. కొద్దిసైనంకాల పోలీస్టేషన్కు చెప్త. నువ్వేం పరేషన్ గాకు. నీ పూచీకత్తు మీద ఒదిలేస్తరు నాన్నా!" అని చెప్పి ఫోన్ పెట్టేసిండు.

ఆ యెంబటే నేను పోలీస్టేషన్కెళ్ళిన. జమానత్ ఇచ్చి ఇంటికి తీసుకొచ్చిన. అయ్యగారు బండై పోయిండు. ఉలుకూ పలుకూ లేదు.

ఒచ్చి గట్ల కూసుంటిమో లేదో. మాసిన బట్టలు చెమటతో పెయ్యి తడ్సిపోయి ఉరుకుకుంట ఇంట్లకు ఉరికొచ్చిండు వినోదు. ఆ వెంటనే పోలీసులు సుత ఉరుకుకుంటొచ్చి క్రమ క్రమను ఎతుకు తున్నరు. "ఏయ్ వినోద్ మర్యాదగా తలుపు తెరువు. సరెండరై పో. లేకపోతే తలుపులు పల్గొట్టి నిన్ను పట్టుకపోతం" ఆళ్ళ కేకలకు తలుపులు తెర్వలే. కోపంతోని పోలీసులు తలుపులు పల్గొట్టి ఆయన్ని అరెస్టు చేసి చేతులకు బేడీలేసి పోలీస్టేషన్కు తీసికెళ్ళి ఆనంక కోర్టుకు తీసుకువోయి డ్రగ్స్ సప్లైతోని, సంఘ విద్రోహకశక్తులతోని వినోద్కు దోస్తాన ఉన్నట్లు ఖుబూల్ అయ్యింది. గందుకే ఆయనికి ఉమర్ ఖైదు సజా అయ్యింది.

**దునియల** ఎవలైనా పెద్దపెద్ద సద్దులు సద్దుడు కాదు. బుద్ధిసుత పెద్దగుండాలె. పదిమందికి సాయపడాలనే పెద్ద మనసుం డాలె. కన్నోళ్ళను, పుట్టిన దేశాన్ని ఇజ్జత్గా చూసే సంస్కారముండాలె. గట్లే కన్నోళ్ళు సుత తమ పిల్లలకు సంస్కారమైన బుద్ధులు నేర్పాలే. ముందుగాల మనం మారాలే. ఆనక పిల్లలు మారుతారు. "ఆవెట్లయితే చేన్ల మేస్తే దూడ గట్టున మేయదో గట్లే మనం ఏ తీరుగుంటే మన పిల్లలట్లనే ఉంటరనేది గుర్తుంచుకోండ్రి.

* * *

ఎంకట్రామయ్య అదృష్టమో, మా అదృష్టమో గనీ గిది జరిగినంక మా రెండు కుటుంబాలు మల్లా ఒక్కటైనయ్. మేమిద్దరం ఒకళ్ళ కొకళ్ళం తోడూనీడై ఉంటున్నం. నా కొడుకు ఉద్యోగంల తరక్కి అయి ఆఖరికి వజీఫా తీసుకుండు. నా మనవడు, అయ్య మనవడు పెద్దోళ్ళు అయింద్రు.

చూస్తుండగనే ఇరువై ఏండ్లు గడ్సిపాయె. జైల్లో వినోదులో ఎన్నో మార్పులొచ్చినై. తాను చేసిన పొరపాట్లకు ఇదే సరైన సజా అనుకుని తనలో పశ్చాత్తాపం వచ్చి మార్పు చెందిండు. గదేదో గొంగలిపురుగు సీతాకోక చిల్క అమిరటంల ఈ పిల్లోడిలో మస్తు మార్పొచ్చింది. ఆయన మారింది తెల్సు కున్న జైలు ఆఫీసర్లు కారుణ్య విడుదల కోసం సిఫారసు చేసింద్రు. సర్కారు దాన్ని ఆమోదించి మన జాతిపిత గాంధీ మహాత్ముని జయంతి నాడు విడుదల చేస్తున్నరని మా ఇద్దరి కుటుంబీకులం మస్తు ఖుషీ అయినం. ఆరోజు ఎప్పుడొస్తుందా అని ఎయ్యికండ్లతో ఎదిరిచూస్తున్నం.

చూస్తుండగనే ఆరోజు రానే వచ్చె. తయారై అందరం జైలుకెళ్ళినం అప్పుడే ఒక్కొక్కళ్ళు బయటకొస్తుండ్రుండు. మా సూపులు వినోదు కోసం ఎతుకున్నయ్. అంతట్లనే గా పిలగాడు బయటకు రానే వొచ్చి ముందుగాల నా కొడుకు ఆనంద్ చూసి "అన్నా! వినోదన్నా!" అని పిల్సుకుంట ఉరికెళ్ళి ఒక్కసారి పిలగాన్ని అములుకొని అలాయిబలాయి తీసుకొనె. ఇపుడు వినోదు మారిన మనిసి, కడిగిన ముత్యమోలె మెరుస్తున్నడు. నిట్టెం నా దగ్గరికొచ్చి ఇనయంగా నా కాళ్ళు మొక్కవోతే నేను వారించ చూసిన. అయినా ఆగలే. అటెన్క తల్లీదండ్రుల కాళ్ళకు దండం పెట్టుకున్నడు. ఆనాడు చిన్నగున్న ఆయిన బిడ్డడు పెద్దోడై పోయిండు. ఆ పిల్లగాడు "డాడీ!" అంటూ ఎళ్ళి తండ్రి అములుకున్నడు సంబురంగా. పక్కనే ఉన్న భార్య శ్వేత దగ్గరికెళ్ళి "నన్ను క్షమిస్తావా శ్వేతా!" అని ఆమె కండ్లల్లకు ఆర్తిగా చూసిండు. ఆమె తన భర్త చేతిని తీసికొని మురిపెంగా ముద్దాడింది.

దునియల ఎవలైనా పెద్దపెద్ద సద్దులు సద్దుడు కాదు. బుద్ధిసుత పెద్దగుండాలె. పదిమందికి సాయపడాలనే పెద్ద మనసుం డాలె. కన్నోళ్ళను, పుట్టిన దేశాన్ని ఇజ్జత్గా చూసే సంస్కారముండాలె. గట్లే కన్నోళ్ళు సుత తమ పిల్లలకు సంస్కారమైన బుద్ధులు నేర్పాలే. ముందుగాల మనం మారాలే. ఆనక పిల్లలు మారుతారు. "ఆవెట్లయితే చేన్ల మేస్తే దూడ గట్టున మేయదో గట్లే మనం ఏ తీరుగుంటే మన పిల్లలట్లనే ఉంటరనేది గుర్తుంచుకోండ్రి.

పిల్లల్ని కనంగనే కాదు ఆల్లని మంచోళ్ళుగా పెంచుడెంతో అవసరమని మరువొద్దు సుమా!

కథ

# ఇకమత్...!

జానపదులలోని ఇకమత్‌ను విడమర్చిన కథ...




ఉలి
99630 03033


ఇకమత్ వున్నోడె గీ జిన్దగీల ఎట్లన్న బతుకుతడు..!

గసోన్నోడికే పూలతొవ్వ దొరుకుద్దీ.. కడుపునిండా బువ్వ దొరుకుద్దీ...

సెమట కారన్గ ఎన్త కష్టం జేసినా, పెన్డ్లామ్మొరగాళ్లకి కూడెట్టకున్టే.. గా తెల్వి వున్టే ఏన్దీ..? లేకున్టే ఎన్దీ..? కోటి ఇద్దెలు కూడు కోస్రమేనన్ట..!

నడుచుకున్ట తిర్గినా, కార్లల్ల తిర్గినా, ఇమానమ్ల గాల్లే ఎగిర్నా.. కడుపుకిన్త బువ్వ కోస్రమే..!

గీ బువ్వ తినుడే లేకున్టే, మడిసి ఎట్టా బత్కేటోడో..!?

ఎ..ట్టా... బ... తి... కే...టో...డో.....!?!

★ ★ ★

బత్కుడెట్లనో తెల్వకున్టె, నెత్తిమీద బొన్ద వెట్టుకున్నట్టున్టది. గున్డెల్ల అగ్గి పెట్టుకున్నట్టునది. పైసలౌస్రమ్మొస్తె పానమల్లాడిపోద్దీ. “సెమట సుక్కలు కార్చేటోడికి.. సేతిని పని సేసేటోడికి.. ఎట్లన్నజేసి కడుపు నిన్డుతది. సేతిన్నమ్ముకొని పన్జేయ్.. నువ్వా బతుకతవ్.. నీతోటోల్లని బతికిస్తవ్..”

అరుజునుడ్కి కిట్టపరమాత్మ సెప్పినట్టు.. సిన్నప్పుడే.. నాకు బతుకు బోద సెప్పిన్ది మా ముత్తవ్వ.

సెప్పినపుడు అరుదమ్గాలె.. అర్థమయ్యే యాల్లకి ముత్తవ్వ ‘లేకపాయె’..!

ముత్తవ్వ ‘లేకపోనా’.. యాది మర్సిపోతే.. నా నీడలెక్క ఎమ్బటె వున్చుకున్న.

గసొన్టి ముచ్చట యాది మర్సిస్తే.. ‘నీడవోయిన మడిసి’ లెక్క..!

గీ ముచ్చటన్నదిగూడా నేన్గాదు. మా అయ్యనే..!

మా అయ్య అట్టానిట్టానోడు గాదు.. వోల్ నాల్గు తాలూకాల పెట్టు..!

ఊరొల్లన్దరికీ నోట్లే నాల్క లెక్క..! నోరు మన్చిదైతే, వూరు మన్చిదైతదన్టరు.

గట్ల.. మా అయ్య నోరు మన్చిది.. ఉన్న వూరు మన్చిది.. బతికున్నన్ని దినాలు కడుపునిన్డి. మా అన్దర్కి పొట్టకీ బట్టకీ సావు లేకున్డె.

గిప్పుడు సావొచ్చిపడిన్ది. సావుకే సిక్కొచ్చిపడిన్ది. నాకో, నీకో గాదు, మా ఊరొళ్లకాదు. వోల్.. పెపన్చాన్కె.

సావుతో సిక్కుముడి పడిన్ది.

మాయ్దారి మహమ్మొరి రుగ్మత..! కన్టికి కన్పిన్చని ‘కరోన’ అన్ట..!

కాయాకట్టమ్జేస్కునే నా అసొన్టోళ్ల కాలిన్గగొట్టిన్ది. నోటికాడ బువ్వ లాక్కొని, మూతికి బట్ట కట్టిన్ది, బయటడ్గుపెట్టెద్దని ఇన్టిని జైల్జేసింది.

ఇగ, కట్టమ్జెస్కొనే నాలాన్టోళ్లు బతుకుడెట్లా..?!

నా జెన్మల గిసొనిటి తక్లబ్ జిన్దగీల ఎన్నడ్రాలె..!!

పానాన్ని అర్చేతులెట్టుకొని, ఏ మూలకెళ్లి వొస్తదో.. ఏ వాడకట్టుకెళ్లొస్తదో.. అనుకున్ట యాదొచ్చిన దేవుళ్లన్దర్కి మొక్కిన. ఏ దేవుడెప్పుడు కనికరిస్తడో తెల్వదుగని, గిసొన్టి యాళ్ల ఏజ్జేసుడో.. యాదికొచ్చిన్ది.

నేను సిన్నపిల్లగానెక్కున్నప్పుడు కరువొస్తె, మా అయ్య సేసే పనిడ్సిపెట్టి, ఇన్కో పని పట్టిన్డట. అన్టే, ఏ ఎన్డకా సెత్రీ పట్టినట్టు.. ఏ కాలాన్కి ఆ తీరన్గ పన్జెసుడు.

ఆనకాలమొస్తే.. సెత్రీలు అమ్ముడు. ఎన్డకాలమొస్తే.. సెప్పులమ్ముడు. సలికాలమొస్తే.. జమ్ఖుకాన్డ్లు అమ్ముడు..

ఏదైతేనేన్ది..? దొన్గతనమో, లన్గతనమో.. సేయకున్టె సరిపాయె..!

గిది ఎన్డకాలమ్గాదు.. ఆనాకాలమ్గాదు.. సలికాలమ్గాదు..

అన్తా.. ‘పోయ్యేకాలమ్మొచ్చిన్ది’’..!!

ఏన్జేసుడు..?

ఏట్లున్డుడు..??

బతకటాన్కి ‘ఇకమత్’ గావాలె..!

బతుకుదెరువు చూపే ‘ఇకమత్’ గావాలె..!!

నాల్గు రాల్లు సమ్పాయిన్చే కిస్మత్కు తొవ్వ సూపిన్చే ఇక్మత్ గావాలె..!!

ఏన్జెయాలె..?

ఏ..న్జె...యా...లె....?

ఎన్త సౌన్సాయిన్చినా తల్కాయనొప్పి పుడ్తున్దిగనీ, ఇకమత్ పుట్టలె..!.

ఎట్జూసినా.. పామ్లెక్క బుసల్కొడ్తోన్ది తక్లిబ్..!

ఔ.. తక్లిబ్ గూడా పామ్లెక్కనె..!.

బెయపడి పారిపోతె ఎన్కవడి తర్మతది.

కట్టె వట్టుకొని సావగొడితే, సచ్చూర్కున్టది.

పిరికునోడు పారిపోతడు.

బలమునోడు కట్టెపట్టుకొని సావగొడ్తడు.

ఇకమత్ వున్నోడు..

ఇకమత్ వున్నోడేమ్జేస్తడు..?

మా అయ్య లెక్కజేస్తడు..!

ఓపాలి.. దొరవారి గడిలె.. పామ్పిల్ల వొచ్చిన్ది.

గద్జూసి అన్దరూ పానమరసేతులెట్టుకొని, ఉరుకుడే వురుకుడు..!

బతుకాలని ఆశున్దదా ఓలకైనా..?

గీ పానమీమ్న కాయిషును పట్టుకున్నడు మా అయ్య.

దొరవారు పామ్పిల్లను పట్టుకున్టె, అడిగినన్త పైసలిస్తనని ఊరన్త చాటిమ్పు సేయిన్చిన్డు.

గద్దెల్సి మా అయ్య ఎమ్బటె దొరకాడ్కి ఉర్కిన్డు.

"దొరా.. పెన్డ్లామ్పిల్లలున్నొన్ని, బతుమీన ఆశునోణ్ణి, నానొక్కణ్ణి సమ్పాయిస్తే, ఎనమన్డుగురు తిన్టరు. ఏదోటి సెయ్యాల్గద్దొర.. ఏడాది గాసమిప్పిన్చుడ్రి. బత్కినన్ని దినాలు మీ పేర్జెప్పుకొని, దన్డవెట్టుకున్టమ్దొర.. జరా, శనార్తి వెట్టుడ్రి.. తవరి కాల్లకాడ సెప్పుల్లెక్క పడున్టమ్దొర.."

అయ్య బతిమిలాడుడు జూసి, దొర ఖుషీ కొద్ది మీసమ్మెలేసి "ఇస్తపోరా, నర్సిగా.." అన్నడు.

గన్తె.. అయ్య పామ్పిల్ల లెక్కనె ఖుషీ కొద్ది మెల్కెలు తిర్గిపోయిన్డు. ఎమ్బటె, ముమ్గిస లెక్క దుక్కిన్డు.

రెన్డు సేతుల్కి రెన్డు గోనె సన్చుల్దోడుక్కున్నాడు. పామ్పిల్ల ఏడున్టె యాడ్కి వురికిన్డు. సన్దుల్లా.. గొన్దుల్లా.. దూరిన్డు, ఇటు దిర్గిన్డు.. అటు దిర్గిన్డు.. పామ్బిల్లకి మొసమర్లకున్డ జేసిన్డు. ఊర్కుర్కి మూలకి నిక్కిన పామ్పిల్లని దొర్కబుచ్చుకున్డు, దాన్తల్కాయ పట్టుకున్నడు. తోక సెయ్యి సుట్టూతా సుట్టుకున్టె, సూసెటోల్లకి పానమెల్లుకపాయె..! సల్లజెముటలు పట్టవట్టె..!!

పామ్పిల్లన్టె.. చిన్నపిల్లెగాడు.. సన్నన్గ.. మూడు మూరెల పొడుగున్నది.

నాగుమ్పాము..!

తప్పిపోయ్మెడై 'పానాల్లెపోతై'..! 'నూకలెల్లిపోతై'..!!

పానాలరిసేతులెట్టుకొని, నడుసుడే నడుసుడే..!

కాళ్లు నొచ్చినా.. నడుసుడే. కాళ్లకు బొబ్బెలొచ్చినా.. నడుసుడే.

ఏడ బువ్వ దొర్కితే, ఆడ గిస్తన్త ఎన్గిలి పడుడు. దొరక్కపోతె.. నీళ్లు తాగుడు. ఆకలైతే నీళ్లు తాగుడె... దూపైతె నీళ్లు తాగుడె..!

గట్ల నడ్సుకున్టె వొత్తున్టె.. కరోనొస్తదనీ.. రోడ్లెమ్మట రానియ్యలె. అడ్డతొవ్వల్ల వాగులు, గుట్టల్లవడొస్తే, బైటెకెళ్లొచ్చినొల్లని ఊర్లకు రానియ్యలే..! మా ఎన్బట కరోన తొల్కొచ్చినవన్నట్టే, పొలిమేరల్లనే అడ్డువడ్డారు. ఏరే దేశపొల్లను



**రెన్డు సేతుల్కి రెన్డు గోనె సన్చుల్దోడుక్కున్నాడు. పామ్పిల్ల ఏడున్టె యాడ్కి వురికిన్డు. సన్దుల్లా.. గొన్దుల్లా.. దూరిన్డు, ఇటు దిర్గిన్డు.. అటు దిర్గిన్డు.. పామ్బిల్లకి మొసమర్లకున్డ జేసిన్డు. ఊర్కుర్కి మూలకి నిక్కిన పామ్పిల్లని దొర్కబుచ్చుకున్డు, దాన్తల్కాయ పట్టుకున్నడు. తోక సెయ్యి సుట్టూతా సుట్టుకున్టె, సూసెటోల్లకి పానమెల్లుకపాయె..! సల్లజెముటలు పట్టవట్టె..!!**

సూసినట్టు.. దొన్గొల్లను తర్కినట్టు.. ఎల్లగొట్టిగ్రడు.

గీ వూర్లో పుట్టినోల్లమే.. ఈడ పెర్గినోల్లమే.. బత్కటానికొయ్యేస్తే, పొరుగూరొల్లమైనమ్.. దుష్మన్ గాళ్లమైనమ్..!

గట్లైతే.. అన్దరమ్బొరుగూరోళ్లమె..!

గీ బూమ్మీదికి.. చచ్చేదాన్క బత్కటాన్కొచ్చిన.. పొరుగూరోళ్లమె..!!

కాదన్టర..?!

ఊరవతల పాత బడిలె, పద్నాల్రో జులున్టె.. పద్నాల్లైన నర్కమ్మన్పిన్చిన్ది.

గిసోన్టి యాతన పగొడిక్కూడా రావొద్దనిన్పిన్ది.

కన్నతల్లసోన్టి పుట్టినూరిని ఇడ్సిపోయినన్దుకు.. బుద్ధి సెప్పిన్దని, లెమ్పలేసుకున్నన్న..!

ఇగెప్పుడూ.. ఊరిడ్సిపెట్టొద్దని గ్నానమొచ్చిన్ది.

ఔ.. గీడ పన్లేదని బత్కటాన్కి దేశాల్పట్టుకొని, పోతమ్గనీ.. ఈడికి బత్కటాన్కి ఎవ్దరొస్తలేరు..? ఆంధ్రోళ్లు, ఉడ్సివోటలొళ్లు.. రాజస్తాన్లు.. ఎవలెవలో, యాడియాడినున్చో ఈడికొచ్చి బత్కుతలేరా..? మనోళ్లన్దరూ.. యాడికో పోకటేన్ది..? యాడినున్చో ఈడికొచ్చి బత్కుడేన్ది..?

సమజైతలే..!!!

నాల్గు దినాలు, పద్దినాలు.. ఇర్వై దినాలు.. తల్కాయ కొట్టుకున్టె, సమజైన్ది..!

బతకాలన్టె, ఇమకత్ కావాలె..!

ఊళ్లె ఎవ్వల్లనడ్గినా.. దుబాయ్‌పో.. మస్కటోవో.. అన్టర్గనీ, ఇమకత్జెప్పరు..!

సెపితె, గిపితే.. గదీ - ‘ఇకమత్ సెప్పవే ఈరవ్వా అన్టె, ఇన్నిడ్సిపెట్టి ఇన్కోణ్ని పట్టు.. అన్నట్టునది...!

గన్దుకే.. సొన్తన్గ సొమ్సాయిచ్చినా..!

మా అయ్య సేసినట్టు...

ఆనకాలమొస్తే.. సెత్రీలు అమ్ముడు, ఎన్దకాలమొస్తే.. సెప్పులమ్ముడు. సలికాలమొస్తే.. జమ్బుకాన్డ్లు అమ్ముడు..

ఏద్దైతేనేన్ది..? దొన్గతనమో, లన్గతనమో.. సేయకున్టె సరిపాయె..!

గిది ఎన్దకాలమ్గాదు.. ఆనాకాలమ్గాదు.. సలికాలమ్గాదు..

అన్తా.. ‘పోయ్యేకాలమొమ్చిన్ది’..!!

ఏన్జెసుడు...?

ఏన్జెసుడేన్దీ..? గిప్పుడీల్లకి ఏమ్గావాల్నో గదమ్ముడు షూరు జేసిన..!

ముక్కుమూతికి కట్టుకోటాన్కి మాస్కులమ్ముడు.. చేతుల్తుడ్సుకోటాన్కి శానిటైజర్ల సీసాలమ్ముడు..!!

డెట్టాలు సీసాలు.. పినాలు సీసాలు.. గిట్ల శుభ్రన్గ వున్డెటాన్కి అన్ని అమ్ముడు షూరుజేసిన..!

బయపడ్తె.. బతుకు నర్కమ్లెక్క కనపడ్తది..!

ఇకమత్తోటి.. చూత్తే, తొవ్వ దొరుకుద్ది..!!

ఉన్న ఊర్లే.. కన్నోళ్లతోటి బత్కితే.. సుకన్గున్టది..!!



# చిటుకులు

డా॥ ప్యారక కృష్ణమాచారి , 76750 42763

పగలు వ్యాపారాలతో శోభిల్లుతుంది ఆ వీధి
రాత్రిపూట అదొక భయంకరమైన నిశీధి
పోయారో దోపిడీకి గురవడం హతవిధి
ప్రతిరోజూ అలా జరగడం అక్కడ యధావిధి

ఇద్దరూ కోరుకున్నది గెలుపనే గమ్యం
వారి మనస్తత్వాలలో ఉంది తారతమ్యం
గెలుపు కోసం వారి అనైతిక పొత్తు రసరమ్యం
ప్రజల చీత్కారంతో వారి పయనం అయ్యింది అగమ్యం

కొన్ని పథకాలు తెచ్చాయి గందరగోళం
ఆందోళనకారులతో అయ్యింది అగ్నిగోళం
సమాజ వ్యవస్థ దిగజారి చేరింది పాతాళం
మేధావులు వేసుకున్నారు తమ నోళ్ళకి తాళం

మాది ఒక అందమైన ఊరు
పుష్కలంగా లభిస్తుంది నీరు
మా ఇంటి వెనకాల వాగు ఎల్లప్పుడూ పారు
గుడి నుండి ఊరేగింపుగా వస్తుంది తేరు

## ఘనంగా డా. ఎన్ గోపి జన్మదినోత్సవం మరియు పుస్తకావిష్కరణలు



ప్రముఖ కవి డా.ఎన్.గోపి 73వ జన్మ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ తెలుగు విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో కిన్నెర ఆర్ట్స్ థియేటర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ప్రభుత్వ గౌరవ సలహాదారులు కె.వి.రమణాచారి నిరంతర వ్యాస సంపుటిని ఆవిష్కరించారు. గౌరవ అతిథి వాణిజ్య పన్నుల శాఖాధికారి హర్షవర్ధన్ "మనిషిని కలిసినట్టుండాలి" బృహత్ కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు సూర్య ధనుంజయ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్.రఘు, ఓలేటి పార్వతీశం, విశ్లేషకులు నారాయణ శర్మ, సీతారాం, డా॥ నీరజ, డా॥ నలిమెల భాస్కర్, అన్నవరం దేవేందర్, డా॥ పత్తిపాక మోహన్, ప్రొ. ముత్యం రెడ్డి, పెన్నా శివరామకృష్ణ, కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి, డా జతిన్, సుధామ, డా పొరెడ్డి రంగయ్య, కుడిక్యాల వంశీధర్ తదితర కవులు, పరిశోధకులు ప్రసంగించారు.



## ఘనంగా సమైక్య సాహితీ పురస్కారాల ప్రదానోత్సవం

సమైక్య సాహితీ సంస్థ ఆధ్వర్యంలో జూన్ 12న కరీంనగర్‌లోని ఐఎంఏ హాల్‌లో పురస్కారాల ప్రదానోత్సవం వేడుకగా జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు కలెక్టర్ జీ.వి. శ్యాం ప్రసాద్ చక్కని సంస్కృతి నేపథ్యం ఉన్న కుటుంబాల నుంచి ఉత్తమ పౌరులు పుట్టుకొస్తారని, కుటుంబాలను తీర్చిదిద్దడం ప్రధాన బాధ్యత అని తల్లిదండ్రులు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ బాధ్యత సాహితీవేత్తల పై మరింతగా ఉందన్నారు. పాఠ్యపుస్తకాల రూపకల్పనలో కీలక బాధ్యత వహిస్తున్న ఎస్ ఆర్ టి సి తెలుగు విభాగం సమన్వయకర్త సువర్ణ వినాయక్, అవధాని భాను ప్రకాశ్, మృదంగ విద్వాంసులు జయకుమార్, కథక్ కళాకారుడు పండిట్ అంజిబాబు లను పురస్కారాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈనాడు ఎడిటర్ నాగేశ్వరరావు, సమైక్య సాహితీ అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్, నారాయణ, గాజుల రవీందర్, రావికంటి శ్రీనివాస్, అనంతాచార్య, తదితరులు పాల్గొన్నారు.

## పాలపిట్ట సాహితీ మాసపత్రిక ప్రత్యేక సంచిక ఆవిష్కరణ...

బహుళ రంగాలలో విశిష్టమైన కృషి చేస్తూ, నిత్యం, నిరంతరం సృజనాత్మక అంశాలలో నిమగ్నమైన రవిచంద్ర షష్టిపూర్తి సందర్భంగా పాలపిట్ట సాహితీ మాసపత్రిక ప్రత్యేక సంచికను వెలువరించడం ముదావహమని కరీంనగర్ జిల్లా అదనపు పాలనాధికారి జి.వి. శ్యాంప్రసాద్ లాల్ అన్నారు. పాలపిట్ట, సాహితీ సోపతి, కరీంనగర్ ఫిలిం సొసైటీ సంయుక్తంగా ఫిలిం భవన్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్యాంప్రసాద్ లాల్ ప్రత్యేక సంచికను ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతూ కవిగా, రచయితగా, వ్యాసకర్తగా, విమర్శకుడిగా, ప్రచురణ కర్తగా, జర్నలిస్టుగా, దర్శకనిర్మాతగా, సినిమా చరిత్ర పరిశోధకుడిగా అద్వితీయ కృషి చేస్తున్న రవిచంద్ర ఔత్సాహికులకు దిక్సూచి లాంటివాడని అన్నారు. సాహితీ గౌతమి అధ్యక్షులు డాక్టర్ గండ్ర లక్ష్మణరావు మాట్లాడుతూ రవిచంద్ర ఎంతో గొప్ప కార్యశీలత గల వ్యక్తి అని, ఆయన ఏ పని చేసినా అందులో నిబద్ధత కనిపిస్తుందని అన్నారు. సాహితి సోపతి బాధ్యులు, కవి అన్నవరం దేవేందర్ మాట్లాడుతూ రవిచంద్ర తను చేపట్టిన పని, తను అనుకున్న లక్ష్యం నేరేవరకు విశ్రమించకుండా కృషి చేసే వ్యక్తి అని అన్నారు. తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర అధ్యక్షులు గాజోజు



నాగభూషణం మాట్లాడుతూ తండ్రి లాగా వ్యవసాయాన్ని ప్రేమించటం, నాగలిపట్టి వ్యవసాయాన్ని చూసుకోవడంతో పాటు, రచన వ్యాసంగంలో రాణించటం, మరుగున పడిన చరిత్ర వెలికి తీసేందుకు తన రచనల ద్వారా డాక్యుమెంటరీల నిర్మాణం ద్వారా రవిచంద్ర చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. రచయిత, దర్శకులు కత్తి చేతన్ మాట్లాడుతూ సంస్కృతి వారసత్వ సంపదకు దృశ్యరూపం ఇస్తున్న వ్యక్తి రవిచంద్ర అని అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టు పిఎస్ రవీంద్ర, బహు భాష కోవిదులు డా. నలిమెల భాస్కర్, కె. లక్ష్మి గౌతం, కథ రచయిత డా. బి. వి. ఎన్. స్వామి, కూకట్ల తిరుపతి, బూర్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# సద్యస్ఫురణతో శతావధానాన్ని దిగ్విజయంగా పూర్తి చేసిన "గన్నవరం"

జూన్ 28 నుండి 30 వరకు జరిగిన గన్నవరం లలితాదిత్య శతావధానం దిగ్విజయంగా పూర్తయిన సందర్భంగా గురువారం భాగ్యనగరం బొగ్గుల కుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ గౌరీభట్ల -గుమ్మనగారి వేదికగా జరిగిన విజయోత్సవ సభలో అసమాన ద్విభాషా పాండిత్యంతో, అత్యద్భుతమైన ధారణాశక్తితో, సద్యస్ఫురణతో శతావధానాన్ని దిగ్విజయంగా పూర్తి చేసిన శతావధాని గన్నవరం లలితాదిత్యను తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డా॥ కె.వి. రమణాచారి, ముఖ్యమంత్రి ప్రజాసంబంధాల అధికారి శ్రీ వనం జ్వాలా నరసింహారావు, శతావధాన సంచాలకులు శ్రీరంగాచార్య, శ్రీ పి.వి. మనోహరరావు, శాసనమండలి సభ్యురాలు సురభి వాణీదేవి, శాసనమండలి సభ్యులు శ్రీ కూర రఘూత్తం రెడ్డి దర్శనమ్ ప్రధాన సంపాదకులు మరుమాముల వెంకటరమణ శర్మ, తెలంగాణ గురుకుల పాఠశాలల విశ్రాంత ప్రధానాచార్యులు మరుమాముల దత్తాత్రేయశర్మ, 8 మంది శతావధానులు, వేలేటి మృత్యుంజ యశర్మ, బగళాముఖీ పీఠాధిపతులు శాస్త్రుల వేంకటేశ్వర్లు, వేదపండితులు జనమంచి సీతారామశర్మ తదితరుల సమక్షంలో "శతావధాని శతధృతి" బిరుదుతో సత్కరించారు.

అవధానిని సన్మానించిన అనంతరం తెలంగాణ శాసనమండలి సభ్యులు శ్రీ కూర రఘూత్తం రెడ్డి మాట్లాడుతూ.. లలితాదిత్య ధారణాప్రతిభను చూసి తనను తాను మరిచిపోయానని, తన్మయత్వం చెందానని, ఈ కార్యక్రమంలో పాల్గొనడం తన అదృష్టమని అన్నారు. తెలంగాణా ముఖ్యమంత్రి ప్రజాసంబంధాల అధికారి వనం జ్వాలానారసింహారావు మాట్లాడుతూ 22 ఏళ్లకే అమెరికాలో ఉంటూ కూడా శతావధానం చేయడం అంటే చాలా శ్రమించి ఉంటారని, అలాంటి లలితాదిత్య వందల వేల మంది లలితాదిత్యలను తయారు చేయాలని అభిలషించారు. తెలంగాణా శాసనమండలి సభ్యురాలు సురభి వాణీదేవి మాట్లాడుతూ... ఇంతమంది అవధానులమధ్య మాట్లాడడమంటే తాను సాహసం చేస్తున్నట్టేనని అంటూ... అవధానానికి తెలుగుభాషలో ఎంతో ప్రత్యేకమైన స్థానం ఉందని, బి.ఎ.లో తెలుగు చదివిన తనకు అవధానం అంటే చాలా ఇష్టమని అన్నారు.

తెలంగాణా ప్రభుత్వ సలహాదారు డా. కె.వి. రమణాచారి మాట్లాడుతూ... మూడు రోజులుగా నవ యువ శతావధాని గన్నవరం లలితాదిత్య పద్యాలను శ్లోకాలను అప్పచెప్తుంటే ఎంతో అబ్బురపడ్డానని, 32 నిముషాలలో ధరణ చేయడం చూస్తున్నప్పుడు ఒక్కొక్క పదాన్ని అవధాని పలుకుతున్న తీరు చూసి తనకు కళ్లల్లో నీళ్ళు వచ్చాయని అన్నారు.

శతావధాన సంచాలకులు శ్రీరంగాచార్య అవధానిని ప్రశంసిస్తూ... ఈ అవధానం తెలుగువారి పురాకృత పుణ్యవిశేషంగా భావిస్తున్నానని, అంతరించిపోతున్న తెలుగు భాషా గౌరవాన్ని పునరుద్దీపితం చేసే విధంగా అవధానం సాగిందని అన్నారు శతావధానం చేయడమంటే మాటలు కాదని, అలాగే నిర్వహించడమంటే మరింత కష్టమని అందుకు దర్శనమ్ సోదరులు ఎం.వి.ఆర్. శర్మ, మరుమాముల



దత్తాత్రేయశర్మలను అభినందిస్తున్నాని గన్నవరం లలితాదిత్య అవధాన గురువులు శ్రీ ధూళిపాళ మహదేవమణి అన్నారు. అదే విధంగా శ్రీ రమణాచారి గారు ధారణసభకు ముందే విచ్చేసి అవధానం పట్ల తమ మక్కువను ప్రదర్శించడం గొప్ప విషయమని ఆయన అన్నారు.

ధారణ అనంతరం జరిగిన శతావధాన విజయోత్సవ సభలో తెలంగాణా రాష్ట్రప్రభుత్వ సలహాదారు డా. కె.వి. రమణాచారి, ముఖ్యమంత్రి ప్రజాసంబంధాల అధికారి శ్రీ వనం జ్వాలా నరసింహారావు, శతావధాన సంచాలకులు శ్రీ రంగాచార్య, శ్రీ పి.వి. మనోహరరావు, శాసనమండలి సభ్యురాలు సురభి వాణీదేవి, దర్శనమ్ ప్రధాన సంపాదకులు మరుమాముల వెంకటరమణ శర్మ, తెలంగాణ గురుకుల పాఠశాలల విశ్రాంత ప్రధానాచార్యులు మరుమాముల దత్తాత్రేయశర్మ, 8 మంది శతావధానులు - (డా॥ దోర్బల ప్రభాకరశాస్త్రి, డా॥ జి.యం. రామశర్మ, శ్రీ ధూళిపాళ మహదేవమణి, డా॥ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, శ్రీ గండ్లూరి దత్తాత్రేయశర్మ, శ్రీ ఆముదాల మురళి, రాంభట్ల పార్వతీశ్వర శర్మ, శ్రీ ఐతగోని వేంకటేశ్వర్లు) - పసర్ల శ్రీవల్లి సుబ్బలక్ష్మి, శంకరమఠం కృష్ణారావు, అవధాని సురభి శంకరశర్మ, రంగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## వి ఆర్ శర్మకు పెండెం జగదీశ్వర్ స్మారక జాతీయ పురస్కారం

ప్రముఖ బాలసాహితీవేత్త, బాల సాహిత్య పరిశోధకుడు డాక్టర్ వి ఆర్ శర్మకు 2022 సంవత్సరానికి గాను పెండెం జగదీశ్వర్ స్వారక జాతీయ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు సాహితీ మిత్రమండలి అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల మూడవ తేదీన నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సాహిత్య అభిమానులు హాజరై జయప్రదం చేయవలసిందిగా కోరారు.

స్వీ
కా
రం




## వెలుగు దివెవ్వలు

పిల్లి హజరత్తయ్య
సెల్ : 98486 06573

శ్రీశ్రీ కళా వేదిక
ప్రకాశం
వెల : రూ.150/-




## కల్లుపాట

అంబటి వెంకన్న

జాబిలి కళామండలి
నల్లగొండ
సెల్ : 99663 76072
వెల : రూ.100/-




## ఆశల ఆమని

సావిత్రి రంజోల్కర్
సెల్ : 90595 2519

జయహేర పబ్లికేషన్స్
ముంబయి
వెల : రూ.100/-




## షాయర్ సాబ్

ఆశారాజు
93923 02245

విశాలాంధ్ర పబ్లికేషన్స్
నవనీత పబ్లికేషన్స్
నవోదయ పబ్లికేషన్స్
వెల : రూ.200/-




## తూరుపు సింధూరం

మయూరి (డా॥ గడ్డం శ్యామల)
సెల్ : 97041 75183

శాంతి కృష్ణ
హైదరాబాద్
వెల : రూ.120/-




## కిష్టడి కతలు

ఆర్.సి. కృష్ణస్వామిరాజు
సెల్ : 9393662821

సమత పబ్లిషర్స్
విశాఖపట్నం
వెల : రూ. 140/-




## ముత్తడి దునికిన కోపుల నీల్లు

డా॥ వెన్నం ఉపేందర్
సెల్ : 94412 68861

నవోదయ బుక్ హౌస్
హైదరాబాద్
వెల : రూ.100/-



## దేహ నాగర లిపి

బి.ఎస్.ఎమ్. కుమార్
సెల్ : 97050 85143

నవదోయ, నవతెలంగాణ పుస్తక
కేంద్రాలు, హైదరాబాద్
వెల : రూ. 300/-




## రెప్పవాలని రాత్రి

వంశీకృష్ణ
ఫోన్ : 95734 27422

నవదోయ, నవతెలంగాణ
పుస్తక కేంద్రాలు, హైదరాబాద్
వెల : రూ.150/-




## తెలంగాణ నాటక రంగ చరిత్ర

తాటికొండాల నరసింహారావు
ఖమ్మం
ఫోన్ : 98857 87250

వెల : రూ. 300/-



# వేముగంటి నరసింహాచార్యులు

**(14-07-1930 - 29-10-2006)**

ఇరవయ్యవ శతాబ్ది ప్రథమార్ధంలో జన్మించి ద్వితీయార్ధంలో హృద్యమైన పద్యప్రసూనాలతో తెలుగు భారతిని అర్చించిన వేముగంటి, తెలంగాణాకు వన్నె తెచ్చిన కవి పుంగవులలో అగ్రశ్రేణికి చెందినవారు. ఆరు దశాబ్దాల పాటు సాగిన తమ అద్భుత కవితా సృష్టితో పోతన, విశ్వనాథ, జాషువా, దాశరథి, కరుణశ్రీ వంటి కవుల సరసన సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్న సాహితీ మూర్తి వేముగంటి.

వేముగంటి వారి రచనలను పలు విశ్వవిద్యాలయాలు పాఠ్యాంశాలుగా స్వీకరించాయి. తిక్కన కావ్యాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఆంధ్రవిష్ణువు కావ్యాన్ని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం, గుల్బర్గా విశ్వవిద్యాలయం పాఠ్యాంశాలుగా స్వీకరించాయి. తెలంగాణా ప్రభుత్వం వీరి మంజీరానాదాలను పాఠ్యాంశంగా స్వీకరించింది. తెలుగు విశ్వవిద్యాలయం, "గౌరవ డాక్టరేట్" ఇచ్చి సత్కరిస్తే, భారత మాజీ రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి "విద్వత్కవి" అన్న బిరుదుతో సత్కరించారు. కవికోకిల, సుకవిభూషణ అన్నవి వారికున్న మరికొన్ని బిరుదులు .